
NK01A111

# డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ
# శతజయంతి మహోత్సవం
## జ్ఞాపిక



డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ కళాపీఠం

విజయవాడ



శ్రీ నాళం కృష్ణారావు గారి కుటుంబం

# డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ
# శతజయంతి
# మహోత్సవ సంచిక

డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ కళాపీఠం

విజయవాడ

**డా. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ**

**శతజయంతి మహోత్సవ సంచిక**


సంపాదకులు :

**కోకా విమలకుమారి**

ముద్రణ :

**కోకా విమలకుమారి**

వ్యవస్థాపక అధ్యక్షురాలు

**డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తనమ్మ కళాపీఠం**

విజయవాడ. సెల్ : 98856 76531

బుక్ మేకింగ్ & ప్రింటింగ్

శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ – 2, సెల్ : 9490634849

**MANDALI BUDDHA PRASAD**
*Depurty Speaker*
*Andhra Pradesh Legislative Assembly*

**మండలి బుద్ధప్రసాద్**
ఉపసభాపతి
ఆంధ్రప్రదేశ్ శాసనసభ

Ph. Off : 0863 - 2450012
Cell : 98487 80872
Velagapudi
Amaravati - 522 503

వెలగపూడి
అమరావతి - 522 508

# వాగ్దేవి విలాసములో లక్ష్మీకాన్తమ్మ

ఆధునిక తెలుగు సాహిత్యం మొగ్గతొడుగుతున్న దశలో దానికి పట్టుగొడుగులెత్తిపట్టుకొని ఎందరో యువ రచయిత్రులు సాహిత్య కేదారాలలో అక్షరాంకురాలు చల్లటానికి ప్రోత్సాహాన్ని అందించిన విదుషీమణి డాక్టర్ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ.

తెలుగు సాహిత్య పురాచరిత్రను త్రవ్వి తట్టలకు ఎత్తి అందులో ఎందరో నారీమణులు సృజించిన కవిత్వ రత్నాలను వెలికితీసి నేటి తరానికి స్ఫూర్తిని అందించారు. మనం "భువనవిజయం" ప్రదర్శనను చాలాసార్లు చూసిఉంటాము. అందులో మహా అయితే కవయిత్రి మొల్లపాత్ర ఒక్కటే మహిళది. మిగిలినవారంతా పురుషులే. లక్ష్మీకాన్తమ్మ గారు "సరస్వతి సామ్రాజ్య వైభవము" పేరుతో భారతీ దేవి వాహనమైన హంస ఆధ్వర్యమున లక్ష్మీ సరస్వతీపార్వతులే గాక ప్రసిద్ధ భారతీయ కవయిత్రులతో సభ నిర్వహిస్తున్నట్లుగా రూపకాన్ని రచించి దానిలో స్వయముగా పాల్గొని, ఎన్నో ప్రదర్శనలు కూడా ఇచ్చారు. ఆమె ఎంత స్వాభిమానము గల మహిళో ఈ సంగతి వలన మనకు అర్థమవుతుంది.

శ్రీమతి లక్ష్మీకాన్తమ్మ గారితో నాకు ప్రత్యక్ష పరిచయముండేది. మా నాన్న విద్యా, సాంస్కృతిక, శాఖామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారిని సోదరునిగ భావించేది. "మనసాహితీ–మధుభారతి" అనే గ్రంథాన్ని మా నాన్నగారికి అంకితం చేశారు. ఆ కార్యక్రమం అవనిగడ్డ, గాంధీక్షేత్రంలో జరిగింది. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలలో ఆమె ప్రముఖ పాత్ర నిర్వర్తించింది. బాపట్ల వెళ్లినప్పుడు మా నాన్నగారు వారింటికి వెళ్తుండేవారు. ఆ విధంగా వారితో పరిచయం కావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఆమె గొప్ప సాహస వనిత. తండ్రి నాళం కృష్ణారావు గారికి తనయగానే కాకుండా సాహితీ వారసురాలుగ, తండ్రిని మించిన తనయగ పేరొందింది.

ప్రథమ ప్రపంచ తెలుగు మహా సభల ప్రత్యేక సంచికలో ఆమె తెలుగు కవయిత్రులపై చక్కని వ్యాసము వ్రాశారు. ఆమె ఆత్మకథ పేరు "సాహితీ రుద్రమ". మహిళాలోకంలో సారస్వతాన్ని ప్రోత్సాహించటానికి డా॥

కేసరి గారిచే ఇవ్వబడిన "గృహలక్ష్మీ స్వర్ణకంకణాన్ని" ఆమె పొందారు. తంజాఊరు రఘునాధనాయకుని ఆస్థాన కవయిత్రి "మధురవాణి" తెలుగున తొలి కనకాభిషేకము పొందిన విద్వన్మణి. ఆ తరువాత లక్ష్మీకాన్తమ్మ గారికే అంతటి ఘనసన్మానాలు. గజారోహణము జరిగాయి. "నా తెలుగు మాంచాల", "అఖిల భారత రచయిత్రులు" వంటి రచనలు చేసి "తెలుగుమొలక", "ఆంధ్ర సరస్వతి" వంటి బిరుదులు పొందిన లక్ష్మీకాన్తమ్మ గారు 1917లో జన్మించారు. 2017లో వారి శతాబ్ధి ఉత్సవము జరపటం ముదావహం.

డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ కళాపీఠం నెలకొల్పి, వ్యవస్థాపక అధ్యక్షురాలుగా గత 15 సంవత్సరాలుగా సాహితీ సేవ చేస్తున్న శ్రీమతి కోకా విమల కుమారిగారికి, అధ్యక్షులుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా॥ గుమ్మా సాంబశివరావు గారికి అభినందనలు.

మండలి బుద్ధప్రసాద్

**Dr. D. Vizai Bhaskar,** M.A., Ph.D.
Director

**Department of Language and Culture,**
**Government of Andhra Pradesh**
2nd Floor, G.V.R. Govt. Music and Dance College Building,
Durgapuram, VIJAYAWADA - 520003, A.P.
Ph: 0866 : 2434390 / 380, Cell: +91 97013 85103
Email: apdirectorculture@gmail.com

శ్రీమతి కోకా విమలకుమారి గత 15 సంవత్సరాలుగా డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ కళాపీఠం స్థాపించి భాషా సాహిత్య, సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుటేగాక ఆమెపేరుమీద ప్రతిఏటా ఒక మహిళామణికి పురస్కార ప్రదానం చేస్తున్నారు. ఆమెకు నా అభినందనలు.

ఈ సంవత్సరం ది. 24-12-2017న లక్ష్మీకాన్తమ్మగారి శత జయంతి సందర్భంగా విమలకుమారి నిర్వహించు పురస్కార ప్రదానోత్సవ సభ విజయవంతం కావాలని కోరుచున్నాను.

భవదీయ

14/12

సంచాలకులు

గద్దె రామమోహన్, M.Sc., Ex. MP.
M.L.A., విజయవాడ తూర్పు

డోర్ నెం. 74-20-5సి
అశోక్‌నగర్, విజయవాడ - 520 007
ఫోన్ : 0866 - 2499999
సెల్ : 98481 20700
E-mail : gaddeexmp@gmail.com

To
SMT. KOKA VIMALA KUMARI,
VIJAYAWADA.

Respected Madam,

Smt, Koka Vimala Kumari is well known literary woman. Since so long I know her. She is working with so many literary associations sincerely. At Present she is organizing Dr. Vutukuri Lakshmikantamma Kalapitam, who is most popular literary woman of Vubhaya Bhasha Pravina.

On 24-12-2017, She is going to organize Dr. Lakshmikantamma Satajayanti Function at Vijayawada, on this occasion I appreciate her & Continue her endeavour forever.

Thanking You,

Yours Sincerely,

(GADDE RAMA MOHAN)

केन्द्रीय हिंदी समिति
भारत सरकार
కేంద్రీయ హిందీ సమితి
భారత ప్రభుత్వం
CENTRAL HINDI COMMITTEE
GOVT. OF INDIA

स्य :
ार्य यार्लगड्डा लक्ष्मीप्रसाद
.डी. (हिंदी), पीएच.डी. (तेलुगु)
सांसद (राज्य सभा)

సభ్యులు :
ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్
పిహెచ్.డి. (హిందీ), పిహెచ్.డి. (తెలుగు)
రాజ్యసభ పూర్వ సభ్యులు

MEMBER :
Dr. Lakshmi Prasad Yarlagadda
Ph.D. (Hindi), Ph.D. (Telugu)
Former Member of Parliament (Rajya Sabha)

'పద్మభూషణ్' పురస్కార గ్రహీత


# అభినందన

ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారి పేరు చెప్పగానే ఆంధ్ర కవయిత్రుల, అఖిల భారత కవయిత్రుల గ్రంథాలు గుర్తుకు వస్తాయి. ఈ గ్రంథాల రచనకోసం ఆమె పడిన శ్రమ ప్రతి పుటలోను ప్రతిబింబిస్తుంది. మధురకవి నాళం కృష్ణారావు గారి పుత్రికగా వారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని విశిష్ట సాహిత్య సేవ గావించిన విదుషీమణి లక్ష్మీకాంతమ్మ. పిన్నవయస్సులోనే జాతీయోద్యమంలో పాల్గొన్న దేశభక్తురాలు. బాలికల విద్యకోసం నిరంతరం శ్రమించిన సంఘసేవకురాలు. మాన్యులు డా.బెజవాడ గోపాలరెడ్డి గారితో జరిగిన సంభాషణల్లో వారు లక్ష్మీకాంతమ్మ గారి ప్రతిభను గూర్చి, ముఖ్యంగా వక్తృత్వ పటిమను గూర్చి ప్రశంసిస్తూ ఉండేవారు. సాహితీ రుద్రమగా తెలుగు పాఠకుల మదిలో నిల్చిన ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు పుట్టి ఇప్పటికి వందేళ్ళు పూర్తయ్యాయి.

ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారికి ఆత్మీయ సోదరిగా మెలగిన శ్రీమతి కోకా విమలకుమారి గారు లక్ష్మీకాంతమ్మ గారి పేరుతో ఒక కళా పీఠాన్ని స్థాపించి ప్రతి సంవత్సరం ఒక రచయిత్రిని లక్ష్మీకాంతమ్మ గారి పురస్కారంతో సత్కరించటం అభినందనీయం. లక్ష్మీకాంతమ్మ గారు రచించిన 'సరస్వతీ సామ్రాజ్య వైభవం' అనే సాహిత్య రూపకంలో 'కలభాషిణి' పాత్రను ధరించి ఆమె మెప్పును పొందిన ప్రతిభామూర్తి కోకా విమలకుమారి గారు.

ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారి శతజయంతి సందర్భంగా ఒక ప్రత్యేక సంచికను కోకా విమలకుమారి గారి సంపాదకత్వంలో వెలువరించటం ముదావహం. శతజయంతి సభ విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తున్నాను.

అభినందనలతో...

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

**B.S. Krishnamurthy**
*Chairman*

BOMMIDALA SRIKRISHNA MURTHY
FOUNDATION

# 4-4-120 BTC House,
5th Lane, Chandramouli Nagar,
Guntur - 522 007, A.P.

*SPOORTHI AWARDS*

01-11-2017

శ్రీమతి కోకా విమలకుమారిగారికి నమస్కారములు,

ఆర్యా!

"కళాప్రపూర్ణ" ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి జీవితం సాహసోపేతమయినది. తల్లిదండ్రుల, భర్త అండదండలు ఆమెకు బాగా ఉపకరించాయి.

గొప్ప పరిశోధకురాలుగా, అనువాదకురాలుగా, ఉపన్యాసకురాలుగా, కవయిత్రిగా సాహితీలోకంలో లక్ష్మీకాంతమ్మగారు పేరుపొందారు.

ఆమెతో ఉన్న పరిచయంతోను, ఆమెపట్లగల గౌరవంతోను మీరు లక్ష్మీకాంతమ్మగారి శతజయంతి సందర్భంగా సావనీర్ తీసుకొస్తున్నందులకు మీకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

1/11/17
(B.S. Krishnamurthy)

**డా॥ ఈమని శివనాగిరెడ్డి స్థపతి**

ముఖ్యకార్యనిర్వహణాధికారి,

కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ & అమరావతి.

THE CULTURAL CENTRE OF VIJAYAWADA

తెలుగునాట ప్రసిద్ధిపొందిన గౌతమీగ్రంథాలయ వ్యవస్థాపకులు, తేటగీతుల్లో అనేక కవితాఖండికల్ని, వెలువరించిన మధురకవి నాళం కృష్ణారావు గారి ప్రియపుత్రిక ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ- చిన్ననాటనే జాతీయభావాలను అలవర్చుకున్న విశిష్ట మహిళామణి. పద్య, గేయ రచనలే కాకుండా ఆంధ్ర, అఖిల భారత కవయిత్రుల రచనా విశేషాల్ని గ్రంథస్థం గావించిన ప్రతిభామూర్తి. గుర్రపుస్వారీ నేర్చిన ఏకైక తెలుగురచయిత్రి.


ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి పేరుతో ఒక కళాపీఠాన్ని స్థాపించి, దానిద్వారా తెలుగుభాషాభిమానాన్ని కలిగించే కార్యక్రమాలు, రచయిత్రులకు పురస్కారాలు అందించటం, మొదలైన సత్సంప్రదాయాల్ని సాగిస్తున్న ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి కోకా విమలకుమారిగారి కృషి స్తుతిపాత్రం. లక్ష్మీకాన్తమ్మ గారి శతజయంతి సందర్భంగా ఒక ప్రత్యేక సంచికను తీసుకురావటం మెచ్చుకోదగిన విషయం.

**డా॥ ఈమని శివనాగిరెడ్డి స్థపతి,**


# డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ కళాపీఠం

# విజయవాడ


## కార్యవర్గం




శ్రీ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తిగారు
గౌరవ అధ్యక్షులు



శ్రీమతి కోకా విమలకుమారి
వ్యవస్థాపక అధ్యక్షురాలు




డా॥ గుమ్మాసాంబశివరావు
అధ్యక్షులు



డా॥ వెన్నా వల్లభరావు
ఉపాధ్యక్షులు




శ్రీమతి మైధిలి
ఉపాధ్యక్షులు



డా॥ రావెళ్ళ శ్రీనివాసరావు
కార్యదర్శి



శ్రీమతి పి. జయశ్రీదేవి
సంయుక్త కార్యదర్శి



శ్రీ కోకా నాగేంద్రరావు
కోశాధికారి



డా॥ బి. రెజీనా
సలహాదారు

ఇదీ వరుస......


| | | | |
|---|---|---|---|
| 01. | లక్ష్యసాధన | – కోకా విమలకుమారి | 13 |
| 02. | మహోన్నత చారిత్ర డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ వ్యక్తిత్వ వికాసం | – ఊటుకూరి సుహాసిని | 15 |
| 03. | మహిళా చైతన్యదీప్తి 'సాహితీరుద్రమ' 'కళాప్రపూర్ణ', ... | – విహారి | 17 |
| 04. | కైమోడ్పు | – ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం | 21 |
| 05. | విరామమెరుగని విదుషీమణి లక్ష్మీకాంతమ్మ! | – ఆచార్య ఎస్.గంగప్ప | 24 |
| 06. | ఊటుకూరి లక్ష్మీ కాన్తమ్మ రచనా వైశిష్ట్యం | – డా॥ గుమ్మాసాంబశివరావు | 27 |
| 07. | కళాప్రపూర్ణ లక్ష్మీకాన్తమ్మ | – డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి | 30 |
| 08. | "సాహితీరుద్రమ" ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ | – ప్రొఫెసర్ వెలమలసిమ్మన్న | 31 |
| 09. | ధీరవనిత | – డా॥ రావెళ్ళ శ్రీనివాసరావు | 35 |
| 10. | లక్ష్మీకాన్తమ్మగారు – నేను | – డా. చిల్లర భవానీదేవి | 37 |
| 11. | ఆంధ్రసాహిత్యంలో అపర రుద్రమాంబ | – డా॥ సి. నారాయణరెడ్డి | 41 |
| 12. | తండ్రివారసత్వాన్ని నిలబెట్టిన కూతురు | – డా॥ పాకనాటి సూర్యకుమారి | 42 |
| 13. | విద్వత్కవయిత్రి– ఊటుకూరి | – డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు | 44 |
| 14. | మధురకవి ః మధుర కవయిత్రి | – డా॥ దాశరథి | 45 |
| 15. | మహిమాన్విత మహిళామణి శ్రీమతి డా. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ | – డా. గుండ్లపల్లి రెజీనా | 46 |
| 16. | సంగీత విద్రుమ – సాహితీ రుద్రమ | – డాక్టర్ ఆరుద్ర | 47 |
| 17. | ఒక సంభాషణ | – డాక్టర్ సంజీవదేవ్ | 49 |
| 18. | ఊటుకూరి కిరణాలు | – రావి రంగారావు | 52 |
| 19. | ఆంధ్ర సరస్వతి | – చిట్టిప్రోలు కృష్ణమూర్తి | 53 |
| 20. | మహిళా మార్గదర్శి | – డా॥ ముక్తేవి భారతి | 55 |
| 21. | డాక్టర్ లక్ష్మీకాన్తమ్మ గారి ప్రసంగాలు | – జి.వి. జ్వాలానరసింహాశాస్త్రి | 57 |
| 22. | ఆధ్యాత్మిక రసధుని | – బి.ఎస్. నారాయణ భట్టు | 59 |

| | | | |
|---|---|---|---|
| 23. | ఈ తరం మహిళ | – డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి | 60 |
| 24. | అనర్గళం–అద్వితీయం లక్ష్మీకాన్తమ్మగారి ఉపన్యాసం | – డా॥ వెన్నా వల్లభరావు | 61 |
| 25. | నేటి తరానికి ఆదర్శంగా నిలిచే ............. | – శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి | 63 |
| 26. | ఓం శ్రీ సత్య సాయి బాబాయై నమః | | 66 |
| 27. | శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి | ఉపన్యాసము | 70 |
| 28. | గృహీత కాశీస్సు | కూర్పు డా॥ జి.వి. పూర్ణచంద్ | 72 |
| 29. | 1953వ సం॥మున జరిగిన జయంతి ఉత్సవముల సందేశములు | రా. సుబ్బారావు | 74 |

# లక్ష్యసాధన

ఉభయభాషా ప్రవీణ విద్వత్ కవయిత్రి డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి శతజయంతి ఉత్సవానికి విచ్చేసి కళాపీఠం ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసిన మహామహులు, మేధావులు సాహితీవేత్తలు సాహితీప్రియులకు మాసంస్థ తరపున గౌరవాభివందనాలు సమర్పించుకొంటున్నాను.

40 సంవత్సరాల నా సాహితీ ప్రస్థానంలో సాంస్కృతీ సమాఖ్య శ్రీనాళం కృష్ణారావు కళాపీఠం, తెలుగుభాషా చైతన్యసమితి, కళాభారతి వంటి సంస్థలలో అధ్యక్ష కార్యదర్శివంటి కీలక పదవులనలంకరించి తెలుగు భాషా సాహిత్య సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న నేను గత ముప్పై సంవత్సరాలుగా ఉభయభాషా ప్రవీణ, కళాప్రపూర్ణ స్వర్ణాభిషిక్త, స్వర్ణకంకణగ్రహీత ఆదిగా గల బిరుదుల హారాన్ని ధరించి సాహిత్య సామాజిక స్వాతంత్ర్యోద్యమ సేవలలో తరించిన విదుషీమణి డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి పేరుమీద కళాపీఠాన్ని స్థాపించి పైన పేర్కొన్న కార్యక్రమాలతో బాటు ప్రతి సంవత్సరం డిశెంబరు 21వ తేదీన ఆమె జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సాహిత్య సామాజిక సేవలలో ప్రఖ్యాతి గాంచిన ఒక మహిళామణికి లక్ష్మీకాన్తమ్మగారి పేరుమీద నగదు, జ్ఞాపిక, శాలువ సత్కారంతో బాటు పురస్కారం అందజేయడం జరుగుచున్నది.

లక్ష్మీకాన్తమ్మ గారు విదేశీయుల ఆహ్వానంపై జర్మని, జపాన్ టొరంటొ మొదలగు దేశాలలో పర్యటించి అక్కడి ప్రజలలో మన తెలుగు భాషాసంస్కృతులను ప్రచారం గావించిన మహామనీషి. ఆంధ్రకవయిత్రులు, అఖిల భారత రచయిత్రులు, జాతిపిత, సదుక్తిమంజరి, కాంతి శిఖరాలు, కన్యకమ్మనివాళి, సరస్వతీ సామ్రాజ్యవైభవంవంటివి, సాహితీరుద్రమ జీవితచరిత్రను రచించి వినుతికెక్కిన విదుషీమణి డా॥ లక్ష్మీకాన్తమ్మగారు.

రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీలలోను, విశ్వహిందూపరిషత్తు, ఆర్యవైశ్యసంఘం వంటి సంస్థలలో కీలకమైన పదవులను అది సమర్థవంతంగా నిర్వహించుటేగాక బాపట్లలోని స్త్రీ హితైషిణిమండలి అధ్యక్షురాలిగా మహిళలకు విద్య, వృత్తి, ఉపాధి వంటి సేవలెన్నింటినో అందించారు. తన పదమూడవ ఏటనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని కీలక పాత్రను పోషించారు. ముఖ్యంగా ఆమె మహిళోద్యమ స్ఫూర్తి ప్రశంసనీయమైనది. అభ్యుదయపథంలో స్త్రీ అభ్యున్నతిని కాంక్షించి స్త్రీహితైషిణి మండలి, శారదానికేతన్ వంటి సామాజిక విజ్ఞాన సమితులను స్థాపించి మహిళాభ్యుదయపదంలోను, సంఘసేవలోను విశేషంగా పాల్గొని తరించారు. అనేకసేవాసంస్థలకు, బీదవిద్యార్థులకు ,దేవాలయాలకు విరివిగా విరాళాలిచ్చేవారు. వీరి ఆధ్వర్యంలోని మహిళాభ్యుదయసంస్థలు రాష్ట్రవ్యాప్తంగా మెరుగులు దిద్దుకొని అభివృద్ధిపదంలో పయనించేవి.

వీరి ఉపన్యాసం అనర్గళం- వీరి మహిళాభ్యుదయ ఉపన్యాసాలకు ఆంధ్రదేశం అన్ని దిశలనుండి ఆహ్వానాలు

వచ్చేవి. పన్నెండుసంవత్సరాల వయసులోనే లక్ష్మీకాన్తమ్మగారు పికెటింగులకు వెళ్ళడం, ఖాదీవస్త్రాలు అమ్మడం, విదేశీ వస్త్రాలు తగులబెట్టడం వంటి సత్యాగ్రహోద్యమ కార్యక్రమాలలో పాల్గొనేవారు. వీరి "ఆంధ్రకవయిత్రులు" గ్రంథం ద్వారా 264మంది రచయిత్రులను వెలుగులోనికి తెచ్చారు. లక్ష్మీకాన్తమ్మగారు తమ "అఖిలభారత రచయిత్రులు" గ్రంథరచనకు మూడు సంవత్సరాలు కష్టపడి వివిధ రాష్ట్రాలు పర్యటించి వివిధ భాషల వారి చిరునామాలను సేకరించి విజయం సాధించారు. తద్వారా అఖిల భారత స్థాయిలో కేంద్రప్రభుత్వం వారి ఆర్థికసహాయంతో శ్రీమతి కాసు రాఘవమ్మగారు ఆహ్వాన సంఘాధ్యక్షులుగను ప్రసిద్ధ సినీనటి రచయిత్రి శ్రీమతి భానుమతీ రామకృష్ణ, శ్రీమతి నాయిని కృష్ణకుమారి మొదలగువారి కార్యవర్గంలో శ్రీమతి లీలావతీమున్షీగారి అధ్యక్షతన శ్రీమతి విజయలక్ష్మీ పండిట్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి ఆధ్వర్యంలో వరుసగా ఏడురోజులపాటు అఖిలభారతస్థాయిలో అత్యంత వైభవంగా రచయిత్రుల మహాసభలు జరిపించారు.

లక్ష్మీకాన్తమ్మగారి సామాజిక సేవలకు నిదర్శనంగా ఒక సంఘటన ఆమె ఎనిమిది మాసాల గర్భిణిగా ఉన్న సమయంలో అమరావతిలో 'గోవధ' జరుగుచున్నదని విని ఇంట్లోవారు ఎంత వాదించినా వినకుండా కార్యకర్తలు తెచ్చిన కారులో అమరావతికి వెళ్ళారు. వధ్యశిలముందు నిలబడి ముందు నాతలనరికి తదుపరి గోవును వధించమని చెప్పగానే అందరూ ఆశ్చర్యచకితులై ఆమెను వెనక్కుతెచ్చారు. ఆవిధంగా అప్పటి గోవధను ఆపగలిగారు లక్ష్మీకాన్తమ్మగారు.

20వ శతాబ్దంలో గజాధిరోహణం, కనకాభిషేకాది సన్మానాలను, కళాప్రపూర్ణ గౌరవాన్ని పొందిన ఏకైక మహిళ ఆమె. గలగలపారే గంగా ప్రవాహంతో సమానమైన ఆమె గంభీరవాణి దేశవిదేశాలలోనూ మారుమ్రోగింది. 1996 డిశెంబరు మాసంలో ఒకటవ తేదీన ఆమె పరమపదించారు.

అంతటి గొప్ప వ్యక్తిత్వం సంతరించుకొన్న పుణ్యమూర్తి నాకు సాహితీగురువులైన డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి ఔన్నత్యాన్ని సాహితీ సౌరభాలను మరుగున పడనీయక వెలుగులోనికి తెచ్చి సాహితీ ప్రపంచంలో వ్యాప్తిచేయాలనే లక్ష్యసాధనతో డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ కళాపీఠాన్ని స్థాపించి నాటి నుండి నేటి వరకు తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణగావిస్తున్నాను.

ఈ సంవత్సరం అనగా 2017, డిశెంబరు 21వ తేదీన ఆమె శతజయంతి. ఈ సందర్భంగా ది.24-12-2017వ తేదీన ఆదివారం ఉదయం 9గం.ల నుండి సాయంకాలం వరకు ఘనంగా విజయవాడ హోటల్ ఐలాపురం నందు శతజయంతి వేడుకలు నిర్వహించాము.

లక్ష్మీకాన్తమ్మగారి శతజయంతి సందర్భంగా కొందరు వదాన్యులు ఎంతో ఔదార్యంతో తమ సహాయసహకారాలను అందించారు. వారందరికి నాకృతజ్ఞతాభివందనాలు సమర్పించుకొంటున్నాను. నాకు సహకరించిన ప్రాంతీయ కార్యకర్తలు, సమన్వయకర్తలు అందరకు నా ధన్యవాదములు.

"సర్వేజనాసుఖినోభవంతు"!

ఇట్లు

**కోకా విమలకుమారి**

# మహోన్నత చారిత్ర డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ వ్యక్తిత్వ వికాసం

- ఊటుకూరి సుహాసిని

పుడమిపై ప్రభవించే జీవజాలమంతా ఆభగవానుని చిద్విలాసమే. జీవులందరితో మానవ జన్మ మహోత్కృష్ట మైనదను విషయం సర్వవిదితం. అయినా మానవులందరూ మహోన్నతులు కాజాలరు. కొందరు మాత్రమే అసదృశ స్థాయికి ఎదుగుతారు. భారతమాత ఒడిలో ప్రపంచ ప్రసిద్దిపొందిన వేదోద్ధారులు, తాత్వికులు, శాస్త్రజ్ఞులు, కళాకారులు, సచ్చిదానంద స్వరుపులు ఎందరో ఉద్భవించారు. ప్రపంచానికి తమ తమ పరిమళాన్ని వెదజల్లి తమ తల్లిని హిమోత్తుంగ శిఖరాగ్రాలకు చేర్చారు. అట్టివారిలో ధన్యచరిత, మాన్య, సౌమ్యమూర్తి, సుగుణశీల, గంభీరమృదు మధుర స్వభావిని కీ.శే. డా.కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ ఒకరు.

పువ్వు పుట్టగానే తన తావులను విరజిమ్ము సర్వులను ఆనందపరవశులను చేసినట్లే లక్ష్మీకాన్తమ్మకూడా చిన్ననాటి నుండే అసమాన ప్రజ్ఞాపాటవాలతో ఎదుటివారిని సమ్మోహపరచింది. రాజమహేంద్రవర వాసులైన “మధురకవి” కీ.శే.నాళము కృష్ణారావు, సుశీలమ్మల గర్భశుక్తి ముక్తాఫలంగా జన్మించింది. తనువు చాలించే వరకు తన ప్రజ్ఞాపుష్పసౌరభాలను నేల నలుచెరగులా వెదజల్లిన అనర్ఘరత్నం. సంగీత, సాహిత్యాది లలిత కళాప్రావీణ్యం, సమాజ సేవా తత్పరత, ఉత్తమాఇల్లాలిగా మహోన్నత చారిత్రగా వెలుగొందిన వైనం వెలకట్టలేనిది. తన సంతానమైన మమ్మల్ని ఉత్తములుగా తీర్చిదిద్దిన తులలేని మాతృమూర్తి. తల్లిదండ్రుల మధురకవితా వైభవం, దేశభక్తి, సమాజసేవా తత్పరతలు ఆమెను ప్రభావితం చేశాయి. తన 8వ ఏటనే అనర్గళంగా ఉపన్యసించి ఉపన్యాసకేసరి శ్రీచెరకువాడ వారినే అబ్బురపరచిన ఆమె భాషణం ఆమెకు దైవ దత్తమైన వరం. చిన్నవాడే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ధీరురాలు.

తన 18వ ఏటనే రాజమహేంద్రవరంలోని ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్రయువతీ సంస్కృతి కళాశాల నుండి ఉభయ భాషాప్రవీణ, పట్ట పరీక్షల్లో ప్రధమురాలిగా నెగ్గిన యువతి. ఆంధ్రవిశ్వకళా పరిషత్తు నుండి సర్ణపతకాన్ని పొందిన విదుషీమణి. నాటినుండి ఆమె జీవితంలో ముందడగే కాని వెనుకడుగులేదు.

నుదటకాసంత కుంకుమ బొట్టు, మేలైన పొందూరు, కాంచీపురం చీరలు, నిరాడంబరమైన ఆభరణ ధారణం ఆమెకు మరింత వన్నె తెచ్చాయి. మైకులు లేని కాలంలోనే తన అనర్గళ వాగ్ధారలను పంచి శ్రోతలను ఆనందాబ్ధిలో ఓలలాడించిన ఉపన్యాస కేసరి. తన వీణా వాదన మాధుర్యాన్ని అనేక శిష్యులకు పంచిన సంగీత సామ్రాజ్ఞి. సంతానహీనులకు వైద్యంచేసి ఎందరో మాతృమూర్తులకు సంతాన ప్రాప్తిని కలుగచేసిన చికిత్సకురాలు.

భగవద్గీతోపాసన చేసి ఆగీతామృతాన్ని తాను ఆస్వాదించి ఆ అమృతధారలను ఆంధ్రావనిత పంచిన గీతోపదేశికురాలు. చిన్ననాటినుండే ఆమెను అనేక బిరుదులు వరించాయి. “తెలుగుమొలక”, “ఆంధ్రసరస్వతి”,

"ధర్మప్రచారభారతి", "సంగీత సామ్రాజ్యసరస్వతి", "సాహితీరుద్రమ" ఈ బిరుదునే తన స్వీయ చరిత్రకు మకుటంగా పెట్టారు. "బ్రాహ్మీభూషణి", "అపరవాగ్దేవి" మొదలైన బిరుదులు ఆమెకు సార్థకతను చేకూర్చాయి.

ఆమె రచనా వ్యాసంగం 1953సం॥లో తెలుగుభాషాసమితి" (మద్రాసు)వారి పోటీతో పాల్గొని ఆంధ్రకవయిత్రుల చరిత్రనువ్రాసి ప్రథమబహుమతిని పొందింది. "గృహలక్ష్మి" సంపాదకులు మాన్యశ్రీకేసరిగారిచే స్వర్ణకంకణాన్ని పొందిన ప్రజ్ఞాశాలిని. తన పితౄణాన్ని చాటుకుంటూ ఆగ్రంధాన్ని తన మాతాపితరులకే అంకితం చేసిన ఆదర్శదుహిత. అంతేకాదు రచనా వ్యాసంగాన్ని నిర్లక్ష్యం చేయక ఆంధ్రుల కీర్తన వాఙ్మయి సేవను గ్రంథస్తంచేశారు. కేంద్ర-సాహిత్యఅకాడమీ భారత కవయిత్రుల"ను వెలుగులోకి తెచ్చిన విదుషీమణి. పరిశోధనా గ్రంధాలేకాదు. భావుకత, కాల్పనికత, ధీపటిమ, కల్గిన గేయకావ్యాలు "కాంతి శిఖరాలు", "లజ్జాకిరీటధారిణి" మొదలగు కావ్యాలను. వ్యంగ్యవాసనా విలసితమైన "కన్యకమ్మనివాళి" మహాత్మాజీ పాదపుష్పంగా వెలిసిన "ఒక్కచిన్నదివ్వె", ఆంధ్రప్రదేశ్‌వారి సత్కారాన్ని పొందిన అత్యంత మధురాతి మధురమైన "నా తెలుగుమాంచాల" గేయకావ్యాన్ని, మనోహర దృశ్యరూపకం "సరస్వతీ సామ్రాజ్యవైభవం" కావ్యాన్ని, సంస్కృతభాషలో ఆశువుగా రచించిన "శీమత్కన్యకా సుప్రభాతం", "దేవీస్తవ తారావళి", "జాతిపిత" కావ్యాలను అలవోకగా రచించిన కవితా శిరోమణి. కవయిత్రులలో తొలుదాత్తగా రచించిన "సాహితీరుద్రమ" (స్వీయచరిత్ర), అనేక కథలు, ఒకటేమిటి ఎన్నో కావ్యాలను రచించిగణుతికెక్కిన ప్రోఢ. కళాభినేత్రిగా వాసికెక్కింది. <u>పుష్పాభిషేకాలు</u>, గజారోహణం, తంజావూరు నాయికరాజుల ఆస్థానకవయిత్రి రంగాజీ తర్వాత మళ్లీ కనకాభిషేక సమ్మానాన్ని పొందిన (అనంతపురం లలితకళా సమితి వారిచే) కనకాభిషిక్త. అతులిత ప్రతిభాశాలిని. అసమాన పాండితీప్రకర్షను చూపి అతివలందరికీ ఆదర్శప్రాయమైన ఆంధ్రమహిళ. ధన్యజీవి.

స్త్రీకి గాని, పురుషునికి గాని సహచరుల అండలేకపోతే అందం రాదనే సూక్తికి నిదర్శనంగా నిలచిన వనితామణి లక్ష్మీకాన్తమ్మ. పత్నిప్రగతిని, పురోభివృద్ధిని మనసారా అభినందించి ఆమెకు చేయుతనిచ్చి భారతమాత కిరీటంలో కలికి తురాయిగా నిల్పిన నా పితృపాదులు కీ.శే. ఊటుకూరి హయగ్రీవ గుప్త (అడ్వకేట్) గారు చిరస్మరణీయులు.

భారతదేశంలోనేకాదు పశ్చిమ జర్మనీ మొదలగు కమ్యూనిష్టు దేశాలలో, కేంద్రసాహిత్య ఎకాడమీ తరపున దేశపర్యటన చేసి భరతమాత ఖ్యాతిని ఇనుమడింప చేసిన ఏకైక భారతవనిత. ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొని తనమాతృ భాషా వైభవాన్ని అజరామజరం చేసిన ఆంధ్రవనిత.

పుట్టినింటి వారు. మెట్టినింటివారు మెచ్చి అభినందించిన మహిళా శిరోమణి లక్ష్మీకాన్తమ్మ. జీవించినన్నాళు రాజహంసలా 79సం॥లు జీవించి స్వల్పకాలం అనారోగ్యం పాలై దివికేగి భగవంతుని సన్నిధానాన్ని చేరుకున్న చిరయశస్విని.

పుట్టుక గిట్టుట కొరకే గదా !

ఆమె మరణవార్తను ఆలకించిన అశేష ఆంధ్రప్రజలు ఆమెకు అశ్రుతర్పణం వదిలారు.

## మహిళా చైతన్యదీప్తి 'సాహితీరుద్రమ' 'కళాప్రపూర్ణ',

## డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

- విహారి

'వైదుష్యంలోనూ, వ్యక్తిత్వంలోనూ వైశిష్ట్యం, విలక్షణత్వం కల సోదరి లక్ష్మీకాన్తమ్మగారు తొమ్మిది మండువాలోగిలి గల నాళం వారి ఆడపడుచు. ఏలూరిలోని జమీందార్లు మోతేవారి దౌహిత్రి. చీరాలలో పేరుప్రతిష్ఠలున్న ఊటుకూరి వారి కోడలు. ఒక తరం ఆంధ్ర రచయిత్రులందరికీ ఇష్టమైన 'అత్తగారు'. సంస్కృతాంధ్ర భాషలలోనే కాక, సంగీత సాహిత్యాలలో ప్రవీణురాలు. ఈమెకు తెలియని, ఈమెను తెలియని ఆంధ్ర రచయిత్రి ఎవరైనా ఉంటే ఆమె దేశానికి తెలియని రచయిత్రి అని చెప్తే తప్పులేదు' అని ఘంటాపథంగా చెప్పారు ఆరుద్రగారు.

అదీ-'కళాప్రపూర్ణ' ఊటుకూరివారు. 'సారస్వత రంగంలోనేగాక సంస్కరణాత్మక సాంఘిక రంగాల్లో ఆమె వహించిన విశిష్ట భూమిక ఎంతో ఉజ్జ్వలంగా అగుపిస్తుంది' అన్నారు 'పద్మభూషణ్' జ్ఞానపీఠపురస్కార గ్రహీత, మహాకవి, డా॥ సి.నారాయణరెడ్డిగారు.

అదీ- 'సాహితీరుద్రమ' లక్ష్మీకాన్తమ్మగారు! మూర్తీభవించిన మహిళా చైతన్యదీప్తి ఆమె. వ్యక్తిత్వంలో ఆమెది స్ఫూర్తిధీరం. నదురూబెదురూ లేకపోవటంకాదు, స్పష్టమైనమాటా, పదునైన వాగ్ధాటీ ఆమెది. బహుముఖీనమైన ప్రజ్ఞాపతాక మాత్రమేకాదు ఆమె; బహుపార్శ్వాలు కలిగిన జీవన చిత్రవర్ణపట్టకం ఆమె!

ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ లో ఐదేళ్లపాటు నేనూ, ఆమే సహసభ్యులం. మహారచయిత్రి లత కూడా ఉండేది. నిజానికి – ఈ స్త్రీమూర్తిద్వయం అంటే అటు అధ్యక్ష కార్యదర్శులవారికీ (బెజవాడ గోపాలరెడ్డిగారూ, దేవులపల్లి రామానుజరావుగారూ), ఇటు సభ్యులందరికీ కూగా గౌరవం, అంతకుమించి లోలోపలి బెరుకుతనం. ఇద్దరూ ఇద్దరే. 'పలుకుదారుణాఖండల శస్త్రతుల్యము' బాపతే! స్పష్టత, సూటితనం, శషభిషలు లేని స్వచ్ఛమానసం- ఇవీ గుణవిశేషాలు'. గోపాలరెడ్డిగారు-లక్ష్మీకాన్తమ్మగారు ఏదైనా విషయాన్ని ప్రస్తావిస్తుంటే, ఒకింత హెచ్చు శ్రద్ధతో ఆలకించేవారు. ఆమె స్త్రీప్రాతినిధ్య' ప్రతిపాదనలు వాంఛితంగా, సామూహిక అవశ్యకతలుగా ఉండేవి. అవి ఆ అధ్యక్ష కార్యదర్శుల 'తలూపు'నీ, సభ్యుల మన్ననల్నీ పొందేవి. 'లక్ష్మీకాన్తమ్మది కొండంత ఆత్మవిశ్వాసం, గోదావరంత వాక్చాతుర్యం' అన్నది గోపాలరెడ్డిగారి ఉవాచ!

లక్ష్మీకాన్తమ్మగారి వ్యక్తిత్వ భూషణల్లో మరీ మెరుపులీనేది- ఆమె ఉపన్యాస కళ. ఆ తర్వాత, అన్యాయంపట్ల నిరంకుశఖండన! కార్యకర్తృత్వంలో అవిరళ శ్రమా, దీక్షాదక్షతలూ కలిగిన మేటి మహిళ!

'కవితయందెకాదు, కమనీయ సంస్కృతి
రక్షయందు, గానదీక్షయందు
బహుముఖ ప్రసంగ పరిపాటియందీమె
వీనుమిగిలె నాంధ్ర విశ్వమునకు' అని ప్రశంసించారు– 'తెనుగులెంక' తుమ్మలవారు.

వ్యక్తిగా లక్ష్మీకాన్తమ్మగారు తన సమకాలీనులకూ, అనంతరకాలీనులకూ ఆదర్శ మహిళగా నిలిచింది. ఉత్తమ గృహిణిగా కష్టసుఖాల్ని స్థిత ప్రజ్ఞతతో స్వీకరించింది. దేశస్వాతంత్ర్యోద్యమంలో ధైర్యంగా, సాహసంతో, స్థిరచిత్తంతో పాల్గొని తనవంతు పాత్రను నిర్వహించిన సంఘసేవిక ఆమె, నిత్యచైతన్య శక్తిస్వరూపిణి ఆమె!

కాగా, ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి సాహిత్య వ్యక్తిత్వంలోని 'గట్టిగింజల్ని' స్థాలీపులాకన్యాయంగా పరామర్శిస్తాను.

సాహిత్యపరంగా ఆమె–పాండిత్యసమీరం!
అపర వాగ్దేవి ఆమె! సంస్కృతాంధ్రాల్లో ఆమె ప్రతిభా, వ్యుత్పత్తీ–నిష్యందసుధాకలశం!
3 సంస్కృతకావ్యాలు రాశారు. కన్యకాపరమేశ్వరీ సుప్రభాతం, దేవీస్తవ తారావళి, జాతిపిత.

15 తెలుగు గ్రంథాలు వెలయించారు. వీటిలో అత్యధిక భాగం – ఆమెకుగల మహిళాచైతన్యాకాంక్షకు అద్దంపట్టేవే. వాటిలక్ష్యం, వాటిలోని అంతస్సారం ఒక్కటే! అది–స్త్రీ ఆత్మగౌరవాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ, అస్తిత్వ స్థిరత్వాన్నీ–ఉన్నతీకరించటమే. మహిళాశక్తి వాస్తవచరిత్రకు సాహిత్యరూపాన్ని సమకూర్చి, రచనను–ఈతరం వారికీ, ముందు తరాలవారికీ స్ఫూర్తిప్రదం చేయటం. ఆపైన వారిని చింతనాపరుల్ని చేయటం, తన రచనను–చిరంతనం చేయటం! స్త్రీల ఆత్మన్యూనతను పోద్రోలి, వారికి ధైర్య స్థైర్యాన్ని నూరిపోయటం– ఆమె ధ్యేయం, తపన, తపస్సు! ఆమె రచనల్లో ఎక్కువశాతం వస్తువులకీ, ఇతివృత్తాలకూ –ఇదే 'నడిమిచుక్క'!

ఆమె నిష్కర్షగా అంటారు, "సామాజిక శ్రేయస్సు సాధించే అన్ని రంగాల్లోనూ స్త్రీల ప్రాతినిధ్యం పెరగాలని నా అభిప్రాయం" అని!

లక్ష్మీకాన్తమ్మగారి సాహిత్య లక్ష్యశుద్ధిని లోకానికి చాటుతున్న కొన్ని రచనల్ని చూద్దాం.

ఆమె 'మహిళావిక్రమసూక్తం' ఒక విశిష్టమైన పద్యకావ్యం. దీనిలో ఆమె–రాణీరుద్రమ, చాంద్‌బీబి, అహల్య, గంగాదేవి, జిజియాబాయి, మాంచాల, రాణీసంయుక్త, కస్తూరిబాయి, సరోజినీదేవి వంటి వీర, ధీర ఆదర్శమహిళల గుణగణాల్నీ, వారి స్థూలజీవన రేఖల్నీ స్ఫుటంగా చిత్రించారు. మొల్ల, రంగాజమ్మ, వెంగమాంబ వంటి కవయిత్రుల రచనా వైశిష్ట్యాన్నీ, ఆండాళ్, మీరాబాయి, అవ్వయ్యార్ వంటి భక్తుల విశేషాల్నీ తెలిపారు. పన్నా స్వామిభక్తినీ, లీలావతి గణితశాస్త్రపాండితినీ వివరించారు. ఈ గ్రంథాన్నంతా ఆమె నవవిధ ఖండాలుగా విభజించుకొని, ప్రణాళికాబద్ధంగా రచించారు.

'లజ్జా కిరీటధారిణి' గ్రంథంలో భారతీయ మహిళ వినయగుణ సంపదే జాతికి శ్రీరామరక్షగా భావించి, ఝాన్సీ, మొల్ల, కన్యక, సరోజినీదేవి, శారదాదేవి వంటి సద్గుణమహిళల ఔన్నత్యాన్ని పద్యాల్లో కొనియాడారు.

లక్ష్మీకాన్తమ్మ గారి 'నా మాంచాల' ఒక అపూర్వమైన కథాగేయకావ్యం. తెలుగుచరిత్రలో పల్నాటి యుద్ధం ప్రాముఖ్యత, పర్యవసానం- సాహిత్యకారులకూ, చరిత్రకారులకూ, జనసామాన్యానికి కూడా సుపరిచితమైనదే. 'పల్నాటియుద్ధం'లో మగువ మాంచాల ధీరవనిత మాత్రమేకాదు, వీరపత్ని. భర్త బాలచంద్రుని యుద్ధానికి పంపి, విజయమో, వీరస్వర్గమో తేల్చుకొమ్మని పంపిన వీరనారి ఆమె. ఇతివృత్తంలో వీరరసమే కాక, మాంచాల సౌశీల్య ఆవిష్కరణలో శాంతం, అనురాగంలో అతిశృంగారం ఆపై -.శృంగారం-ప్రతిఫలించేట్లు- తన-కావ్యాన్ని రసబంధురం చేశారు, లక్ష్మీకాన్తమ్మగారు. బాలచంద్రుని కర్తవ్యోన్ముఖుని చేసి యుద్ధానికి పంపిన మాంచాల, ఈ కావ్యంలో తానూ యుద్ధరంగానికి బయల్దేరుతుంది. తర్వాతి పరిణామాల్లో- ఆమె సతీసహగమనం చేసినట్లు కథని మలచి, మాంచాలని ఆదర్శమూర్తిగా (సహగమనంవినా) అనుసరణీయపాత్రగా తీర్చిదిద్దారు రచయిత్రి. యుక్తాయుక్తవిచక్షణ, సౌశీల్యం మూర్తీభవించిన నాయిక-ఊటుకూరివారిమాంచాల!

'మనసాహితి-మధుభారతి' ఖండకావ్యంలోనూ లక్ష్మీకాన్తమ్మగారు తమ మహిళా చైతన్యాకాంక్షను ప్రస్ఫుటం చేశారు. 'చదువుకో ఓ బాలా- చదువుకో' వంటి కర్తవ్య ప్రబోధాత్మక ఖండికల్ని రాశారు. అలాగే, తల్లిదండ్రులకు కూడా చిటిపాపలభవితవ్యాన్ని చెడగొట్టకండి-అనే ఉపదేశాన్నిచ్చారు.

'ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళాసేవ'-వ్యాస సంపుటి. దీనిలో లక్ష్మీకాన్తమ్మగారు తమ గవేషణాత్మక దృష్టితో-కీర్తన, కృతి, పదము, జావళీ వంటి విభిన్న సంగీత రూపాల వర్గీకరణతో, వాటి లక్ష్యలక్షణ విచారం చేశారు. అలాగే, తరిగొండ వెంగమాంబ, వెన్నెలగంటి హనుమాయమ్మ, గిడుగు సత్యవతి, ఇందుమతి, అడవి అన్నపూర్ణమ్మ వంటి మహిళామణుల కీర్తన సాహిత్య వివరాల్ని అందించారు.

లక్ష్మీకాన్తమ్మగారు 'సరస్వతీ సామ్రాజ్యవైభవం' పేరున ఒక సాహితీరూపకాన్ని కూడా రాశారు. తెలుగు సాహితీ విదుషీమణుల్లో కొందరిని రూపకవేదికనెక్కించిన విశిష్టసృజన ఇది. ఈ రూపక ప్రారంభంలో-లక్ష్య వివరణగా- ఎత్తుగడని ఇలా అందించారు రచయిత్రి:

'సరస్వతీదేవి కొలువున మొల్ల, మధురవాణి, గంగాదేవి, రంగాజమ్మ, ముద్దుపళని, తిమ్మక్క, వెంగమాంబ, కనపర్తి వరలక్ష్మమ్మ, చానమ్మ మున్నగువారు ఆసనములను అధివసించియుందురు. సరస్వతీ ఆగమనమును తెలుపు వందిమాగధు భద్ర నినాదములు వినబడును'. తర్వాత సభ ప్రారంబమౌతుంది. బృహస్పతి ఒక్కొక్క కవయిత్రితో సంభాషణ చేస్తూ ఉంటాడు. ఆయనే సమన్వయకర్త. ప్రత్యేక కథాంశమేమీ ఉండదు. కవయిత్రులు వారివారి రచనా చమత్కృతినో, తమ సమకాలీన సాహిత్యాంశాన్నో ప్రస్తావించవచ్చు. సరస్వతీప్రార్థన ఉంటుంది. కొన్ని సందర్భాల్లో అవధాన ఫణితిలో సమస్యాపురాణం, దత్తపదిదంటివీ నడుస్తాయి. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం- కవికి అవసరం. ఆ మూడింటి సమ్మేళనం, స్వరమేళనం- లక్ష్మీకాన్తమ్మగారిది. అందువల్లనే ఆమె సృజనాత్మకంగానూ, సద్యఃస్ఫూర్తితోనూ కూడా కావ్య రచనలో తనదైన ముద్రను చూపారు. ఇలా ఆమె తన ఆత్మ ప్రత్యయాన్నీ వెల్లడించుకున్నారు కూడా!

లక్ష్మీకాన్తమ్మగారు తన రచనా లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ 'ఆనాటి దేశావసరాల్నిబట్టి నా లేఖిని అనేక ఉద్యమ

స్వరూపాలకు ఆకృతి దిద్దింది. అంచేత నిజంగా ఆలోచిస్తే అటువంటి రచనలంటేనే నాకెక్కువ ఇష్టమేమో'అనీ; 'సంఘశ్రేయస్సు మీద దెబ్బకొట్టే ఇతివృత్తం గల రచనలు నాకు ఇష్టంలేదు' అనీ స్పష్టం చేశారు!

విజయవాడలో ఊటుకూరిలక్ష్మీకాన్తమ్మ కళాపీఠంని స్థాపించి ఆ సంస్థపక్షాన ఎనలేనిసేవగా, అనేక సాహిత్యసాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహిస్తున్న సాహితీవిదుషీమణి శ్రీమతి కోకా విమలకుమారిగారు ఇలా అంటున్నారు, "డాక్టర్ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారు సాహిత్యోద్యమం, మహిళాఉద్యమం, స్వాతంత్ర్యోద్యమ సేవలద్వారా ఆంధ్ర మహిళగానే గాక, భారతపుత్రిగా, అంతర్జాతీయ అతివగ, జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో ఖ్యాతిగాంచి స్త్రీజాతి చరిత్ర పుటల్లో ధృవతారగా వెల్గొందినారు"!

కళాప్రపూర్ణ, డా॥ లక్ష్మీకాన్తమ్మ గారితో స్వయంగా పరిచయంగల సుప్రసిద్ధ కవయిత్రి, ఆంధ్రాంగ్లహిందీ భాషా సాహితీ విదుషీమణి, 'స్వర్ణకంకణ' గ్రహీత డా॥ చిల్లర భవానీదేవిగారు– లక్ష్మీకాన్తమ్మగారిపై కేంద్రసాహిత్య అకాడెమీ కొరకు– 'మోనోగ్రాఫ్'ని రాశారు. ఇటీవల ఆ గ్రంథం ప్రచురింపబడింది. డా॥భవానీదేవిగారు లక్ష్మీకాన్తమ్మగారిని 1976లో ఇంటర్వ్యూచేసి 'వనిత' పత్రికలో ప్రచురించారు. లక్ష్మీకాంతమ్మగారికి ఆంధ్రవిశ్వవిద్యాలయంవారు 'కళాప్రపూర్ణ' పురస్కారం ఇచ్చిన సందర్భం అది. ఆ మోనోగ్రాఫ్‌లో– "ఆంధ్రసరస్వతి" బిరుదాంకితురాలు 'సాహితీరుద్రమ' లక్ష్మీకాన్తమ్మగారు రుద్రమలాగానే జీవించారు. వారి సాహితీ ప్రకర్ష ఒకకారణమైతే, నిలువెత్తు వ్యక్తిత్వం మరో మెరుపుకోణం. వారి అపార సాహితీ వ్యాసంగ సాగర చైతన్యాన్ని చూసి ఉత్తేజితురాలినయ్యాను. ఆమె నాకిచ్చిన స్ఫూర్తి ఒక విద్యుత్తరంగం!" అని నివాళినర్పించారు. డా॥ భవానీదేవిగారి ఆ రచన నా వ్యాసానికి ఆలంబనమైంది. వారికి నా కృతజ్ఞతలు!

లక్ష్మీకాన్తమ్మగారిని "స్త్రీవాద సాహితీ సృష్టి శ్రీకార/ఉపనిషత్కాల సముజ్జ్వల గార్గి"గా అభివర్ణించారు డా॥ బొడ్డుపల్లి పురుషోత్తంగారు. ప్రత్యక్షర సత్యవాక్కు అది! ఆమె ధన్యురాలు, పుణ్యురాలు, చిరస్మరణీయురాలు!!!

# కైమోడ్పు

- ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం

తెలుగు పల్కుల తల్లి తలమానికమ్ము
శ్రీ ఊటుకూరి లక్ష్మీకాన్తమ కిదె
సమకూర్తు మందార సంస్కృతి సరము
భక్తి వాసనలు గుబాళింప దిశలు॥

నన్ను సోదరుకన్న మిన్న మన్నించి
తెలుగు సాహితి తీరుతెన్నులు చూపి
ఆంధ్రభాషా రహస్యాలు బోధించి
ప్రథిత సాహిత్య సంపద సమకూర్చు
పథము చూపిన సరస్వతికి జోహారు॥

సాధ్వి సుశీల - కృష్ణారావు దుహిత
మధుర కవికి మనోహరమైన పుత్రి;
శ్రీపాద కృష్ణమూర్తికి ముద్దుబిడ్డ
చెళపిళ్ల గురుని యాశీర్వాద పాత్ర
అభినవ నన్నయ్య కభిమాన తనయ
బాపిరాజు కవి సంభావించు కుశల
మాధవ రామశర్మకు తగ్గ చెల్లి
గోపాలరెడ్డి దృగ్గోచ రాదర్శ
పావనుండీ హయగ్రీవు నర్ధాంగి
సత్పుత్ర పుత్రికా సంతాన భాగ్య.
సంతతోన్నత లక్ష్య సాధన శీల
బంధు మిత్రులయందు బద్ధానురాగ॥

ఉభయ భాషా ప్రవీణోన్నత విద్య
ప్రప్రథమ సుస్నాత, బంగారు పతక;
ఆత తాధీతి బోధాచరణ చణ
ప్రతిభా సముజ్జ్వల పాండితీ మూర్తి
శివ సత్యసుందర నవనవోన్మేష ॥

సకలాంధ్ర స్త్రీజన సముచితారాధ్య
వివిధ విప్లవభావ విజ్ఞాన వీణ
సంగీత సాహిత్య సరసాంతరంగ
వాగ్గేయ కారాగ్ర వరమనో ధర్మ
బహుకావ్య సవిమర్శ ప్రజ్ఞా ధురీణ
భరతాంధ్ర కవయిత్రి చరిత సర్వజ్ఞ ॥

స్త్రీ జనోద్ధరణైక దీక్షాతిదక్ష
గృహలక్ష్మి కంకణాంకిత దివ్య హస్త
జలధి గంభీర నిస్వన మహావాగ్మి
పదవులు వరియింప పాలించు జాణ
సాధు రుక్మిణి, ప్రౌఢ, సత్యభామీమె ॥

'ఆంధ్ర ఝాన్సీలక్ష్మి' యననొప్పు ధైర్య
నా తెన్గు మాంచాల నవ్యేతిహాస
వినుతికెక్కెనుదాత్త 'విదుషీమణి' యని
'ఆంధ్ర సరస్వతి' సార్థక బిరుద
గౌరవ డాక్టరేట్ గైకొన్న ధిషణ
ఖండ ఖండాంతర గమన మరాళ
దేశ భక్త్యావేశ దేదీప్యమాన
'సాహితీ రుద్రమ్మ' సారాత్మ చరిత
మహిళా జగత్తుకే మకుటాయమాన
బహుముఖ సత్కార ప్రాభవోపేత
కనకాభిషేక సత్కారైక మహిళ

పురుషులతో స్పర్థ పూను మనీషి
స్త్రీవాద సాహితీ సృష్టి శ్రీకార
ఉపనిషత్కాల సముజ్జ్వల గార్గి
సరస సారస్వత సామ్రాజ్య లక్ష్మి
మొల్ల పాత్రాభినయోల్లాస హృదయ
శత్రులపైని ద్వేషములేని సాధ్వి.
నిత్య చైతన్యాత్మ; నిర్నిద్రకాంతి
వ్యక్తియే కాక యుద్యమమన్న సబబు.
నిరత మంత్రధ్యాన పరమాత్మ చిత్త
ఆర్ష విజ్ఞాన ప్రహర్షైక బుద్ధి
గీతోపనిషదర్థ చేతోవికాస
గుప్తాత్మ నిత్య సంతృప్త జీవాత్మ;
మహిళామ తల్లుల మహిత మార్గమ్ము,
గోరంత యుపకృతి కొండంత నెఱుగ
కొండంత యుపకృతి గోరంత తలచు
పురుషోత్తముని మీద పూర్ణ విశ్వాస
సంప్రదాయముపై యచంచల నిష్ఠ
గోదావరీ కృష్ణకున్ కూడ లీమె.
అఱు కోట్లాంధ్రుల కగ్రజారాధ్య
లక్ష్మికాన్తమ్మ కుల్లాస జీవనకు
ఈ సంస్కృతి సంచిక హృదయంగమమ్ము
శీతాంశువున కొక్క శీకరార్పణము.

– సంస్కృతి నుండి

# విరామమెరుగని విదుషీమణి లక్ష్మీకాంతమ్మ!

- ఆచార్య ఎస్.గంగప్ప

అందరికీ విద్య అనేమాట ఆనాడులేదు. మనపిల్లలలో ఆడపిల్లలకు సమానావకాశాలు లేవు. అయినా ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు ఉన్నతవిదుషీమణిగా ఎదిగిన వీరు ఆదర్శప్రాయం. దానికి తల్లిదండ్రులప్రోత్సాహం, మీరు మిక్కిలి పుణ్యంవల్ల యశస్సులభిస్తుందన్న సూక్తివల్ల-పూర్వజన్మ సుకృతంవల్ల లక్ష్మీకాంతమ్మ స్వయంకృషితో ఉత్తమ కవయిత్రిగా నిరూపించుకొన్నారు. ఆనాటి స్థితిగతులననుసరించి కవయిత్రిగా, స్వాతంత్ర్యసమరయోధురాలిగా, స్త్రీజనాభ్యుదయురాలిగా-మహిళాలోకానికే ఆదర్శవంతురాలిగా నిలిచిన మహనీయురాలు లక్ష్మీకాంతమ్మగారు.

మధురకవి నాళం కృష్ణారావు, ఏలూరు జమీందారులైన మోతే వెంకటకృష్ణారావుపుత్రిక వెంకట సుబ్బమ్మ-తదనంతరం-సుశీల గార్ల ప్రియపుత్రిక లక్ష్మీకాంతమ్మగారు. 1912 డిశంబర్ 21 జన్మదినం అంటే ఈ డిశంబర్‌కి జయంత్యుత్సవాలు జరుపవలసిన అవసరంఉంది. 1930మార్చిలో చీరాల వాస్తవ్యులు ఊటుకూరి హయగ్రీవ గుప్తాగారితో వివాహం. వీరికి ఇద్దరు పుత్రికలు సుహాసిని, మైథిలీ. ప్రపంచచరిత్ర, రాజరాజనరేంద్ర, జ్ఞానేశ్వర్-అనే ముగ్గురుపుత్రులు. విద్యావిజ్ఞానవేత్తలు.

రాజమహేంద్రంలో ఉండడం మహాపండితుల సాహచర్యంవల్ల, తాను సాధించిన వార్తావివరాలవల్ల అనేక విద్యాసంస్థలలో సంబంధాలు-కవయిత్రిగా పేరుప్రఖ్యాతులుగడించి అనేక పురస్కారాలు, అనేక బిరుదులు ఆంధ్రవిశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ, సాహితీరుద్రమ, ఆంధ్రసరస్వతి మొదలైనబిరుదులు ఎన్నోవరించాయి. విద్యావతిగా, కవయిత్రిగా, సమాజసేవపరురాలుగా సేవలందించిన కవితా రత్నం లక్ష్మీకాంతమ్మగారు.

**రచనావ్యాసంగం :**

లక్ష్మీకాంతమ్మగారు సంస్కృతాంధ్ర భాషల్లో సుమారు పందొమ్మిది గ్రంథాలు రచించి ప్రకటించారు. సంస్కృతగ్రంథాలు: 1. కన్యకపరమేశ్వరీ సుప్రభాతం, 2. దేవీస్తవ తారావళి, 3. జాతిపిత తెలుగులో రెండుపద్యకావ్యాలు, నాల్గుగేయకావ్యాలు, ఒకవ్యంగ్యకావ్యం, మరో అనువాదకావ్యం రచించి వచనగ్రంథాలు సుమారు ఆరురచించారు. మరోరూపకం. మహిళావిక్రమసూక్తం, లజ్జాకిరీటధారిణి అనేవి రెండు పద్యకావ్యాలు. మన సాహితి-మధుభారతి; నాతెలుగు మాంచాల, ఒక్కచిన్న దివ్వె, కాంతిశిఖరాలు-అనేనాల్గుగేయకావ్యాలు. ఇంకా 'కనకమ్మనివాళి అనే వ్యంగ్యకావ్యం, హిందీకవుల విశిష్టతను తెలిపే "సదుక్తిమంజరి" అనే స్వేచ్ఛానువాద కావ్యంరచించి హిందీపైగల ప్రీతిని వ్యక్తికరించారు.

వచనగ్రంథాలు: ఆంధ్రకవయిత్రులు, అఖిలభారత కవయిత్రులు, ఆంధ్రులకీర్తన వాఙ్మయ కళాసేన, నావిదేశీ పర్యటన-అనుభవాలు, అనే యాత్రగ్రంథం; భారతదేశ చరిత్ర-కొన్ని గుణపాఠాలు; సాహితీరుద్రమ-

అనేగ్రంథాలు లక్ష్మీకాంతమ్మగారు బహుముఖీనమైన విజ్ఞానాన్ని, ప్రజ్ఞాపాటవాల్ని విశదీకరిస్తాయి. ఇంతటి ఈ సాహితీనిర్మాణంచేసిన సాహితీరుద్రమ్మ లక్ష్మీకాంతమ్మగారు.

పద్యం, గేయం ఉచితరీతిన నడిపించి పాండిత్య ప్రకర్షతోపాటు, ప్రజ్ఞాపాటవాల్ని లక్ష్మీకాంతమ్మగారు వ్యక్తీకరించారు. "మహిళావిక్రమసూక్తము" పద్యకావ్యంలో భారతీయమహిళావైశిష్ట్యాన్ని వేనోళ్ల ప్రశంసించారు. లజ్జా కిరీటధారిణి కావ్యంలో "అమ్మ'ను గూర్చి పాపాత్ముడేగాక, పావనమౌ అమ్మ/ వాత్సల్య వంచనకి భద్రకవచ! మనే,

"అమ్మప్రీతిగొల్వంగ ప్రత్యక్షదైవ
మన, నతిశయోక్త్యలంకారమగునె, తలప;
చీము, నెత్తురులోడిచి చిలికె, సుమ
మనుచునమ్మ; తీర్పదరంబె మాతృఋణము." -అని ఎంతో మహోన్నతంగా వివరించారు.

'కావ్యమహాత్రయం'లో సంస్కృతపారశీక వైభవాన్ని నిరూపించుకొన్నారు విశిష్టంగా లక్ష్మీకాంతమ్మగారు. ఇందులో మూడోకావ్యం 'జాతిపిత' గాంధీ ప్రశంసాపూర్వకకావ్యం. విశిష్టమైన గాందీతత్త్వాన్ని. సంస్కృతంలో వర్ణించి తరించారు మనకవయిత్రి.

గేయకావ్యాలు చాలా సముచితరీతిని రచితం. 'తెలుగుమంత్రి'గా లక్ష్మీకాంతమ్మగారి ప్రశంసలందుకొన్న ఆనాటి విద్యాశాఖామాత్యులు శ్రీమండలి వెంకటకృష్ణారావుగారు 'తెలుగుభాషాభ్యున్నతికి చేసిన సేవను గూర్చి గమనించగలం.

'తెలుగు విద్యకాకృతి గూర్చు దిట్టతనము
తెలుగు భాషను పోషించు తీవ్రశక్తి
తెలుగు సంస్కృతి రూపించు ధీరచరిత
తెలుగు కళలను సేవించు దివ్యదీక్ష
......................................
తెలుగు తల్లిని పూజించు దీక్షయలర
దీప్తి మనుమయ్య వెయ్యేళ్లు తెలుగు మంత్రి!"-కవయిత్రి ఆశీర్వచనం అమోఘం.

గడ్డిపువ్వును గూర్చిన ప్రశంస:
'గవ్వకుకొఅగాని గడ్డిలో పుట్టినా
మువ్వపు సిరినాదేయని
కయ్యానికి కాలుదువ్వనని ప్రత్యేకతను విశిష్టతను వివరించారు.

'నా తెలుగు మాంచాల' అద్భుతకావ్యరచన. మాంచాల సహగమనం గూర్చి ఎంతో ధైర్యస్థైర్యాలను ప్రకటిస్తూ చేసిన రచన లక్ష్మీకాంతమ్మగారి ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం. "మాంచాలఘనకీర్తి/మంటలో,తా కలిసి/ మంచికెగసెనుగాదె/మంటికిని మింటికిని/ మణిదీపమైవెలిగె ధ్రువతారగా మిగిలె అని అభివర్ణించారు.

'కాంతిశిఖరాలు'లో భగవన్మహిమను చిత్రించారుగేయాలుగా.

'కన్యకమ్మనివాళి' సామాజకాంశాంలను ఉదాహరిస్తూ. అనేక గేయాలను రచించి ప్రజాసముదాయాన్ని మేల్కొల్పేయత్నం చేశారు." చుక్కలంటే ధరలు/ ఒక్కవాడికి ఉరులు,/ లంచగొండికి సిరులు/ ఓకన్యకమ్మా!"- ఆనాటి ధరవరలగూర్చి అనేకాంశాలగూర్చి రచించారు.

'సదుర్తిమంజరిపేరుతో కబీర్, తులసీ, బృంద, రహీమ్- అనే హిందీ కవులనూ తెలుగువారికి పరిచయం చేసిన ఘనత లక్ష్మీకాంతమ్మగారిది.

'సలితిత గుణ గోష సంకులమౌసృష్టి
చెడుగువిడిచి మంచి సేకొన దగు
శీరముజ్జగించి క్షీరమ్ముగొనునంచ
తులసిపలుకుసరణి తెలుసుకొనవె - అని ఎంతోచక్కగా తులసీదాస్‌ని కవీత్వీకరించారు తెలుగులో.

ఇలా లక్ష్మీకాంతమ్మగారు కవయిత్రిగా ఎంతో కీర్తిగడించారు.

లక్ష్మీకాంతమ్మగారి అపూర్వ సృష్టి. సరస్వతీసామ్రాజ్య వైభవమనే రూపకం. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ప్రసిద్ధిపొందిన 'భువనవిజయం' మనకాలంలోనూ ప్రదర్శించబడుతూ ఉండడం విశేషం. అలాంటిదే ఈసరస్వతీ సామ్రాజ్యవైభవమనే రూపకం. ఈ రూపకానికి పీఠిక రాసిన ఆచార్య తూమాటి దొణప్పగారు" ఇందిరా మందిరం, ఇంద్రసభ, కవనవిజయం, కురుపాండవదాయవిభాగం, భువనవిజయం వంటివి ఈ కుదురుకు చెందినవి. అభిజ్ఞశేఖరుల ఆమోదాన్నీ, రంగస్థలాభిమానుల ఆదరాన్ని పొందినది. ఈకోవకే చెందిన ప్రకృతకృతి సరస్వతీ సామ్రాజ్యవైభవము కళాప్రపూర్ణశ్రీమతి. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి విశిష్టసృష్టి." అని ప్రశంసించారు. ఈ రూపకంలోని పాత్రలు: చానమ్మ, ప్రోలమ్మ, గంగాదేవి, తాళ్లపాక తిమ్మక్క, మొల్ల, మధురవాణి, రంగాజమ్మ, ముద్దుపళని, తరిగొండ వెంగమాంబ, కనుపర్తి వరలక్ష్మమ్మ, కలభాషిణి, అనేవి ప్రధాన పాత్రలు. ఇందులో లక్ష్మీకాంతమ్మగారు ఆనాటి సాహిత్యవివేచనతో కవయిత్రుల గూర్చిన అనేకాంశాలను వివరించడం విశేషం. తెలుగుసాహితీ రంగంలో ఇదొక ప్రయోగం. ఇందుమూలంగా వారికెంతో కీర్తిప్రతిష్ఠలు చేకూరినట్లేగదా!

కాగా లక్ష్మీకాంతమ్మగారి పాండిత్య ప్రకర్షం సాహితీ సమాలోచనకు వారి బృహద్రచనలు వచనగ్రంథాలు. ఆంధ్రకవయిత్రులు, అఖిల భారతకవయిత్రులు, ఆంధ్రుల కీర్తన వాఙ్మయకళాసేన, వారి విదేశీ పర్యటన-అనుభవాలు, సాహితీ రుద్రమ, భారతచరిత్ర-కొన్ని గుణపాఠాలు. అంతవరకు సాహిత్యచరిత్రలో మాత్రమే అక్కడక్కడా కనిపించే తెలుగు కవయిత్రులను పరిపూర్ణంగా చూపినవారు లక్ష్మీకాంతమ్మగారు. అంతకంటే అఖిలభారతకవయిత్రుల గూర్చి రచించినగ్రంథం మరీ విశిష్టమైంది. ఈవిధంగా తెలుగుసాహిత్యానికింత సేవచేసిన లక్ష్మీకాంతమ్మగారు ఈనాటికేగాదు, ఏనాటికైనా మనకందరకు ఆదర్శవంతురాలు. 'సాహితీరుద్రమ' లక్ష్మీకాంతమ్మగారి స్వీయచరిత్రలో తమను ఆవిధంగా విశిష్ట వ్యక్తిగా నిరూపించుకొన్నారు.

తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తిగారు లక్ష్మీకాంతమ్మగారిని గూర్చి చెప్పిన పద్యం ప్రత్యక్షసాక్ష్యం

"కవితయందెకాదు, కమనీయ సంస్కృతి-
రక్షయందు, గానదీక్షయందు,
బహుముఖ ప్రసంగ పరిపాటియందీమె
వీనుమిగిలె నాంధ్రవిశ్వమునకు." - శుభం!

# ఊటుకూరి లక్ష్మీ కాన్తమ్మ రచనా వైశిష్ట్యం

– డా॥ గుమ్మా సాంబశివరావు

"నీకరాబ్జమునందున నిగ్గుదేలు

స్వర్ణకంకణ భాషా ప్రవీణఝరులు

నీగళంబున వాణీధ్వని స్వనములు

ఓజుగొల్పును స్వాతంత్ర్య ఉద్యమములు–" అని ప్రస్తుతులందిన ఉత్తమశ్రేణి కవయిత్రి, వక్తృత్వనిపుణ, సంఘసేవకురాలు, దేశభక్తి పరాయణ, మహిళావికాసోద్యమ మణిదీపం డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ.

లక్ష్మీకాన్తమ్మగారి పేరుచెప్పగానే సాహిత్యాభిమానుల మదుల్లో తళుక్కున మెరిసే రచనలు 'ఆంధ్రకవయిత్రులు' అఖిల భారత కవయిత్రులు. వీరి పరిశోధనా దృక్పథానికి, విశ్లేషణాత్మక ప్రతిభకు, విషయసేకరణశక్తికి ఈరచనలు తార్కాణాలు. లక్ష్మీకాన్తమ్మగారు బహుముఖ ప్రజ్ఞాధురీణ అని చెప్పటానికి ఆమె రచించిన పద్యకావ్యాలు, గేయకావ్యాలు, వచనకావ్యాలు, సంస్కృత శ్లోకాలు నిలువెత్తునిదర్శనాలు. తనదైన ముద్రను ప్రతిరచనలోను ప్రతిబింబింప చేయగల ప్రతిభామూర్తి లక్ష్మీకాన్తమ్మ.

వీరరసం పట్ల లక్ష్మీకాన్తమ్మగారికి అభిమానం ఎక్కువ. అందుకే ఈమెకు 'సాహితీరుద్రమ' బిరుదం అన్వర్థమైంది. 'రణసూక్తము' అనే ఖండికలో ఝాన్సీలక్ష్మీబాయి సైన్యాన్ని ప్రోత్సాహించిన తీరును వర్ణిస్తూ

"రండోభారత పుత్రులార! రణవీరశ్రేష్ఠులారా! భుజా

దండస్ఫార ధనుర్విముక్త శరసంతానంబులువ్వెత్తుగా

ఖండింపన్, మరవైరి కంఠముల సృగ్ధారారుణ గ్రీష్మమా

ర్తాండుల్ మీరయి మాతృభూమిని, స్వతంత్రజ్యోతి వెల్గింపగా" అని రచించిన తీరు ప్రశంసనీయం. ఈపద్యాన్ని చదివిన ప్రతి ఒక్కరూ పులకితగాత్రులవుతారనటంలో సందేహంలేదు. పూర్ణబిందు పూర్వక 'డ'కార ప్రాస ఈ పద్యానికి అదనపు అందాన్ని సమకూర్చింది. శబ్దంమీద అధికారం, ఛందస్సుమీద పట్టు, పాఠకుల్ని ఉద్రూతలూగించే నైపుణ్యం ఈపద్యంలో ప్రతిబింబిస్తున్నాయి.

బాపూజీ అంటే లక్ష్మీకాన్తమ్మగారికి ఎనలేని గౌరవం. తండ్రినాళం కృష్ణారావుగారి ద్వారా చిన్ననాటనే దేశభక్తిని నరనరాల్లో నింపుకున్న విదుషీమణి ఈమె. బాపూజీ త్యాగశీలాన్ని, సత్యనిష్ఠను, మాతృదేశ దాస్యశృంఖలాల్ని తెంచటానికి ఆయన గావించిన కృషిని పలురీతుల్లో స్ఫూర్తిదాయకంగా వర్ణించిన తీరు అనన్యసామాన్యం. బాపూజీ ప్రత్యేకతను విరోధాభాసలో వర్ణించిన లక్ష్మీకాన్తమ్మగారి రచనావైదుష్యం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

"మోహనుండై ధరమోహింపజేసి, దా

నింద్రియ భోగమోహితుడుగాడు

కర్మచంద్రుడయి నిష్కామమౌకర్మసం

ఘటియించ కర్మలంపటుడుగాడు
కరుణసాంద్రుండయి కడతేర్చి గోవున
హింసకేమాత్ర మహితుడుగాడు
సౌగంధ్యగంధియై స్వార్థరహితుడయి
గుణధర్మసుఖ విముఖుండుగాడు
పరులనైనను సమ్మోహ పఱుపగల్గు
వాగ్మి! మితభాషి! నెపుడతిభాషికాడు
ఆర్షధర్మ ప్రవృత్తి మహాత్ముడైన
ఘనుడు గాంధి అనాగరజనుడు కాడు– పరస్పరం వైరుధ్యం గలిగిన విశేషణాల్ని ప్రయోగించి గాంధీతత్త్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన లక్ష్మీకాంతమ్మగారి రచనా వైదుష్యం కీర్తనీయం.

వేరొకచోట కస్తూర్బా త్యాగమయ జీవితాన్ని కీర్తిస్తూ
"భారతనారీ గర్వము
ధీరంబైపురులు విప్పి దిక్కులనాడెన్
సారంబౌ నీయునికిని
గౌరవమింతులకునీవు కస్తురిమాతా" అని రచించారు.

పద్యాలకంటే గేయాలు, మాత్రాఛందరచనలు పాఠకుల్ని ఆకట్టుకుంటాయని గ్రహించిన లక్ష్మీకాన్తమ్మగారు ఆధోరణిలో తమ రచనలు సాగించి ఆనాటి ప్రజల అభిమానాల్ని అందుకోగలిగారు. లక్ష్మీకాన్తమ్మగారికి సాహిత్యాభిమానులైన రాజకీయ నాయకులతో పరిచయాలున్నాయి. బెజవాడ గోపాలరెడ్డిగారు ఆమెనెంతో ప్రోత్సహించారు. శ్రీమండలి వెంకటకృష్ణారావు గారి 52వ జన్మదినం సందర్భంగా యువతలోని నిస్తేజాన్ని తొలగించటానికి ఉత్సాహభరిత రచన 'రుధిరప్రస్థానం' గావించారు.

"నవయువతలోని ఉడుకురక్తం
హిమశిఖరాలను అధిగమించి
ఆటంకాలను ఛేదించి
ఒక్క ఉదుటుతో
కాంతి గోళాలను చేరుకొని
విజ్ఞాన నాళాలను నింపుకొని
చైతన్య ప్రవాహమై ఆంధ్రావనిలో
దానవుల పైవిక్రమించి
మానవత్వానికి ప్రోదిసల్పింది– అని యువతలో చైతన్యశక్తిని రగిలించారు.

'మనసాహితి– మధుభారతి' అనే పేరుతో మనసాహిత్యం వైశిష్ట్యాన్ని మాత్రాఛందంలో అనుపమంగా వర్ణించారు. ఇందులో ప్రాచీన ఆధునికకవుల విశిష్టతల్ని చాటి చెప్పారు.

తెలుగు భాష దేశభాష- లందు లెస్సయనుచునుడివి

కృష్ణరాయ సార్వభౌము-దేనాడో కీర్తించెను- అని శ్రీకృష్ణదేవరాయల ప్రస్తుతి గావించారు.

"సంఘమ్మును సంస్కరించు

సత్యాయుధ శక్తిగాగ

సాహిత్యము మలచినట్టి

వీరేశలింగవిభునుడి" - అని వీరేశలింగం గారిని నుతించారు.

కొంతమంది అధ్యాపకవృత్తిలో ఉండి చిత్తశుద్ధితో పాఠాల్ని బోధించకుండా డబ్బుల కక్కుర్తితో ప్రవర్తిస్తున్నారని లక్ష్మీకాన్తమ్మగారు చెప్పిన తీరును ఇప్పటికీ మనం గమనిస్తూనే ఉన్నాం.

చదువు సంధ్య బోధింపక- ప్రైవేటులు చెప్పుకొంచు

పేపర్లను దిద్దునపుడు- వేనవేలు గుంజుకొనుచు

బొజ్జనిమురు కొనెడువారు- ఒజ్జలెమరి లక్షలుండ్రి- అని 'బాధ గురువులకు' చురకలంటించారు.

లక్ష్మీకాన్తమ్మగారు 'నా తెలుగు మాంచాల' పేరుతో అద్భుతరచన గావించారు. మాంచాల, ఐతాంబ, బాలచంద్రుడు మొదలైన వారి స్వభావాల్ని వీర రసస్ఫూర్తితో వర్ణించారు. మాంచాలతో ముచ్చట్లుగావిస్తున్న బాలచంద్రునితో

"కొంగువిడువుము ధూర్తుడా! కొంగు విడుము.....

బిరుదుగల మగలెల్లమున్ వీర్య శౌర్య

పద్ధతిని నుద్ధతిని జూపి యిద్ధరీతి

మాతృదేశ రక్షను సల్పి మాన్యులైరి

ఇట్లు మోహ పరవశులై ఇంగితమ్ము

విడిచిరె"- అని కదనరంగానికి ఉన్ముఖుని గావించిన తీరును ఒళ్లు గగుర్పొడిచే రీతిలో వర్ణించారు.

ఆరుద్ర కూనలమ్మ పదాల్ని దృష్టిలో పెట్టుకుని లక్ష్మీకాన్తమ్మగారు సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ 'కన్యకమ్మనివాళి' అనే రచనగావించారు. 1967నాటి పరిస్థితుల్ని కళ్లకు గట్టినట్లు చెప్పారు. 'మంత్రిరౌడీకిరక్ష- మంత్రికి రౌడీ రక్ష- పదవిచేటురా కక్ష- ఓకన్యకమ్మా"- అని ఆనాటి రాజకీయస్థితిని వివరిస్తూ" కక్షలు పదవికి చేటును కలిగిస్తాయనే ప్రబోధంగావించారు.

మధురకవి నాళం కృష్ణారావుగారి కుమార్తెగా 21-12-1917న జన్మించిన లక్ష్మీకాన్తమ్మగారు 1-12-1996న పరమ పదించేనాటికి ఎన్నో రచనలు గావించారు. ఉపన్యాసాలిచ్చారు. భౌతిక, దేహాన్ని వీడినా ఆమె సాహిత్య పరంగా ఇంకా జీవిస్తున్నారని చెప్పాలి. ఈమెను గూర్చి నేరాసిన పద్యంతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను

అసమానంబగు పద్య కావ్యములనత్యంత ప్రభావమ్ముగా,

రసవద్గానము నిండియున్న రచనల్ శ్రావ్యమ్ములైయొప్పగా

పసరూపించెడి వాగ్ఝరీమహిమతో వక్తృత్వవిన్యాసముల్

వెసగావించిన లక్ష్మికాన్తమ!నతుల్ వేవేలు గావించెదన్.

# కళాప్రపూర్ణ లక్ష్మీకాన్తమ్మ

- డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి

లక్ష్మీకాన్తమ్మ ఉభయ భాషా ప్రవీణ పరీక్షలో ఉత్తీర్ణ ఎం.ఏ. చదువలేదు. పి. హెచ్.డి. చేయలేదు. అధ్యాపక వృత్తిని చేపట్టలేదు. అయినా తనదగుస్థానాన్ని సాహిత్యరంగంలో, ముఖ్యంగా ఉపన్యాస ప్రక్రియలో సంపాదించుకొన్నారు. కొండంత ఆత్మ విశ్వాసం, గోదావరంత వాక్చాతుర్యం ఆమెకు ఆ స్థానాన్ని సంపాదించి పెట్టాయి. విద్యార్థిలోకంలో, కాలేజీలలో, యూనివర్సిటీలలో ఎన్నెన్ని ఆహ్వానాలు! ఎన్ని స్వాగతాలు! నాకు తెల్సినంతవరకు ఆమెది అద్వితీయమైన స్థానం. ఎవరు అధిగమించలేదు, అనుసరించలేదు. అట్టి సుస్థిర స్థానాన్ని ఆమె సంపాదించుకొన్నది. నిలబెట్టుకొనగల్గినది.

మోతేవారు మాతామహులు. నాళంవారు పితామహులు. ఊటుకూరి వారు భర్త వంశంవారు. ఈ వంశాల ప్రభావం ఆమె పెట్టుబడి. అదే ఆమెకు అండ. ఉపన్యాసాలలో ప్రచండయై, రుద్రయై, సాహితీ రుద్రమగా ప్రస్ఫుటించినది. గోదావరి పాండిత్యం, కృష్ణా నిర్మలత్వం, ఆమెకు అబ్బినవి. గుంటూరు పట్టుదల, ఆవేశం, ఆమెకు ఉత్సాహాన్నిచ్చాయి. ఎన్నో పవనాలు ఆమె జీవనవనంలో వీచాయి. ఆ పవనాలలో పూచిన పుండరీకమే లక్ష్మీ కాన్తమ్మ. ప్రభావాల సమ్మేళనమే ఈ సాహితీ త్రివేణి లక్ష్మీకాన్తమ్మ. నాళం కృష్ణారావు రాజమండ్రిలో గొప్పవ్యక్తి. గౌతమీ గ్రంథాలయ స్థాపకులు. వీరేశలింగం అనుచరుడైన బ్రహ్మమతావలంబి, ఆధునికతీ నవీనతా సమీరాలలో తేలినవాడు. చిన్నతనాల పెళ్ళిళ్ళ ఫలితం కాబోలు తండ్రి ఆధునికత ఈమెకు అబ్బలేదు. సనాతనం మీద మోజు. ఆంధ్రమాతాభిమానమే మెండు. విశ్వధర్మముకన్న విశ్వహిందూ పరిషత్తు ఆమెను వశంచేసి కొన్నది. సనాతన వ్యసనాలే కప్పివేసాయి. ఆధునికతా ప్రమాణాలలోనూ విదేశ విహారాలలోనూ, మహిళాభ్యుదయమే ఆమె అభిమానరంగం. విజ్ఞానం కన్న సాహిత్య సంగీతాలే ఆమె అభిమానవేదికలు. కలియుగంకన్న కృత, త్రేతా, ద్వాపర యుగాలే అభిమాన యుగాలు. సమకాలీన ఉద్దేశ్యాల దర్పణం. నేడులకన్న నిన్నలే ఆమె కన్న కలలు.

నేను చెప్పినది కొంత అప్రస్తుతమైనా ఆమె స్థానాన్ని కదల్పలేదు. మరుగున పడిన ఆంధ్ర కవయిత్రులను వెలుగులోనికి తెచ్చింది. అక్షర నీరాజనాలర్పించింది. చెరుకువాడ వేంకట నరసింహం, కల్లూరి సుబ్బారావు, దుగ్గిరాల బలరామకృష్ణయ్య, జమ్మలమడక మాధవరాయశర్మ ఆంధ్ర భాషలో మంచి వక్తలని నా తలంపు. మహిళలలో అగ్రస్థానం ఊటుకూరి వారిదేనని నా భావన.

- సంస్కృతి నుండి

# "సాహితీరుద్రమ" ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ

- ప్రొఫెసర్ వెలమలసిమ్మన్న

"కవితయందెకాదు, కమనీయ సంస్కృతి
రక్షయందు, గాన దీక్షయందు
బహుముఖ ప్రసంగ పరిపాటియందీమె
వీనుమిగిలెనాంధ్ర విశ్వమునను"

– తెనుగులెంక తుమ్మలసీతారామమూర్తి.

స్వాతంత్రసమరయోధురాలిగా, స్త్రీజనాభ్యుదయవాదిగా ధర్మప్రచారకురాలిగా, విద్యావతిగా, కవయిత్రిగా, ఉపన్యాసకురాలిగా, సమాజసేవకురాలిగా, పేరుప్రఖ్యాతులు పొంది ఈనాటికీ మహిళాలోకానికి ఆదర్శంగా నిలిచిన ప్రముఖ విదుషీమణి 'కళాప్రపూర్ణ' శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు. ఆమె ఒక వ్యక్తికాదు ఒకసంస్థ.

మరుగునపడిన తెలుగు కవయిత్రుల్ని ఎందరినో వెలుగులోనికి తెచ్చి అపారమైనకీర్తిప్రతిష్ఠల్ని ఆర్జించిన బహుముఖ ప్రజ్ఞాశాలిని లక్ష్మీకాంతమ్మగారు అందుకే సుప్రసిద్ధ విమర్శకులు, విఖ్యాత సాహితీవేత్త ఆరుద్రగారు" సంస్కృతాంధ్ర భాషలలోనే కాక, సంగీతసాహిత్యాలలో ప్రవీణురాలు. ఈమెకు తెలియని, ఆంధ్రరచయిత్రి ఎవరైనా ఉంటే, ఆమెదేశానికి తెలియని రచయిత్రి అనిచెప్తే తప్పులేదు" అని అన్నారు.

లక్ష్మీకాంతమ్మగారి కుటుంబసభ్యులు ఇచ్చిన సమాచారం ప్రకారం 1917 డిసెంబర్21వతేదిన ఈమె పుట్టారు. సంగీత సాహిత్యాలకు నెలవైననాళం సుశీలమ్మ, కృష్ణారావుగార్లు ఈమె తల్లిదండ్రులు. 1930 మార్చిలో హయగ్రీవగుప్తా గారితో వివాహం అయింది.

లక్ష్మీకాంతమ్మగారి జీవితం, సాహిత్యం, రెండూ ఆదర్శవంతమైనదే. తండ్రి కృష్ణారావుగారి నుంచి జాతీయభావాలు, కవిత్వంపట్ల ఆసక్తి, సంఘసేవానురక్తి, ఉత్తమ సంస్కారం లాంటి ఉన్నతగుణాల్ని పుణికిపుచ్చుకొన్నారు. ఆమెకు తల్లినుంచి భారత్, రామాయణాదిగ్రంథాలపట్ల ఆసక్తి, సంగీతంపట్ల అనురక్తి సంక్రమించాయి. పట్టుదల, సద్యఃస్ఫూర్తి, అహింసాతత్వం, అన్యాయంపట్ల అసహనం, వాఖ్మిత్వం. లక్ష్మీకాంతమ్మగారి జీవితంలో ప్రధానమైన గుణాలు. అవే ఆమెకు వన్నె తెచ్చాయి.

పూవు పుట్టగానే పరిమళించినట్లు లక్ష్మీకాంతమ్మగారు బాల్యంనుండే అన్యాయాలకు ఎదురుతిరిగేవారు. చిన్ననాడే తన స్నేహితురాలిని ఆటపట్టించిన కొంటెకుర్రవానికి కాలిచెప్పుచూపి బెదిరించారు. తాను చదువుకొనేరోజుల్లోనే సూర్యకాంతం అనే స్నేహితురాలికి జరిగిన అన్యాయాన్ని ఎదిరించింది. తనమూలంగా బడికి ఆలస్యంగా వచ్చిన తన స్నేహితురాలిని తాళం చెవితో గాయపరచిన టీచర్ రమణమ్మను తిరిగి సదనానికి

రాకుండా చేసింది. ఈలాంటి ఘట్టాలు లక్ష్మీకాంతమ్మగారి జీవితంలో ఎన్నో వున్నాయి. మంచికి మారుపేరు లక్ష్మీకాంతమ్మగారు.

లక్ష్మీకాంతమ్మగారి జీవితం బహుముఖీనమైంది. ఆమె ఎన్నో పదవుల్ని అలంకరించారు బహుసమర్థురాలుగా మన్ననలు పొందారు. ఆంధ్రవిశ్వకళాపరిషత్ సెనేట్‌లోనూ, ఆలిండియా రేడియో ఎడ్వైజరీ కమిటీలోనూ, ఆంధ్రప్రదేశ్ సంగీత అకాడమిలోనూ, ఆంధ్రప్రదేశ్ సంక్షేమశాఖా సలహాసంఘంలోనూ, ఆంధ్రరచయితల సలహా సంఘంలోనూ, కేంద్రసాహిత్య అకాడమీలోనూ లక్ష్మీకాంతమ్మగారు సభ్యురాలుగావుండి తమ ప్రజ్ఞపాటవాల్ని ప్రదర్శించి పేరు ప్రఖ్యాతులు గావించారు.

వీరు అందుకున్న పురస్కారాలు ఆమె అసమానప్రతిభా వైభవానికి మచ్చుతునకలు. గృహలక్ష్మి పత్రికవారిచే స్వర్ణకంకణ పురస్కారం, అఖిల భారత తెలుగు రచయితల మహాసభాసన్మానం, ప్రపంచతెలుగుసభలలో సమ్మానం, మద్రాసు ఆంధ్రమహాసభలో సన్మానం, తెలుగు విశ్వవిద్యాలయం వారి సత్కారం ఇలా ఎన్నో పురస్కారాలు, సన్మానాలు పొందారు.

లక్ష్మీకాంతమ్మగారి ప్రతిభకు పట్టంకట్టే ఉద్దేశంతో అనేకసంస్థలు, సంఘాలు బిరుదులతో సత్కరించటం చెప్పుకోదగ్గ విశేషం. విద్వత్కవయిత్రి, తెలుగుమొలక, ఆంధ్రసరస్వతి, సాహితీ రుద్రమ, ధర్మ ప్రచారభారతి, కళాప్రపూర్ణ (ఆంధ్రవిశ్వకళాపరిషత్), బ్రాహ్మీభూషణ, ఆంధ్ర విదుషీకుమారి, కళాభారతి, సంగీతసాహిత్యకళానిధి, అపరవాగ్దేవిలాంటి ఎన్నో బిరుదులు లక్ష్మీకాంతమ్మగారికి వరించాయి.

ఆమెకు ఉపన్యాసాలు నల్లేరు మీదనడక అప్పటికప్పుడు ఉపన్యాసాలు చెప్పగల ప్రతిభాశాలి లక్ష్మీకాంతమ్మగారు. వీరి ఉపన్యాసాలు విషయ భరితాలు, విజ్ఞానతరంగాలు. ఈమె చేసిన ఉపన్యాసాలు, సాహిత్యపరమైనవి. ఆధ్యాత్మికమైనవి. మహిళాభ్యుదయానికి చెందినవి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆమె ఉపన్యాసాలు ఉప్పొంగిఉరకలెత్తే గంగాతరంగాలు. అందుకే ఆచార్య సి.నారాయణరెడ్డిగారు “పాండిత్యవాదానికీ, ప్రచండవక్తృత్వ ప్రావీణ్యానికి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కోటికెక్కింది. ఆంధ్ర వాఙ్మయరంగంలో చిరకాలంగా ఓజోమూర్తిగా వెలుగొందుతున్న రచయిత్రి లక్ష్మీకాంతమ్మగారు” అని అన్నారు.

లక్ష్మీకాంతమ్మగారి ఉపన్యాసధోరణి అనన్యసామాన్యమైంది. అతికొద్దిమందికి మాత్రమే ఆధోరణిఅలవడుతుంది. 1950వ సంవత్సరంలో ఆంధ్రవిశ్వకళాపరిషత్ వారి సాంస్కృతికోత్సవాలలో భాగంగా జరిగిన ఉత్సవసభలో లక్ష్మీకాంతమ్మగారు ప్రసంగించి ప్రముఖులమన్ననల్ని ప్రశంసల్ని అందుకున్నారు. అందుకే డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యగారు “సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలినిగా శ్రీమతి లక్ష్మీకాంతమ్మగారు పేరుతెచ్చుకోవటం ఆశ్చర్యకరమైన అంశంకాదు. ఆమెతో పోటీపడే రచయిత్రులు యావదాంధ్రంలో పలువురు ఉద్భవించవచ్చు. అయితే ఆమెవంటి ఉపన్యాసకురాలు బహుశః కొన్నితరాలు గడిస్తేగాని ఆంధ్రభూమిలో అవతరించకపోవచ్చు. జలపాత సదృశమైన అనర్గళ వాగ్ధోరణితో ఆమె ప్రసంగించడం విన్నవారు ఆశ్చర్యచకితులు కావటం కద్దు” అని అన్నారు.

వీరు సంస్కృతాంధ్ర భాషల్లో విలువైన సాహిత్యాన్ని సృష్టించి, తనకీర్తికి శాశ్వతత్వాన్ని సంపాదించుకున్నారు. లక్ష్మీకాంతమ్మగారు వివిధ ప్రక్రియల్లో రచనలు చేయటమేకాక, ఆయాప్రక్రియల్ని సమర్థవంతంగా నిర్వహించి, తమదైన ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

లక్ష్మీకాంతమ్మగారు సంస్కృతంలో మూడుగ్రంథాలు. తెలుగుభాషలో పదిహేను గ్రంథాలు మొత్తం 18 గ్రంథాలు రాసి తెలుగుసాహిత్యంలో కీర్తిప్రతిష్ఠలు సంపాదించారు. కన్యకాపరమేశ్వరి సుప్రభాతమ్, దేవీస్తవతారావళి, జాతిపిత మొదలైనవి సంస్కృతగ్రంథాలు. పద్యకావ్యాలు రెండు రాశారు. 1.మహిళా విక్రమసూక్తం 2. లజ్జకిరీటధారుణి గేయకావ్యాలు నాలుగురాశారు. 1. మనసాహితి-మధురభారతి, 2. నాతెలుగు మాంచాల, 3. ఒక్క చిన్నదివ్వె, 4. కాంతిశిఖరాలు. 'కన్యకమ్మనివాళి' అనేది వ్యంగ్యకావ్యం. సదుక్తిమంజరి అనేది అనువాదకావ్యం. ఆరువచనగ్రంథాలు రాశారు. 1.ఆంధ్రకవయిత్రులు, 2. అఖిలభారతకవయిత్రులు. 3. ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళాసేవ అనే మూడు విమర్శనాత్మక గ్రంథాలు ఈకోవలోనివే 4. నావిదేశీ పర్యటన- అనుభవాలు అనేది యాత్రాగ్రంథం. 5. భారతదేశచరిత్ర- కొన్ని గుణపాఠాలు అనేది అనువాద గ్రంథం. సాహితీరుద్రమ అనేది లక్ష్మీకాంతమ్మగారి స్వీయచరిత్ర. సరస్వతీ సామ్రాజ్యవైభవం అనేది రూపకం. ఈ పదిహేను గ్రంథాలు తెలుగులోరాశారు.

కన్యకా పరమేశ్వరి వైశ్యుల ఆరాధ్యదేవత. విష్ణువర్ధన మహారాజు ఆమెను చెరపట్టడానికి ప్రయత్నించగా, కన్యక అగ్నిలో దూకి కళంకం లేనిదై మహిళాలోకంలో ఆదర్శ నారీమణిగా ప్రసిద్ధిపొందింది. ఆదేవిని గూర్చిన స్తోత్రమే 'కన్యకాపరమేశ్వరీ సుప్రభాతమ్'. ఈ సుప్రభాతమ్ లక్ష్మీకాంతమ్మగారి భక్తిప్రపత్తులకు ఆర్షధర్మ నిరతికి నిదర్శనం. 'దేవీస్తవతారావళి' అనేవి దుర్గాదేవిని స్తుతిస్తూ రాసిన కావ్యం. లక్ష్మీకాంతమ్మ గారి సంస్కృతభాషలోగల ధారాశుద్ధికి ఇది తార్కాణం. జాతిపితగా ప్రసిద్ధికెక్కిన గాంధీజీ జీవితఘట్టాలు జాతిపిత గ్రంథంలో చోటుచేసుకున్నాయి.

'మహిళావిక్రమసూక్తం'లో వైదికఖండం, పురాణఖండం, స్మృతిఖండం, కావ్యఖండం, చరిత్రఖండం, ఆధునిక ఖండం, సత్యాగ్రహఖండం, సంస్కారఖండం, ప్రస్తుతఖండం అనే తొమ్మిది ఖండాలతో ఆయాకాలాల్లో ప్రసిద్ధిగాంచిన మహిళల విక్రయం స్తురించబడింది. 'లజ్జాకిరీట ధారణి'లో మొల్ల, ఝాన్సీలక్ష్మీబాయి, అహల్య, కస్తూరిభా, రుద్రమ, కన్యక, సరోజినీదేవి మొదలైన సాధ్వీమణుల్ని గూర్చి ఇందులో ప్రస్తావించారు. ఇంకా బాపూజీ, రామకృష్ణపరమహంస, సర్వేపల్లి రాధాకృష్ణ, మొదలైన ప్రసిద్ధుల్ని కూడా పేర్కొన్నారు.

"మనసాహితి-మధుభారతి"లో మనసంస్కృతి-ఘనసత్కృతి, రుధిరప్రస్థానం, చదువుకో ఓ బాలచదువుకో, అది ఒక గడ్డిపువ్వు మొదలైన 13 ఖండికలున్నాయి. 'నాతెలుగుమాంచాల' పల్నాటి వీరవనిత మాంచాల నీ సౌశీల్యం, వీరపత్నీ ఆదర్శం కమనీయంగా వర్ణించబడింది. 'ఒక్కచిన్నదివ్వె'లో గాంధీమహాత్ముని గూర్చి మూడు ఖండికలలోనూ, దీపావళిపండుగను గూర్చి నాలుగు ఖండికలలోనూ, ఉగాదిని గూర్చి రెండు ఖండికలలోనూ రచయిత్రి మనోహరంగా వర్ణించారు. 'కాంతిశిఖరాలు' లో 20ఖండికలున్నాయి. ఇది రేడియోలో ప్రసారం చేసిన గేయాలు. వీటిని రచయిత్రి బ్రహ్మసమాజప్రభావంచే రాశారు.

'కన్యకమ్మ నివాళి' అనే పేరుతో సమాజాన్ని గూర్చి వ్యంగ్య ధోరణిలో రాశారు. ఆ కావ్యనికి ఆరుద్రగారి కూనలమ్మ పదాలు స్ఫూర్తి అని లక్ష్మీకాంతమ్మగారు పేర్కొన్నారు. హిందీసాహిత్యంలో ప్రసిద్ధులైన కబీరు, తులసి, బృంద, రహీమ్‌ల దోహాలకు లక్ష్మీకాంతమ్మగారు 'సదుక్తిమంజరి' అనే పేరుతో స్వేచ్ఛానువాదం చేశారు.

1951లో మద్రాసు ప్రభుత్వపక్షాన, తెలుగు భాషాసమితివారి పిలుపుమేరకు లక్ష్మీకాంతమ్మగారు

'ఆంధ్రకవయిత్రులు' గ్రంథాన్ని ఎంతోశ్రమకోర్చి రాశారు. ఈగ్రంథానికి బహుమతి కూడా లభించింది. ఈగ్రంథం లక్ష్మీకాంతమ్మగారి రచనలలో విశిష్టమైంది. ఆంధ్రప్రదేశ్ తెలుగు సాహిత్య అకాడమీ పక్షాన లక్ష్మీకాంతమ్మగారు 'అఖిలభారత కవయిత్రులు' అనే సంకలన గ్రంథాన్ని వెలువరించారు. ఇది 1965లో ముద్రితమైంది. 'ఆంధ్రులకీర్తనవాఙ్మయకళాసేవ' అనేగ్రంథంలో సంగీతసాహిత్యాలు రెండింటిలో అభినివేశమున్న లక్ష్మీకాంతమ్మగారు వాగ్గేయకారులైన అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్య, హరినాగభూషణం, మంగళంపల్లి బాలమురళీకృష్ణ మొదలైనవారి సంగీత, సాహిత్యవిశేషాన్ని వివరించారు. లక్ష్మీకాంతమ్మ సంగీత, సాహిత్య విశేషాల్ని వివరించారు. లక్ష్మీకాంతమ్మగారి సంగీత ప్రావీణ్యానికి నిదర్శనం ఈ గ్రంథం. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖవారి ఆహ్వానంపై లక్ష్మీకాంతమ్మగారు రష్యా, తూర్పు జర్మనీ, చెకోస్లోవేకియా, అమెరికా మొదలగు దేశాలు పర్యటించారు. ఆ పర్యటనలోని అనుభవాల్ని 'నా విదేశీ పర్యటన అనుభవాలు' అనే గ్రంథం ప్రకటించారు. ఆంగ్లంలో ప్రొఫెసర్ హుమాయున్ కబీరు రాసిన 'Lessons of Indian History" అనే గ్రంథాన్ని 'భారతచరిత్ర-కొన్ని గుణపాఠములు' అనేపేరుతో లక్ష్మీకాంతమ్మగారు అనువాదంచేశారు..

'సాహితీరుద్రమ' అనేది లక్ష్మీకాంతమ్మగారి స్వీయచరిత్ర. రచయిత్రి తనబిరుదు 'సాహితీరుద్రమ'ను స్వీయచరిత్రగ్రంథానికి పెట్టుకొన్నారు. 'సాహితీరుద్రమ' బిరుదును దేవులపల్లి రామానుజరావుగారు ఇచ్చారు. స్త్రీలలో స్వీయచరిత్ర రాసిన వారిలో లక్ష్మీకాంతమ్మను అగ్రగణ్యంగా చెప్పవచ్చు. స్వీయచరిత్ర రచనకు అవసరమైన నిజాయితీ, ధైర్యసాహసాలు ఈమెకు సంపూర్ణంగా వున్నాయి. "లక్ష్మీకాంతమ్మజీవితమే ఒక తెరచిన పుస్తకం. ఈతెరచిన పుస్తకంలో ఏపుటతెరచి అవలోకనం చేసినా ఏదో ఒక అంశం ప్రత్యక్షమవుతూనే వుంటుంది" అని ఏదో ఒక అంశం ప్రత్యక్షమవుతూనేవుంటుంది" అని ఆరుద్రగారు పేర్కొన్నారు. "లక్ష్మీకాంతమ్మకథ ఆమె వ్యక్తిత్వ సాహిత్యాలకు పట్టిన నిలువెత్తు అద్దం' అని ఆచార్య సి.నారాయణరెడ్డిగారు అన్నారు. లక్ష్మీకాంతమ్మగారి విశిష్టమైన జీవితసర్వస్వం ఇందులోని క్షిప్తమైంది. ఈగ్రంథం చదివితే లక్ష్మీకాంతమ్మగారు నిజంగా రుద్రమ్మే అని సహృదయ పాఠకులకు ఎవరికైనా అనిపిస్తుంది. ఆంధ్రసాహిత్యంలోని ప్రసిద్ధకవయిత్రులను అందరినీ ఒకవేదికపైకితెచ్చి, వారికృతుల్ని, వానిలోని విశేషాల్ని వివరించిన రూపకం 'సరస్వతీ సామ్రాజ్య వైభవం'.

ఒక రచయిత్రిగా, వక్తగా, సంఘ సేవాపరాయణురాలిగా, తెలుగుదేశంలోనేకాక యావద్భారతదేశంలోనే ఒక విలక్షణమైన స్థానాన్ని సంపాదించుకొన్నారు 'సాహితీరుద్రమ' శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు.

"లక్ష్మీకాంతమ్మ తనదగుస్థానాన్ని సాహిత్యరంగంలో,
ముఖ్యంగా ఉపన్యాసప్రక్రియలో సంపాదించుకున్నారు.
కొండంత ఆత్మవిశ్వాసం, గోదావరంత వాక్చాతుర్యం
ఆమెసొంతం. నాకు తెలిసినంతవరకు ఆమెది అద్వితీయమైన
అట్టి సుస్థిరస్థానాన్ని ఆమె సంపాదించుకున్నది నిలబెట్టుకొనగల్గింది"

(- డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి)

# ధీరవనిత

- డా॥ రావెళ్ళ శ్రీనివాసరావు

నాళమువారి వంశమునబుట్టి
ఊటుకూరివారి చరితనుఉన్నతిగ జేసి
సూర్యకాంతము తోటి స్నేహముజేసి
ఏటేట తరగతిలో మొదటిగా నిలచిన-
వీరవనితవు నీవు! ధీరవనితవు !!

ఉదయకాలముననే లేచి
వీణాభ్యాసము జేసి
వీధులన్నితిరిగి కోతికొమ్మచ్చులాడి
ఉపన్యాస పోటీలో ఉన్నతినిపొందిన-
వీరవనితవు నీవు! ధీరవనితవు!!

'కాళిదాసు' నాటకానికి తన్మయత్వముచెంది
గణపతి శాస్త్రిగారి దీవెనలందుకొని
విద్వత్కవయిత్రియను బిరుదుపొంది
సాటిలేని మనిషిగా వేరుపొందిన-
వీరవనితవు నీవు! ధీరవనితవు!!

సత్యాగ్రహ ఉద్యమాన
ఆంగ్ల పత్రాలను అనువదించి
తండ్రికి చేదోడుగా
సాహస నారిగా నిలచిన-
వీరవనితవునీవు! ధీరవనితవు!!

పావలా చందానువేసి
'కనుపర్తి' వారితో చేయికలిపి

'హితైషిణీ'లోన జేరి
మహిళాభివృద్ధికి పాటుపడిన-
వీరవనితవునీవు! ధీరవనితవు!!

అమరావతిలోన జీవహింసను ఆపి
గిల్డ్ ఆఫ్ సర్వీసులో చేరి
వరదబాధితులను ఆదుకొని
ధైర్యసాహసాలను మిక్కుటముగజూపిన-
వీరవనితవునీవు! ధీరవనితవు!!

ఆంధ్రకవయిత్రులను గ్రంథమ్ము
కాలానికెదురీది మిమ్ములను
ఆంధ్రసరస్వతిగా నిలిపినది
కేసరిగారిచే స్వర్ణకంకణమ్మునందుకొన్న-
వీరవనితవు నీవు! ధీరవనితవు!!

అంకురిత దీక్షతో ఉద్యమాలునిర్వహించి
అఖిలాంధ్ర కవయిత్రులను
ఒక చోట జేర్చి సాహితీవేత్తగా
దేశదేశాలు తిరిగిన-
వీరవనితవు నీవు! ధీరవనితవు!!

ఆర్యవైశ్య సంఘసేవలు చేసి
భావపురి రచయితల సంఘమునుస్థాపించి
'కళాభారతి'కి తిలకందిద్ది
సాహితీ ఉపన్యాసములనిచ్చిన-
వీరవనితవునీవు! ధీరవనితవు!!

సరస్వతీ సామ్రాజ్య వైభవాన్ని చూపి
'కనకమ్మ నివాళి' యను పద్యకావ్యాన్ని రచియించి
'చంద్రమతి'ని తిరుపతిదేవునికిచ్చి
గజారోహణమందిన -
వీరవనితవు నీవు! ధీరవనితవు!!

# లక్ష్మీకాన్తమ్మగారు - నేను

- డా. చిల్లర భవానీదేవి

అవి నేను బాపట్ల సరస్వతీ మెమోరియల్ బాలికల ప్రభుత్వ పాఠశాలలో ఏడవతరగతి చదివే రోజులు. మా స్కూల్లో ప్రతి శనివారం సాయంత్రం రెండు పీరియడ్స్ సమయాన్ని సాహిత్య సాంస్కృతిక అంశాలకు కేటాయించి ఆ సమయంలో ప్రముఖ వ్యక్తులచేత ఉపన్యాసాలు ఇప్పించేవారు. పలువురు రచయితల వాక్కు వినే అవకాశం ఆవిధంగా నాకు బాల్యంలోనె లభించింది. నేను టీచర్ల ప్రోత్సాహంతో తెలుగు లిటరరీ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేస్తూ ప్రముఖులను ఆహ్వానించి వారిచే ఉపన్యాసాలు ఇప్పించటం చాలాసార్లు జరిగింది. ఈ కార్యక్రమాల్లో భాగంగా లక్ష్మీకాన్తమ్మగార్ని ఆహ్వానించటానికి వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఆవిడ తాదాత్మ్యంతో వీణను వాయిస్తున్నారు. నేను సంకోచంతో భయభక్తులతో వరండాలోనే ఆగిపోయి వీణాగానాన్ని వింటూ నిల్చుండిపోయాను. తర్వాత ఆమె లేచివచ్చి ఆదరంగా పలకరించి నా ఆహ్వానాన్ని అంగీకరించారు. అంతటి వ్యక్తి నాతో అలా ఆదరంగా మాట్లాడటం నాకు ధైర్యాన్నీ, ఆనందాన్నీ కలిగించాయి. ఈ పరిచయం జీవితమంతా నిలుపుకోగలగటం నా అదృష్టం.

తర్వాతికాలంలో చాలాసార్లు గంగార్ఝురిలాంటి వారి వాక్ప్రవాహం వినటం జరిగింది. ఆ వాక్కులో తీక్షణత, ఆ వదనంలో ఉద్వేగం, ఆత్మవిశ్వాసం, ఓ లక్ష్మీబాయినీ, మగువ మాంచాలను తలపింపజేసేవి. వారి ఉపన్యాసంలో చాలా అంశాలు. పదాలు ఆ వయస్సులో నాకు పూర్తిగా అర్థం కాకపోయినా మళ్ళీమళ్ళీ వినాలనిపించేది. వారితో తరచూ మాట్లాడే అర్హతగానీ, వయస్సుగానీ అప్పుడు నాకు లేవు. బాపట్లలో పలువేదికలపై మన్ననలందుకునే ఆ విదుషి గురించి నాకు కాలక్రమంలో తెలిసింది.

మా నాన్నగారు కోటంరాజు సత్యనారాయణశర్మగారు లక్ష్మీకాన్తమ్మగార్ని 'అక్కయ్య' అని సంబోధించేవారు. ఆమె కూడా నాన్నగార్ని తమ్ముడిలా సంభావించేవారు. అలా వారిని 'అత్తయ్యగారూ' అని పిలవటం మాకు అలవాటయింది. నాన్నగారికున్న సాహిత్యాభిలాషవల్ల మా కుటుంబం వారికి ఆప్తమై నన్ను మరింతగా చేరువయే అవకాశాన్ని కలిగించింది. "ఆడబడుచును వచ్చానమ్మా. ఏం పెడతావు" అని స్వతంత్రంగా వంటింట్లోకి వచ్చి పీట వాల్చుకుని కూర్చునేవారు. మా యింట్లో జరిగిన ప్రతి పెళ్ళిలో ఇంటి ఆడబడుచుగా మొదట చీర, పసుపు కుంకుమను ఆమెకే అందించేవారు నాన్నగారు. నా పెళ్ళిలో ఆమె హిందూ వివాహ మంత్రార్థాల గురించి చేసిన ప్రసంగం పెళ్ళికొచ్చినవాళ్ళందరికీ ఆసక్తినీ ఆనందాన్నీ కల్గించింది. గుప్తగారు నాన్నకన్నా సీనియర్ లాయర్‌గా సలహాలిచ్చేవారు. నాన్నగారు గుప్తగారికోసం వాళ్ళింటికి వెళ్ళినప్పుడు నేను తరచుగా వెళ్ళేదాన్ని.

కనుపర్తి వరలక్ష్మమ్మగారి 'స్త్రీ హితైషిణి మండలి' నిర్వహించే వివిధ పోటీలలో బహుమతులు గెల్చుకున్న నన్ను, వారు విశాల హృదయంతో వెన్నుదట్టి ప్రోత్సహించటం నేను మర్చిపోలేని అపురూపస్మృతి! భారతీయ సంస్కృతి గురించి ఆమె మాట్లాడుతుంటే కాలవ్యవధి కూడా గుర్తుండేది కాదు. సంస్కృతశ్లోకాలతో, భావావేశ ధోరణిలో అలవోకగా ప్రసంగిస్తుంటే ఆదమరిచి వినటం ఓ అనుభూతి. బాపట్ల టౌన్‌లో పలుమార్లు వారి ఉపన్యాసం ప్రతిధ్వనించని స్కూలుగానీ, సంఘంగానీ, సమావేశమందిరంగానీ లేదంటే అతిశయోక్తి కాదు.

వృత్తిరీత్యా న్యాయవాది అయినా స్వయానా కవి, సాహిత్యాభిమాని అయిన నాన్నగారి వెంట గుంటూరు మొదలగు ఇరుగుపొరుగు ఊళ్ళకు వెళ్ళి లక్ష్మీకాన్తమ్మగారి ఉపన్యాసాలు చాలాసార్లు వినటం జరిగింది. వారు సంస్కృత తరగతులు ఆరంభించటం నాకు గుర్తుంది. విజయవాడలో శ్రీరంగం గోపాలరత్నంగారితోబాటు ఆ మహనీయమూర్తిని సన్మానించిన సభకు నేనూ వెళ్ళాను. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, అఖిల భారత రచయితల మహాసభ, కేంద్ర సాహిత్య అకాడమీలాంటి గొప్ప సంస్థల పేర్లు వారి మాటల ద్వారానే నాకు పరిచయం.

భారత స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా విదేశీ పర్యటన చేసి తిరిగివచ్చినప్పుడు బాపట్లలో జరిగిన సన్మానసభలో ఆమె తమ అనుభవాలు వివరించగా విని ముగ్ధురాలినైనాను. ఆయా దేశాలలో భారతీయ సంస్కృతిపరమైన గౌరవవిశ్వాసాలతో కూడిన అనుభవాలను అందరికీ ఆమె పంచిపెట్టిన తీరు నా మనసును ఆకట్టుకుంది. స్వదేశ సంస్కృతిపట్ల ఆత్మవిశ్వాసంతో కూడిన అభిమానం వారిది. గీతాప్రచార పరిషత్ వ్యవస్థాపకులుగా నాన్నగారందించిన "భగవద్గీత" ప్రతులను ఆసక్తిగల విదేశీయులకు అందించినప్పటి అనుభవాలను ఆ సభలో ఆమె వివరిస్తుంటే అందరి హృదయాలు ఉప్పొంగాయి.

కవి సమ్మేళనాలలో పురప్రముఖ కవుల కవితలు వింటూ నా క్లాసు నోట్సుల వెనక పేజీలలో కవిత్వం రాయటం అలవాటయిన నాకు లక్ష్మీకాన్తమ్మగారి నిండైన స్వరం నాకు స్ఫూర్తినిచ్చే నాగస్వరం! తనదైన ధీశక్తితో వారి వ్యక్తిత్వం నన్ను బాల్యంలోనే అమితంగా ఆకర్షించింది.

'కళాభారతి' కార్యదర్శిగా నాన్నగారు వివిధ సాహిత్య కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నప్పుడు నేను కార్యనిర్వహణారంగంలో ప్రవేశించి వారికి సహాయపడేదాన్ని. 'కళాభారతి'కి లక్ష్మీకాన్తమ్మగారందించిన సలహాలు, సహాయసహకారాలు 'కళాభారతి'కొక చరిత్రను సృష్టించగలిగాయి. 'కళాభారతి' నాకొక దివ్య సాహితీలోకాలకు ద్వారాలను తెరిచింది.

నేను బి.ఏ. చదువుతున్నప్పుడు నా తొలికవిత (నవ్య, ఆంధ్రజ్యోతి) కథ (1973) (మారని ఆంతర్యం, స్వాతి) ప్రచురితమైనాయి. నా కథకు బరంపురం 'వికాసం' వారు బహుమతి ప్రకటించినప్పుడు మనసారా అభినందించి నా సాహిత్యాభివృద్ధిని కాంక్షించిన విశాలహృదయిని వారు! విజయవాడ ఆకాశవాణివారి కదంబ కార్యక్రమంలో కవిత చదవమని హఠాత్తుగా ఓసారి ఫోన్ చేశారు. నాకు ఆనందం కలిగింది. రికార్డింగ్‌కోసం వారింటికి వెళ్ళాను. నండూరి సుబ్బారావుగారి బృందం లక్ష్మీకాన్తమ్మ గారింట్లో కదంబ కార్యక్రమాన్ని రికార్డ్ చేశారు. 'కాలం' అనే కవితతో నా తొలి రేడియో పఠనాన్ని ప్రారంభింపజేశారు "ఆంధ్ర సరస్వతి".

ఆనాడు వారు తమ అమృతహస్తాల మీదుగా అందరికీ భోజనం వడ్డించారు. దానితోబాటు సరస్వతీ కటాక్షాన్నీ అందించారేమో! నా జీవితంలో సాహిత్యారాధన ప్రధానాంశంగా మారింది. ఆనాటినుండి నాకున్న కొద్దిపాటి పరిజ్ఞానాన్ని వృద్ధి చేసుకుంటూ రచనావ్యాసంగాన్ని కొనసాగిస్తూ వచ్చాను. ఆ రేడియో కవిత చదివిననాటినుండీ నన్ను కవయిత్రిగా అంతా గుర్తించటం మొదలుపెట్టటం నాకెంతో సంతోషంగాఉండేది. నోట్సులలోని కథలు, కవితలు ప్రచురితమయి ప్రజల్లోకి వెళుతున్నాయి. వయసులో, అనుభవంలో చిన్నదాన్నయినా నన్ను ప్రోత్సహించిన మంచి మనసున్న గొప్ప వ్యక్తుల్లో లక్ష్మీకాన్తమ్మగారు అతిముఖ్యులు.

బాపట్ల 'కళాభారతి' ఆధ్వర్యంలో పరీధావి సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన 'భువనవిజయం'లో జమ్మలమడక, కరుణశ్రీ, వావిలాల, ధనకుదరం మొదలైనవారితో లక్ష్మీకాన్తమ్మగారు మొల్లగా పాల్గొన్నారు. వారి అనర్గళ వాక్పటిమ, నా హృదయాంతర జ్యోతిస్సీమలను వెలిగించింది. ఆ కార్యక్రమానికి పనిచేసిన కార్యకర్తల్లో నేనూ ఉండటం కించిత్ గర్వకారణం. 1975వ సంవత్సరంలో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా విశిష్ట కవయిత్రిగా వారికి బహూకరింపబడిన తెలుగు సభల సన్మాన జ్ఞాపికను చూపిస్తూ పొంగిపోయారు. చిన్నపిల్లలా నిర్మలమైన వారి హృదయం నాకు చిత్రంగా అన్పించేది. నా విద్యార్థిదశల్లో వారిని చూస్తూ, వింటూ ప్రభావితమైన సంఘటనలు చాలా ఉన్నాయి. నాకు తెలీకుండానే అవి నన్ను సాహిత్యవిద్యార్థిగా మార్చాయి. నేను కార్యక్రమాలపట్ల, సాహితీవ్యాసంగం వల్ల ఆసక్తి చూపిస్తుంటే మా అమ్మగారు 'నువ్వు రెండో లక్ష్మీకాన్తమ్మ వవుతావా' అనేవారు. అంతటి పాండిత్యశక్తి నాలో లేకపోయినా ఆ మాటే నాకు కొండంత ఉత్సాహాన్నందించేది.

1976వ సంవత్సరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు లక్ష్మీకాన్తమ్మగారికి "కళాప్రపూర్ణ" ప్రదానం చేశారు. అప్పటికే నేను 'వనిత'కు కాలమిస్టుగా రిపోర్టర్‌గా పలువ్యాసాలు రాస్తున్నాను. వనిత సంపాదకులు లక్ష్మీకాన్తమ్మగారిని ఇంటర్వ్యూ చేయమని నాకో లేఖ రాశారు. అంతటి విశిష్ట వ్యక్తిని ఇంటర్వ్యూ చేయటం 'వనిత'వారు నాకిచ్చిన గౌరవం. నేను అడిగిన ప్రశ్నలకు విలువైన సమాధానాలను నిజాయితీగా ఇచ్చి ఆదరించిన విదుషీమణి ఆమె! ఆ ఇంటర్వ్యూలోనే నూతన రచయితలకు రాశికంటే వాసి ముఖ్యమనీ వాస్తవ దృక్పథంతో కలం పట్టాలనీ, స్వార్థం కోసం కాక, ధనం కోసం కాక సమాజానికి ఉపకరించే రచనలు చేయాలనీ ఇచ్చిన సందేశం నేనూ హృదయస్థం చేసుకున్నాను. ఆ విధంగా నా సాహితీప్రస్థానానికొక కరదీపికను వెలిగించి ఇచ్చారు ఆ ఓజోమూర్తి! నా జీవితంలో చాలా మరపురాని అంశాలను లక్ష్మీకాన్తమ్మగారే తొలిసారిగా ప్రారంభించటం నిజంగా నా అదృష్టం.

ఉద్యోగరీత్యా హైద్రాబాదు నివాసినైనాక తర్వాతి కాలంలో వారిని అప్పుడప్పుడు కలవటం జరిగింది. నా వివాహానికి వారు "పద్యరత్నాలు" చదివి ఆశీర్వదించారు. నా సాహితీ వ్యాసంగాన్ని కొనసాగించమని సలహా ఇచ్చారు. 1979వ సంవత్సరంలో నా కవిత 'ఆవేదన'కు వంశీ బర్కిలీ అవార్డు వచ్చినప్పుడు, నేను బాపట్ల వచ్చినప్పుడు నాళం కృష్ణారాయ పీఠం పక్షాన ప్రేమగా నన్ను సన్మానించారు. కవయిత్రిగా తొలి సన్మానాన్ని వారి అమృత హస్తాలమీదుగా అందుకోవటం ఒక పులకరింత. మచిలీపట్నంలో జరిగిన ఆంధ్ర సాహిత్య అకాడమీ కవయిత్రీ సమ్మేళనంలో పాల్గొనటానికి నన్ను ప్రోత్సహించి సాహితీలోకానికి పరిచయం చేసిన సహృదయిని వారు!

ఆమె ప్రతిష్ఠాత్మక రచన "ఆంధ్ర కవయిత్రులు"లో కవయిత్రుల జాబితాలో వాణి రంగారావు, నాయని వంటి ప్రముఖుల పేర్ల పక్కన నా పేరును ఉదహరించటం నాకు చూపిన వెలుగుబాటగా భావిస్తున్నాను.

చాలాసార్లు నా ఉత్తరాలకు ప్రేమగా జవాబు రాసేవారు. కథ, కవిత ఏది రాసినా, ప్రచురితమైనా చదివి, కలిసినప్పుడు అభిప్రాయం తెలిపేవారు. 1986వ సంవత్సరంలో నా తొలి కవితాసంపుటి 'నాలోని నాదాలు'కు ఆనాటి ఆవిష్కరణసభలో నా కవితల్లోని అంతస్సూత్రాన్ని తన సహజ గంభీరశైలిలో ప్రేక్షకులకు పరిచయం చేసి ఆశీర్వదించటం నేను మరువలేని మధుర సంఘటన.

1995వ సంవత్సరంలో "నాళం కృష్ణరాయ స్మారక ధర్మనిధి" పురస్కారాన్ని తెలుగు విశ్వవిద్యాలయం" నుండి నేను అందుకున్నప్పుడు ఆనందంతో అభినందించి ఆశీస్సులందించారు. వారి 'మగువ మంచాల' కావ్యంపై నేను సమీక్షావ్యాసాన్ని రాసినప్పుడు ఎంతో ఆనందించి ధన్యవాదాలు తెలిపినప్పుడు వారి మహోన్నత ఉదాత్త వైఖరికి విస్తుపోయాను. ఆకాశం నేలను అభినందించింది మరి!

వారికి ఆరోగ్యం బాగాలేదని తెలిసి చూడటానికి వెళ్ళాను. అంతటి ధీరగంభీరమూర్తి నా చేయిపట్టుకుని పక్కన కూర్చోబెట్టుకుని దిగులు పడటం చూసి నా కళ్ళు చెమరించాయి. అనారోగ్యం ఎంతటివారినైనా కుంగదీస్తుందేమో! తర్వాత 20 రోజులకే వారి గురించిన కడపటి వార్త (1996) అందటం నాకు విచారాన్ని కలిగించింది. సనాతన భారతీయ సంస్కృతిని పోషించే యవనిక వాలిపోయింది. "సుకవి జీవించు ప్రజల నాల్కల యందు" అన్నట్లు ఆమె బాపట్ల పురవాసుల హృదయాల్లోనే కాదు తెలుగు సాహిత్యమున్నంతకాలం చిరంజీవినే!

'ఆంధ్ర సరస్వతి' బిరుదాంకితురాలు, 'సాహితీరుద్రమ' లక్ష్మీకాన్తమ్మగారు రుద్రమలాగే జీవించారు. వారి సాహితీప్రకర్ష ఒక కోణమైతే, నిలువెత్తు వ్యక్తిత్వం మరో మెరుపుకోణం. వారి అపార సాహితీ వ్యాసంగ సాగర చైతన్యాన్ని చూసి ఉత్తేజితురాలినయ్యాను. ఆమె నాకిచ్చిన స్ఫూర్తి ఒక విద్యుత్తరంగం! సరస్వతీ కంఠాభరణంలోని పచ్చలపతకం తిరిగి యథాస్థానం చేరింది.

లక్ష్మీకాన్తమ్మగారు నావంటివారికెందరికో అందించిన దీప్తి ఎన్నో సాహితీదీపాలను వెలిగిస్తూ ఉంటుందనీ, వారితో నా పరిచయం నా జీవితంలో నేనిష్టపడే ఓ ప్రవృత్తిని నిండుగా నిలబెట్టిందనీ భావిస్తున్నాను. ఇంత మహత్తర అవకాశాన్ని నాకందించిన సాహిత్య అకాడమీకి కృతజ్ఞతలు తెలుపకుండా ఉండలేను.

'వనిత' మాసపత్రికలో నేను లక్ష్మీకాన్తమ్మగారితో జరిపిన ముఖాముఖి యథాతథంగా ఇస్తున్నాను.

# ఆంధ్రసాహిత్యంలో అపర రుద్రమాంబ

- డా॥ సి. నారాయణరెడ్డి
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత,
అధ్యక్షులు: ఆంధ్ర సారస్వత పరిషత్
రాష్ట్రప్రభుత్వ సాంస్కృతిక భాషావ్యవహారాల సలహాదారు
హైదరాబాద్

రణ పౌరుషానికీ–రాజ్యపాలన పాటవానికీ కాకతీయ రుద్రమాంబ గణుతి కెక్కింది. పాండిత్య వీరానికి –ప్రచండ వక్తృత్వ ప్రావీణ్యానికీ డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ కోటికెక్కింది ఆంధ్రవాఙ్మయరంగంలో చిరకాలంగా ఓజో మూర్తిగా వెలుగొందుతున్న రచయిత్రి ఆమె.

మధురకవి నాళం కృష్ణారావుగారి పుత్రికగా సంక్రమించుకున్న కవిత్వ వారసత్వంతో–సమకాలీన ప్రముఖ కవి పండితుల సాహచర్యంతో పండించుకున్న వ్యుత్పత్తి సంభారంతో లక్ష్మీకాన్తమ్మగారు తెలుగుభారతికి తులలేని ఆభరణాలు సమకూర్చారు. ఆమె వ్యక్తిత్వ సాహిత్యాలకు పట్టిక నిలువెత్తు అద్దం ఆమె ఆత్మ చరిత్ర. సారస్వత రంగంలోనేగాక సంస్కరణాత్మక సాంఘిక రంగాల్లో ఆమె వహించిన విశిష్ట భూమిక ఎంతో ఉజ్వలంగా అగుపిస్తుంది.

తెలుగుజాతి ఉషస్సు కవయిత్రుల కోసం ఎదురు తెన్నులు చూస్తున్న రోజుల్లో, మూడు దశాబ్దాల రుద్రమాంబలా నాళంవారు మనకు అందించారు. తల్లికి తన బిడ్డపై మోజుఉన్నట్లే ప్రతికవికి తన కవితలపై మోజు ఉంటుందని, కవి తన రచనల ద్వారా సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించాలి.

కాలనాడిని బట్టి వేమనలా కవితలు రాయాలి. ఆంధ్రసాహిత్యంలో అపర రుద్రమాంబగా వెలుగొందుతూన్న డా॥ లక్ష్మీకాన్తమ్మకు నా అభివందనాలు.

- సంస్కృతి నుండి

# తండ్రివారసత్వాన్ని నిలబెట్టిన కూతురు

- డా॥ పాకనాటి సూర్యకుమారి

తెలుగుమాగాణంలో గోదావరిజిల్లాలకు ఒక ప్రత్యేకత ఉంది. ఆ జిల్లాలు పాడిపంటలకు, ఉదారగుణానికి, సాహిత్యపోషణకు కేంద్రంగా భాసిల్లుతున్నాయి. నాళంవారికుటుంబం, నాళంవారిసత్రం ప్రఖ్యాతి వహించాయి. నౌకావ్యాపారానికి ప్రసిద్ధి నాళంవారి కుటుంబం. దానధర్మాలు చేయడంలో, కవులు పండితుల్ని ఆదరించడంలో విద్యాసంస్థలకు విరాళాలిచ్చి ప్రోత్సహించడంలో నాళంవారు ముందంజలో ఉండేవారు.

నాళంకృష్ణారావు తండ్రి, తాతలు కావ్యాల్ని అంకితం తీసుకొని కవుల్ని గౌరవించారు. గౌతమీక్షేత్రమాహాత్మ్యం వంటి గ్రంథాలను ముద్రించి పండితులకు పంచిపెట్టిన ఉదారస్వభావులు నాళం కామరాజుగారు. కామరాజుగారి చివరికుమారుడు నాళం కృష్ణారావు. ఈయన స్వయంగా కవి, మంచి మనీషి, స్వాతంత్ర్యోద్యమకారుడు బ్రహ్మసామాజికుడు, అభ్యుదయభావాలప్రోవు, ఉత్తమసంస్కారి.

సామాజికావసరాలను గుర్తించి, రాజమహేంద్రవరంలో గౌతమీగ్రంథాలయాన్ని ప్రారంభించిన దార్శనికుడు కృష్ణారావు. స్త్రీవిద్యను ప్రోత్సహించిన పెద్దమనిషి. అష్టదిగ్గజాలుగా భాసిల్లిన గోదావరీ ప్రాంతకవులను ఆదరించిన అపరకృష్ణదేవరాయలు కృష్ణారావు. శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి వీరికి మంచి సన్నిహితులుగా ఉండేవారు. చెళ్ళపిళ్ళవెంకటశాస్త్రి, అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు, రాయప్రోలు సుబ్బారావువంటి పెద్దలు రాజమండ్రిలో కృష్ణారావుగారి యింటిలో బసచేసేవారు. సమాజసంస్కరణాభిలాషులు కందుకూరి వీరేశలింగంగారి ఉద్యమానికి బాసటగా నిలిచారు కృష్ణారావుగారు. స్వాతంత్ర్యోద్యమంలో కుటుంబసమేతంగా పాల్గొని, విదేశీవస్త్రబహిష్కరణ, ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిర్వహించడంలో కృష్ణారావు ముందుండేవారు. ఖద్దరు ప్రచారం చేసేవారు.

నాళం కృష్ణారావు భార్య సుశీలమ్మ ఏలూరులోని మోతేవారి ఆడపడుచు. ఆమె చిన్నతనంలో భారతరామాయణాలను చక్కగా నేర్చుకుంది. సంగీతవిద్యలోను ప్రవేశంఉంది. భర్త కృష్ణారావు సాహచర్యంలో రాజమండ్రిలో సంగీత విద్యాలయాన్ని నిర్వహించారు.

సంగీత సాహిత్యాలకు నెలవైన నాళంకృష్ణారావుగారి యింటిలో జన్మించింది లక్ష్మీకాంతమ్మ. తల్లిదండ్రుల లక్షణాలను పుణికిపుచ్చుకుంది ఆమె. వారిపెంపకంలో పెరిగి పెద్దదయింది. జాతీయభావాలు కలిగిన ఊటుకూరి వారి కుటుంబంలో కోడలుగా వచ్చింది. న్యాయవాది ఊటుకూరి హయగ్రీవగుప్తాగారి ప్రోత్సాహం ఆమె ఎదుగుదలకు తోడ్పడింది. ఉద్యమాల ఊపిరి బాపట్లనివాసం ఆమె జీవితంలో ఎన్నో మలుపులకు కేంద్రమయింది.

కృష్ణారావు లక్ష్మీకాంతమ్మను స్వేచ్ఛగా పెరగడానికి, చదువుకోవడానికి చక్కగా తోడ్పాటునందించారు. ఆయింటి సాహితీవాతావరణం ఆమెకు బాగా ఉపకరించింది. దూరపుబంధువు బత్తులకామాక్షమ్మగారితోడ్పాటు ఆమెను తీర్చిదిద్దింది. రాజమండ్రిలో వెల్లివిరిసిన స్వాతంత్ర్యోద్యమం ఆమెకు ధైర్యాన్నిచ్చింది. తల్లితోపాటు విదేశీవస్త్రదహన కార్యక్రమంలో పాల్గొంది. స్వయంగా తనచేతి బంగారుగాజును స్వాతంత్ర్యోద్యమనిధికి విరాళంగా గాంధీగారికి యిచ్చింది. తండ్రి కృష్ణారావు ప్రోత్సాహంతో ఉభయభాషాప్రవీణ పరీక్షలో విశ్వవిద్యాలయస్థాయిలో ప్రథమురాలుగా నెగ్గింది. అంతటి నాళంవారి కుటుంబవారసత్వాన్ని మూటకట్టుకొని లక్ష్మీకాంతమ్మ మెట్టినిల్లైన ఊటుకూరి కుటుంబంలో చేరింది.

చక్కగా పరిశోధించి, రచించిన ఆంధ్రకవయిత్రులు గ్రంథానికి గృహలక్ష్మిపత్రికవారి స్వర్ణకంకణాన్ని అందుకుంది. అఖిలభారతకవయిత్రులు గ్రంథం వ్రాసి గొప్పపేరు సంపాదించింది. బాపట్లలో స్త్రీహితైషిణి సంస్థప్రారంభించి యువతుల్లో సంస్కారభావాలను పెంపొందింపజేసింది. మహిళోద్యమాల్లో పాల్గొని మహిళల్ని చైతన్యవంతులనుగావించింది. సాహిత్యఅకాడమీలో సభ్యత్వం పొందింది. రచయిత్రుల సభలు నిర్వహించింది. రాష్ట్రంలోను దేశంలోను కవులు, పండితులతో కలసి, సాహిత్య, చారిత్రక, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేసింది. పెద్దల ఆశీస్సులు పొందింది.

లక్ష్మీకాన్తమ్మగారిని ఆంధ్రవిశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ" అవార్డుతో గౌరవించింది. అప్పికట్లవాసులు కాకపర్తి వేంకటేశ్వర్లు నేతృత్వంలో తెనుగులెంక తుమ్మలసీతారామమూర్తిగారి సమక్షంలో ఆమెకు గజాధిరోహణ మహోత్సవం నిర్వహించారు. అనంతపురం నివాసులు, లలితకళాపరిషత్తువారు సంయుక్తంగా కాసారాధాకృష్ణయ్య నాయకత్వంలో ఆచార్య తూమాటి దొణప్ప పర్యవేక్షణలో ఆమెకు కనకాభిషేకం చేశారు. దేవులపల్లి రామానుజరావు విజయవాడలో ఆమెకు "సాహితీరుద్రమ" బిరుదునిచ్చి ఘనంగా సత్కరించారు.

లక్ష్మీకాంతమ్మగారి సాహితీవైదుష్యాన్ని గుర్తించిన కేంద్రప్రభుత్వం స్వాతంత్ర్యరజతోత్సవాల సందర్భంగా సాంస్కృతిక రాయబారిగా ఆమెను విదేశీపర్యటనకు పంపించింది.

తాను రచించిన జీవితచరిత్రకు తనబిరుదు "సాహితీరుద్రమ" పేరుపెట్టి, జీవితచరిత్ర రచించిన మహిళా కవయిత్రిగా వాసికెక్కారు లక్ష్మీకాంతమ్మగారు.

కవయిత్రిగా, పరిశోధకురాలుగా, అనువాదకురాలుగా, ఉపన్యాసకురాలుగా గొప్పపేరు సంపాదించి, సాహితీలోకంలో తండ్రినాళం కృష్ణారావు వారసత్వాన్ని నిలబెట్టిన విదుషీమణి- ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు.

# విద్వత్కవయిత్రి- ఊటుకూరి

- డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు
ప్రధాన కార్యదర్శి, తెలుగు భాషోద్యమ సమాఖ్య

లోకంలో ఎందరో పుడుతున్నారు, గిడుతున్నారు. కాని కొందరే జీవితాన్ని సార్థకం చేసుకుంటున్నారు. వాళ్ళనే లోకం గుర్తుంచుకొంటుంది. అలా గుర్తుంచుకోవడానికి వాళ్ళజీవితాల్లోని సంఘటనలు, సన్నివేశాలు దోహదపడతాయి. అలాంటివారిలో "కళాప్రపూర్ణ" ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారొకరు.

లక్ష్మీకాంతమ్మ పుట్టింది సాంస్కృతికకేంద్రంగా, అభ్యుదయ భావాల నిలయంగా భాసిల్లుతున్న రాజమహేంద్రవరంలో, సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లను పాటించే వైశ్యకుటుంబంలో, అందునా విద్వత్కుటుంబం నాళం వారి యింటిలో.

తండ్రి నాళం కృష్ణారావుగారి ప్రభావం, ప్రోత్సాహం ఆమె అభివృద్ధికి బాగా ఉపకరించాయి. ఆయింటి సంగీతసాహిత్య వాతావరణం ఆమె జీవితంలో ముందంజవేయడానికి సహకరించింది. చదువుల సరస్వతిగా రూపొందడానికి తోడ్పడింది. మెట్టినింటిలో న్యాయవాదియైన భర్త హయగ్రీవగుప్తాగారి అండదండలు ఆమె సాహితీరంగంలో నిలదొక్కుకునేలా చేశాయి. ఉద్యమాల ఊపిరి బాపటల్ల ఆమె జీవితంలో ఎన్నోమలుపులకు కేంద్రమయింది.

ఆమె రచించిన ఆంధ్రకవయిత్రులు, అఖిల భారత కవయిత్రులు గొప్ప పరిశోధనాత్మక గ్రంథాలు, కీర్తికారకాలు. ఆమెలోని నిర్భీతి గొప్పఉపన్యాసకురాలుగా తీర్చిదిద్దింది. ఆమెలోని సాహసికదృక్పథం సాహితీరుద్రమగా నిలబెట్టింది. ఆమె వ్యవహారశైలి ఎందరో పెద్దల మిన్ననలందుకొంది, ఆశీర్వాదాలు పొందింది.

కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, సాహితీసంస్థలు, మహిళాసమాజాలు ఆమెను ఆహ్వానించి, వారి అభ్యుదయకరమైన ఆలోచనాపరంపరను అవగాహన చేసుకున్నాయి. ఆమెలోని విద్వత్తుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ" అవార్డుతో గౌరవించింది. పలు సంస్థలు బిరుదులిచ్చి, సత్కరించాయి.

అప్పికట్ల గ్రామస్థులు ఆమెకు గజానిరోహణమహోత్సవం నిర్వహించారు. అనంతపురం వాసులు కనకాభిషేక మహోత్సవం జరిపి, ఆమెకీర్తికాంతుల్ని నలుదెసల వ్యాపింపజేశారు.

దాదాపు 1000కిపైగా సాహిత్య, ఆధ్యాత్మిక, చారిత్రక, ధార్మిక ఉపన్యాసాలు చేసి, ఉపన్యాసకేసరిగా భాసిల్లింది. సమకాలీనుల మన్ననలందుకొంది. పండితుల, కవుల ఆశీస్సులందుకుంది.

"మామిడి గున్నెమీద మునిమాపుల గోయిల క్రోల్చులీల, నీ
లేమ సభావితర్ది నవలేపవిదూర మృదూక్తులాడుచో
జాములు జాములేగు నిముషమ్ములు పోలె సదస్యకోటికే
బాములు సైచి సల్పిన తపంబిటు పండెనొ యూటుకూరికిన్"-

అని తెనుగులెంక తుమ్మలసీతారామమూర్తిగారు ఆమె ప్రసంగ ప్రాభవాన్ని ప్రశంసించిన తీరు ఘనముగా ఉన్నది.

# మధురకవి : మధుర కవయిత్రి

– డా॥ దాశరథి

నా చిన్నతనంలో మధురకవి నాళం కృష్ణారావు గారి "మీగడ తరగలు", "వెన్నముద్దలు" మొదలైన కావ్యాలు చదివి, వారి సరళ సరస శైలికి ముగ్ధుడనై పోతుండేవాడిని. నాళం కృష్ణారావుగారు, బహుముఖ ప్రజ్ఞాశాలిని, విదుషీమని అయిన సోదరి, ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి పితృపాదులు. తమ తండ్రిగారి తేటగీతిని గురించి లక్ష్మీ కాన్తమ్మగారు ఎంతో మనోహరంగా చెప్పారు :

"భరతజాతి భవ్యరీతి జేయ మధుర గీతలాడి
మెలగ, వసుద మిన్నయైన పసివారల భవితవ్యము
తీరులన్ని, తేనె చినుకు భద్రపరచె మధురకవి
లద్ది యద్ది గోరుముద్ద కృష్ణరాయ తేటగీతి"
లమృతమట్టు లాహరింప

మధురకవి నాళం కృష్ణారావుగారి తేటగీతులు పసిపాపల భవితవ్యమును భద్రపరచడానికే ఉద్దేశించినవైనా, పెద్దలను సైతం, అలరించినవి. అట్లే సోదరి లక్ష్మీకాన్తమ్మగారు ఎంత గొప్ప విదుషీమణి అయినా ఉభయ భాషాజలంధులను ఆపోశనం పట్టినా, ప్రజలకు సన్నిహితంగా ఉండే సులభశైలిలో మాత్రాచ్ఛందస్సులో, అభ్యుదయ భావాలతో "మనసాహితి–మధుభారతి" రచించారు. తండ్రిగారి ప్రభావం తమపై ఉన్నదని నిరూపించారు. మన తెలుగు బాష బహుముఖమైన సౌందర్యాన్ని ఆవిష్కరించారు కవయిత్రి కవితలో వెయ్యేండ్ల ఆంధ్ర కవితా సరస్వతి ఉన్నది.

మనసాహితి మధు భారతి
శివరంజని, జానాంజని

"స్వస్థాన వేషభాషల
ప్రస్తవమును సేసి, తెలుగు
ప్రజకు, తెలుగుపైన మోజు
కల్గించిన ఘన యశుండు॥ – నన్నయ్యనూ,
"దేశమన్న మట్టికాదు
దేశమన్న మనుషు" లనెడు
నగ్నసత్య మెఱింగించిన – గురజాడ వారినీ
ఆ తరువాత ఇంకా ఆధునికులనూ
సంస్మరించారు కవయిత్రి.

– సంస్కృతి నుండి

# మహిమాన్విత మహిళామణి శ్రీమతి డా. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

- డా. గుండ్లపల్లి రెజీనా

నిత్యచైతన్య స్రవంతీ, వాఙ్మయ భారతీ,
సాహిత్య రుద్రమ, మహిళా
ప్రగతిశీల విద్వన్మణీ
స్త్రీల అభ్యున్నతికై అహరహం
శ్రమించే ఉద్యమకారిణీ
జయము జయము నీకిదే మా వందనం
మహిళా జగత్తుకే మకుటాయమానమైన అఖిల భారత కవయిత్రుల రచనచేసి శాశ్వత యశశ్శునుగొన్నావు.
'మగువ మాంచాల' "ఆంధ్రకవయిత్రు"ల
కవనముల్లేఖించి విశ్వవిఖ్యాతినందినావు
బహుకావ్య పఠన పాటవములతో
సువిమర్శలు చేయు నేర్పరి.
మానవతావాదం, సంఘసంస్కరణ
జమిలి నేతల్లా అల్లుకున్న గుణగరిష్ఠ
సంగీత సాహిత్య రసధునీ
సభా రంజకంగా పలుకాడే వాక్ఝురి
సంకల్పించిన కార్యాన్ని నిర్విఘ్నంగా వైభవోపేతంగా నడిపించగల నాయికా
ఆధ్యాత్మిక రసధుని, అవిరళ
యశో విరాజిత అపర సరాస్వతి
తల్లీ నీ యశోమూర్తిమత్వానికి
గీటురాయి కానిదేదీ లేదు
గజారోహణం, కనకాభిషేక సన్మానాలు
కళాప్రపూర్ణ గౌరవాదులు,
అపరవాగ్దేవి, ఆంధ్రుల అభిమాన కవయిత్రివి
జీవిత కాలమంతా సాహితీ కేదారాలలో
విస్తృత పంటలను పండించి చరిత్రలో
నిలిచిపోయిన ధీర, వీరనారివి
నీకు ఒసగిన బిరుదు
"సాహితీరుద్రమగా" ఆచంద్రతారార్కమై వెలుగొందుదువు గాక!

# సంగీత విద్రుమ - సాహితీ రుద్రమ

- డాక్టర్ ఆరుద్ర

వైదుష్యంలోనూ, వ్యక్తిత్వంలోను –వైశిష్ట్యం విలక్షణత్వంకల సోదరి లక్ష్మీకాన్తమ్మగారు తొమ్మిది మండువా లోగిలిగల నాళంవారి ఆడబడుచు. ఏలూరులోని జమీందార్లు మోతేవారి దౌహిత్రి, చీరాలలో పేరు ప్రతిష్ఠలున్న ఊటుకూరి వారి కోడలు. ఒకతరం ఆంధ్ర రచయిత్రులందరికీ ఇష్టమైన 'అత్తగారు'. సంస్కృతాంధ్ర భాషలలోనేకాని, సంగీత సాహిత్యాలలో ప్రవీణురాలు ఈమెకు తెలియని, ఈమెను తెలియని ఆంధ్ర రచయిత్రి ఎవరైనా ఉంటే – ఆమె దేశానికి తెలియని రచయిత్రి అని చెప్తే తప్పులేదు. ఇటువంటి విదుషీమణి తన స్వీయ చరిత్రను రచించడం సంతోషించతగ్గ విషయం.

ఏడేళ్ళ వయస్సులో ఎవరూ నేర్పకుండానే ఏడు రోజుల వినికిడివల్ల పచ్చిమిరియం ఆది అప్పయ్యగారి సుప్రసిద్ధమేకాక కష్టతరమైన భైరవి. ఆట తాళవర్ణం, విరిబోణి, సుస్వరంగా కాలపై కాలాలలో సునాయాసంగా గానం చేయకల్గిన ఈ సంగీత విద్రుమ, ఉత్తరోత్తంగా సాహితీ రుద్రమగా బిరుదు పొందడంలో ఆశ్చర్యంలేదు. ఈమె మధురకవి నాళం కృష్ణారావుగారి కుమార్తె. పెరిగినది సాహిత్య వాతావరణంలో, చదివింది ఉభయ భాషా ప్రవీణ విద్య– అందులో సర్వప్రథమురాలిగా నెగ్గడం, దేశ సేవ సంఘసేవలతో పాటు కర్రసాము, కత్తిసాము ఎంబ్రయిడరీ కుట్టుపని, గోదావరిలో ఈత, ఆడపిల్లల జడ పట్టుకులాగే కుర్రవాళ్ళను చెప్పుతీసి తన్నబోవడం ఏలూరులో గుర్రపు స్వారి, మగపిల్లలతో సమంగా కోతి కొమ్మచ్చులాడడం. చలికాలంలో సహితం తెల్లవారుజామున వీణపై గంటసేపు పై స్థాయిలో సాదన, సత్యాగ్రహోద్యమంలో పోలీసులను పాటలతో ఏడిపించడం. గాంధీజీ సమక్షంలో ఆయన హరిజన నిధికి బంగారు నగలు కుప్పలు పోగుచేయడం అందుకు బాపూజీ భుజం తట్టగాఆయన చేతివ్రేళ్ళ స్పర్శను యిప్పటికీ మరువలేకపోవడం.... ఒకటేమిటి! ఎన్నెన్నో విషయాలు ఈ స్వీయ చరిత్రలో వున్నాయి.

పెళ్ళికాగానే చదువుమానిపించమని తోడపుట్టిన పడుచులు ఎంత పోరినా భార్య విద్యకు అంతరాయం కల్గించక, పరీక్షల సమయానికి ఆమె మూడు నెలల గర్భవతిగా వున్నా, ధైర్యంగా రాయమని ప్రోత్సహించి పంపిన హయగ్రీవ గుప్తగారు భర్తగా లభించడం లక్ష్మీకాన్తమ్మగారి అదృష్టం. బాపట్లలో భార్యా భర్తలిద్దరూ పాపతో కాపురం పెట్టినప్పుడు, చిన్నతనంలో ఎన్నో నేర్చుకున్నా వంటనేర్చుకోని లక్ష్మీకాన్తమ్మగారు మొదట చెరగడం, విసరడం, దంచడం అనే పనులు చేయవలసి వచ్చినప్పుడు ఎంతో అవస్థపడ్డా అవిగృహకృత్యాలుగానే కాక సాహితీ శిల్పాలుగాకూడా నేర్చుకొన్నారు. అన్య సిద్ధాంతాలను చెరగడం, ఛలోక్తులు విసరడం ప్రతిపక్షాల పిడివాదాన్ని దంచడం ఆమెకు కొట్టిన పిండి.

'నా జీవితమే ఒక తెరచిన పుస్తకం. ఈ తెరచిన పుస్తకంలో ఏ పుట తెరచి అవలోకనం చేసినా ఏదో ఒక అంశం ప్రత్యక్షం అవుతూనే వుంటుంది' అని ఒక పుటలో రాస్తూ ఇందులో అతిశయోక్తి కాలేదన్నారు. అవును, ఇది స్వభావోక్తి. ఈమెవల్ల బొడ్డుపల్లి పురుషోత్తం, భద్రిరాజు కృష్ణమూర్తిగారు ప్రభావితులయ్యారట ఈమె వీణ వాయిస్తూ పాడితే పిలకా గణపతి శాస్త్రిగారు పరవశులై వీధిలో నిలబడి పోయారట. ఈమెకు 'సాహితీ రుద్రమ' బిరుదు దేవులపల్లి రామానుజరావుగారు ఇచ్చారుట ఎన్నెన్ని కొత్త సంగతులు - ఎన్నెన్ని విశేషాలు ఇప్పటివారికి యిందులో కొన్ని కొన్ని తెలిసినవే. రేపటివారికి అన్నీ తెలియాలనే ఈ స్వీయచరిత్ర రచన చేయడం జరిగింది.

చిన్నప్పుడే జాతీయోద్యమంలో పనిచేసిన ఈమె పంచములకు దేవాలయ ప్రవేశంకలగక పూర్వమే తన నామధేయంలో వర్గ పంచమ ప్రవేశాన్ని కలిగించారు. అందుకే మనమంతా "లక్ష్మీకాంతమ్మ" అని రాస్తే తను మాత్రం "లక్ష్మీ కాన్తమ్మ" అని రాసుకుంటారు. ఇది గమనించదగ్గ విషయం.

మరొక సంగతికూడా చెప్పాలి. నేను రాసిన కూనలమ్మ పదాలు దేశంలో ప్రచారం పొందాయి. అనుకరించారు. లక్ష్మీకాన్తమ్మగారు కూడా "ఓ కన్యకమ్మ" అనే మకుటంతో వ్యంగ్య పదాలు రచించారు. ఆకూనలమ్మ పదాల ప్రభావం ఈ పలుకులమ్మమీద పడిందంటే సమకాలీన సాహిత్య ప్రక్రియల కీమె ఎలా స్పందిస్తారో విశదం అవుతుంది. ఎన్నో సత్కారాలను పొంది, యింకా పొందుతున్న లక్ష్మీకాన్తమ్మగారు చిరస్మరణీయురాలు.

ఈమె అమ్మమ్మగారు రోజూ వేడి అన్నంపై బంగారు రేకులు వేసి కమ్మని నెయ్యి వేసి దగ్గరుండి తమచేతితో ఈమెకు తినిపించేవారట. రాత్రి కుంకుమపువ్వు పచ్చకర్పూరం జీడిపలుకులతో వేడిపాలు స్వయంగా తాగించేవారట. ఆ రోజు తన స్వీయ చరిత్రలో లక్ష్మీకాన్తమ్మగారు పాఠకులకు రుచి చూపిస్తూ ఈ శతాబ్దపు తొలి దశకాలలో సంగీత సాహిత్యాభిరుచులతో జాతీయోద్యమపు చైతన్యంగల ఉన్నతవర్గాల లోగిళ్ళలో ఆడపిల్లలు ఎలా పెరిగి పెద్దవారై దేశ సేవకు, సంఘసేవకు సాహితీ సేవకు అంకితమయ్యారో విశదంచేస్తున్నాయి.

ఈ సంగీత విద్రుమకు- సాహితీ రుద్రమకు నా అభినందనలు.

- సంస్కృతి నుండి

# ఒక సంభాషణ

- డాక్టర్ సంజీవదేవ్

చాలాకాలం నాటి సంగతి, బాపట్లలో ఒక సాహితీసభ, సభ ప్రారంభం కావటానికి ఇంకా కొంత ఆలస్యం అవుతుంది.

వేదిక క్రింది కుర్చీ, లపై వున్నవారిలో వున్నాము ఉజ్జలవిదుషి లక్ష్మీకాన్తమ్మ గారూ నేను కూడా.

ఆ సభకు ఆమెగారు అధ్యక్షత వహిస్తారు. నాది ప్రధాన ప్రసంగం.

మౌనాన్ని భగ్నపరుస్తూ నేను లక్ష్మీ కాన్తమ్మగారితో ఏవో కొన్ని ముఖ్యమైన మాటలు మాట్లాడుతున్నాను.

నేను మాట్లాడటం, ఆమెగారు వినటం జరుగుతూంది. ఆ వినటం చెవులతోనే కాని మనసుతో కాదని నాకొక అనుమానం ఏర్పడింది.

నా అనుమానాన్ని బహిరంగ పరచాను. ఆమెగారు చిరునవ్వుతో నా అనుమానాన్ని బలపరచారు.

నా మాటలను వింటూనే నామాటలకు సంబంధించి వేరే ఆలోచన చేస్తున్నట్లు ఆమెగారు అంగీకరించారు.

తమ ఆలోచనను నాకు తెలిపేరు. తమ అధ్యక్షోపన్యాసాన్ని ఏమాటలతో ప్రారంభించి ఏమాటలతో ముగించాలా అని అట తమ ఆలోచన.

నేనన్నాను, అధ్యక్షత వహించేవారి పని అంతకఠినంగా వుండదు, కొంత సులభంగానే వుంటుంది అని.

అయితే, అసమర్థులు మాత్రమే, అధ్యక్షతకు అర్హులన్నమాట అని నవ్వసాగారు ఆమె. నేను అన్నాను. మిమ్ము నేను ఎంతో కాలంనుంచి ఎరుగుదును, నన్ను మీరు ఇటీవలనుంచి మాత్రమే ఎరుగుదురు.

అవును, నన్ను మీరు చాలాకాలం నుంచి ఎరిగి వుండవచ్చు. నేను మిమ్ము ఇటీవలనుంచే ఎరిగి వుండవచ్చు. ఎరిగి వుండవచ్చు. ఎరిగి వుండటం అనేది గొప్ప విషయమే ఎప్పటి నుంచి ఎరిగివున్నా, పరిచయాన్ని కాలంతో కొలవటం వల్ల దాని గొప్పతనం కాని కొద్దితనం కాని నిర్ణయించబడదు, అన్నారు ఆమె.

మనం వేదిక ఎక్కబోతున్నాం ఇప్పుడు. వేదికమీదినుంచి ప్రసంగించే బదులు వేదిక క్రిందకూర్చొని ప్రసంగాన్ని వినటం నాకెక్కువ సంతోషం. అందులోను మీవంటి ప్రజ్ఞావంతుల ప్రసంగాన్ని వినటం మరీ ఎక్కువ సంతోషం అన్నాను.

మీరు చెప్పేదంతా నిజమని నేను నమ్మను. మీ ప్రసంగాలు నేను కొన్ని వినివున్నాను. దాన్ని బట్టి తెలుసుకొన్నాను మీ ప్రసంగాలు తక్కువ ప్రభావవంతాలు కావని. సరే, మనపరస్పర ప్రశంసలను ఇంతటితో ఆపుదాం. ప్రశంసలు పనికిరావు అని నేను అననుకాని అవికూడా అన్నిటివలె పరిమితంగా వుండాలని అంటాను.

ఆమె అన్నారు, మీ దృక్పథాన్ని నేను సమర్థిస్తాను. ఈ దృక్పథాన్ని మాత్రమే సమర్థిస్తాను అంటే మీ దృక్పథాలన్నిటినీ సమర్థిస్తాననికాదు.

నేను అడిగేను, నాదృక్పథాల్లో మీరు సమర్థించని వేవో ఒకటి రెండు తెలుపమని, నా జీవన విధానాన్ని గురించా, లేక నా రచనావిధానాన్ని గురించా, లేక నా రచనావిధానాన్ని గురించా, లేక రెంటినీ గురించా? అందుకు లక్ష్మీకాన్తమ్మగారు కొంత గంభీరంగా మారి అన్నారు, నా మీద చాలా బరువును వేశారు. అందకు నిర్ధారిత సమాధానాన్నివ్వటం పూర్తిగా కష్టం కాకపోయినా పాక్షికంగా కష్టం కాకుండా వుండదు.

మీరు కష్టమైన పనులను తేలికగా నెరవేర్చగలరు. జటిల ప్రశ్నలకు సరళ సమాధానాలు ఇవ్వగలరు. కనుక నా ప్రశ్నలు మిమ్ము అంతగా ఇబ్బంది పెట్టవు. త్వరగా జవాబులు చెప్పండి. త్వరగా చెప్పే జవాబుల్లో కొంచెం అస్పష్టత దర్శనమిచ్చే ప్రమాదం వుంటుంది. మీ జవాబులుత్వరలోను చెప్పబడాలి, స్పష్టంగాను చెప్పబడాలి. లక్ష్మీకాన్తమ్మగారికి నవ్వు ఆగలేదు. అయితే ఆనవ్వు తేలికతో కూడుకున్న నవ్వుకాదు. గంభీరతతో కూడుకున్న నవ్వు. ఆమెనవ్వును చూచి నాకూ నవ్వు ఆగలేదు. మా ఉభయుల నవ్వును చూచి మా ప్రక్క వారు కూడా నవ్వసాగారు.

ఆ నవ్వుల నుంచి లక్ష్మీకాన్తమ్మగారు తేరుకొని నా దృక్పథాలను గురించి తమ దృక్పథాన్ని వెల్లడించ ప్రారంభించారు. నా రచనల్లో కాని ప్రసంగాల్లో కాని నా స్వీయ రూపం ఎక్కడా ఆమెకు సుస్పష్టంకాలేదట. నేను భౌతికవాదినా, ఆధ్యాత్మికవాదినా అని తెలుసుకొనే అవకాశం ఆమెకు లభ్యంకాలేదట. అదేమిటో వివరించమన్నారు ఆమె.

నేను బాహ్యద్రష్టనా అంతర్‌ద్రష్టనా అని తెలుసుకోవాలని ఆమె కౌతుకత. అందుకు నేను అన్నాను, మనిషి బాహ్యజగత్తులో నివసిస్తాడు కనుక బాహ్యద్రష్ట (Extrovert) మనిషిలో అంతర్ జగత్తు నివసిస్తుంది కనుక మనిషి అంతర్ ద్రష్ట (Introvert) ఈ రెండూ వున్నందున మనిషి ఉభయద్రష్ట.

సంతోషం, నాకిపుడు బోధపడింది మీ అసలు స్వరూపం. మీరు కేవలం భౌతికవాదులు కారు. కేవలం ఆధ్యాత్మికవాదులు కారు, ఉభయవాదులని, ఈ సత్యాన్ని తెలుసుకున్న తరువాత మీ రచనల్లో కనిపించే అస్పష్టత ద్వారా సుస్పష్టత వెల్లడయింది.

మీరు నన్ను సమగ్రంగా కాకపోయినా అసమగ్రంగా అయినా స్పష్టంగా తెలుసుకున్నందుకు సంతోషం. నేను జడవాదిని చైతన్యవాదిని కూడా. మీలో జడవాదం ఎంతవరకు అస్తిత్వాన్ని కలిగి వున్నదో తెలియదుకాని మీరు పూర్ణ చైతన్యవాదులని నాకు తెలుసు.

ఆమెగారు తిరిగి అన్నారు, ఏది ఏమైనా పరవాలేదు కాని వాటి ప్రభావాలు తమ రచల మీద ఎంతవరకు పడతాయా అనేది ముఖ్యం. రచన రచయిత జీవితం యొక్క ప్రతిబింబం అనేది ఎంతవరకు సత్యమా అని.

ఈ విషయం మీద నాకు కొన్ని స్వీయాభిప్రాయాలున్నాయి. వాటినే ఆమెగారికి ఎరుకపరచాను. రచన కేవలం రచయిత జీవన ప్రతిబింబం కాదు. అందుకని రచయిత రచించిన రచన, రచయిత జీవితపు ప్రభావాలనుంచి పూర్తిగా దూరమై వుండదు, మధ్యేమార్గంలో వుంటుంది. ఇంకా అన్నాదు రచనలో వాస్తవవాదం మాత్రమే సర్వస్వం కాదు, ఆదర్శవాదం కూడా అవసరం. తమ రచనల్లో సమాజంలోని చీకటిని మాత్రమే అభివ్యక్తిత్వాన్ని మాత్రమే కాక సన్మార్గుల దుష్టత్వాన్ని మాత్రమే కాక సన్మార్గుల సచ్చరిత్రను కూడ చూపాలి. జరుగుతున్నఘటనవాస్తవ వాదానికి చెందితే ఎట్లా జరిగితే బాగుంటుందో అనేది ఆదర్శవాదానికి (idealism) చెందుతుంది. ఈ జీవనమర్మాలూ కళామర్మాలూ ఆమెకు తెలియనివికావు. అయినా నన్ను సంతోష పెట్టటానికని తనకు తెలియనట్లు నటించారు ఆమె.

అంతటితో ఈ చర్చలను ఆపి ఆమెజీవితంలోని విలువైన వివరాలను, ఆమెవైదుష్యంలోని వైవిధ్యాలను, వైరుధ్యాలను గురించీ అడిగి తెలుసుకొని ఆనందించాను.

తాను ప్రధానంగా పద్యరచయిత్రి అయినప్పటికీ తనకు గద్యరచనలను చదవటంలోను రచించటంలోను అధికానందం జనిస్తుందని తెలిపేరు ఆమె. తన సాహితీ ప్రతీతి ఇటు అధునాతన రచనల మీద వున్నట్లుగానే అటు సనాతన రచనల మీదకూడ వుంటుందన్నారు.

నేను అడిగాను, మీ భూతకాలపు సాహితీ జీవితం, వర్తమానపుదీ ఉజ్వల మైనట్టివి. మీ భవిష్యత్ కూడా అదేవిధంగా కాక ఇంకా గొప్పగా వుంటుందని మీకు నమ్మకం వున్నదా?

నమ్మకం లేకేమీ, నమ్మకం వున్నది. కాని నమ్మకాలన్నీ సఫల రూపాంతాలిస్తాయి అనే నమ్మకం మాత్రం తగినంతగా లేదు!

- సంస్కృతి నుండి

# ఊటుకూరి కిరణాలు

- రావి రంగారావు
*అమరావతి సాహితీమిత్రులు, గుంటూరు*

సాహిత్యం
పాండిత్యం
సంఘ సంస్కరణ...
ఆమె నెత్తురు "త్రివేణి"......
పద్య పఠనం
సాహస వ్యాయామం
ఆమె గొంతు
ఒక పరుగులు తీసే నది....

తండ్రి లక్ష్యం
బాల వికాసం,
తనయ హృదయం
తరుణీ వైభవం....

కనకాభిషేకం
గజారోహణం,
సాహితీరుద్రమ
"మహిళా"శిరోమణి.....

మహా శ్రమకు ప్రతిరూపం
"ఆంధ్ర కవయిత్రులు",
అనంత కృషకి సంకేతం
అనేక సాహిత్య గ్రంథావళి.

# ఆంధ్ర సరస్వతి

- చిట్టిప్రోలు కృష్ణమూర్తి
గామాలపాడు

కరమున నుండిన వేణువు పొరపాటునైన జాతి
పోవునొయని హృదయమునే మురళీనాళముగ మలచి
గీతామృత మొలికించిన కృష్ణయ్యకు ఆత్మజవగు
నీలో పొలుపులు మెలుపులు నివ్వటిల్లు టబ్బురమా?

నిర్మలనిశ్చల జలమున నిండియుండు కొలనువోని
రసమయ రుచిరాంతరంగ మెసలారెడి సుశీలమ్మ
ఉగ్గుబాలతో నిత్యము నిగ్గులు జగ్గులు నోయగ
కాంతమవు కళాలక్ష్మీ కాన్పవై రహించితివి

నన్నయ్య గంటమ్ము తపమొనర్చిన నెలవున జనించి
తిక్కన కంఠమ్ము తీపికెక్కిన సీమను వరించి
తెలుగు వెలది వెలుగులకై నిలువెల్లను ధారవోసి
ఆంధ్ర సరస్వతివై పేరంది ధన్యతను గంటివి.

కమ్మని పాకమున నేమి కవితా పాకమున గూడ
పొలతుల కడువలతులనుచు తెలియజెప్పితిని జగతికి
లాలిత్యమునకు గాంభీర్యమునకు కాంతగళమ్మే
స్నేహస్థలమని చెప్పక చెప్పితివో కాంతమ్మా!
స్వరములలో స్వరూపములు స్వరూపములలో స్వరములు
రాగమ్ములలో రంగులు రంగులలో రాగమ్ములు

దర్శింపగ నేర్చి పరామర్శించిన బాల నీవు
కళాదేవతానేత్రోద్గతమయూఖమాల నీవు
పలుసీమల కవయిత్రీ కల కంఠుల రసగీతులు
ముమ్మరింప వనరమయై పులకించెను భాగ్యనగరి
ఆ మహస్సునకు కారణమైన వసంత శ్రీవని
నును గుండెల కెత్తుకొనెను నిను గాదిలి తెలుగుతల్లి
భువనాభ్యుదయైకకాంక్షి రవణించెడి రవళించెడి
నీ కమ్మని మేల్కొల్పున నిత్యమ్మును మేలుకాంచు
పరమేశ్వరి కరుణా నిర్భర నేత్ర జ్యోతులొలసి
ప్రతిప్రభాతమ్ము సుప్రభాతమ్మై వెలయుగాక !

– సంస్కృతి నుండి

# మహిళా మార్గదర్శి

## కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

**– డా॥ ముక్తేవి భారతి**

లక్ష్మీకాంతమ్మగారి బహుముఖీనమైన వ్యక్తిత్వం మహిళాలోకానికి ఎప్పటికీ మార్గదర్శకం, ఆదర్శప్రాయం.

లక్ష్మీకాంతమ్మగారు సంఘసేవాతత్పకురాలిగా, విదుషీమణిగా తెలుగువారందరి మనసుల్లో ఒక విశిష్టమైన స్థానాన్ని అలంకరించారు. ఆమె, పుట్టిన నాళం వారి వంశానికి, మెట్టిన ఊటుకూరివారి వంశానికి గౌరవప్రతిష్టలు ఇనుమడింపజేసిన మహామనిషి. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ తెలుగింటి ఆడపడుచై, విద్వత్కవయిత్రి, తెలుగుమొలక ఆంధ్రసరస్వతీ సాహితీరుద్రమ బిరుదాంకితయై, 'కళాప్రపూర్ణ' కావడం తెలుగువారందరికీ గర్వకారణం.

గాంధీగారి స్వాతంత్ర్యోద్యమ శంఖారావం నలుదిక్కులకు మారుమ్రోగుతున్న కాలంలో సాంఘికసంస్కరణలలో ముఖ్యాంశం స్త్రీవిద్య. బత్తులకామాక్షమ్మగారు ప్రారంభించిన వైశ్యసేవాసదనము తరవాత జాతీయబాలికా పాఠశాలగా రూపుదిద్దుకుంది. విద్యాభ్యాసం చేసిన లక్ష్మీకాంతమ్మగారు వ్యాసరచన, వక్తృత్వపోటీలలో ఎప్పుడూ ప్రథమస్థానంలోనే నిలిచింది. ప్రాచ్యపట్టపరీక్షలో ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రథమురాలిగా విజయం పొందటంతో "విజయస్ఫూర్తితో వినువీధిలో విజయకేతనం ఎగురవేసారు. విశ్వనగరంలో విఖ్యాతప్రౌఢిమతో బిరుదపత్రము స్వీకరించాను" అని ఆనందోత్సాహాలతో పల్కిన లక్ష్మీకాంతమ్మగారి విజయం, మహిళా లోకినికే విజయం.

హయగ్రీవగుప్తాగారితో వివాహమయ్యాక, బాపట్ల నివాసం ఏర్పడ్డాక, లక్ష్మీకాంతమ్మగారి స్ఫూర్తిప్రదాత కనుపర్తి వరలక్ష్మమ్మగారు. హితైషిణి మండలిస్థాపకురాలైన వరలక్ష్మమ్మగారితో కలసి సాంఘిక సేవాకార్యక్రమాలు ఎన్నో చేపట్టారు లక్ష్మీకాంతమ్మగారు.

లక్ష్మీకాంతమ్మగారి చైతన్యశీలత్వమే ఆమెచేత ఎన్నో నిర్మాణాత్మకమైన పనులు చేయిచింది. సహకారసంఘ సభ్యురాలుగా వుండి, స్త్రీలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఆశయంతో పనిచేసారు. విశ్వహిందూ పరిషత్తులో సభ్యత్వం పొందటంతో, పరిషత్తులో స్త్రీలకు ఎక్కువస్థానం లభిస్తే, హిందూధర్మం రక్షింపబడుతుందని చెప్పారు. వేదికలలో ఆమె ఉపన్యసిస్తుంటే వాగ్దేవి సాక్షాత్కరించిన భావంతో ప్రేక్షకులు పరవశించేవారు. 'ఆదర్శవివాహము' అనే అంశంపై ఉపన్యాసం ప్రారంభించి భారతీయవివాహవ్యవస్థ, గృహస్థాశ్రమ ప్రాముఖ్యం మొదలైన అంశాలు శ్లోకాలను ఉటంకిస్తూ, రెండు గంటలపాటు అనర్గళంగా ఉపన్యసించటం ఆమెకే సాధ్యం.

1972లో భారతదేశ స్వాతంత్ర్యరజతోత్సవాల సందర్భంగా విదేశీపర్యటనకు లక్ష్మీకాంతమ్మగారు ఎన్నికకావటం తెలుగు మహిళ కీర్తిపతాకం ఎగురవేసినట్టే కదా!

"ఏదేశమేగినా ఎందుకాలిడినా నిలుపరా నీజాతి నిండుగౌరవము" అన్నట్టు, ఎన్ని విద్యాసంస్థలలో, సమావేశాల్లో భారతీయ సంస్కృతీసంప్రదాయాలను చాటిచెప్పటం, భారతీయులందరికీ గర్వకారణమే.

లక్ష్మీకాంతమ్మగారు గొప్ప కవయిత్రి. ఆమె సాహిత్యసేవను కొనియాడటానికి ఎంతచెప్పినా తక్కువే. మహిళా విక్రమసూక్తం, లజ్జాకిరీటధారిణి, కన్యకమ్మనివాళి, మనసాహితి–మధుభారతి మొదలైన రచనలెన్నో సాహిత్యంలో ఆమెకొక ప్రముఖస్థానాన్ని అందించాయి.

రామయణకావ్యాన్ని ఎవరైనా విమర్శిస్తే భరించలేకే, తానే రచయిత్రిమొల్లయై,

"మొల్లనురా రామ ఇతర
మొల్లనురా నీదుచరిత మొల్లలతావుల్
చల్లర, మకరందము వెద
జల్లగ, పాడితిని మనసుచల్లగస్వామీ" అన్నారు ఆవేదనతో.

లక్ష్మీకాంతమ్మగారు స్వీయచరిత్రను "తెరిచినపుస్తకం" అన్నారు. సాహితీరుద్రమ కళాప్రపూర్ణ లక్ష్మీకాంతమ్మగారి శతజయంతి సందర్భంగా, ఆ విదూషిమణికి స్మృతంజలి ఘటిస్తున్నాను.

# డాక్టర్ లక్ష్మీకాన్తమ్మ గారి ప్రసంగాలు

**- జి.వి. జ్వాలానరసింహశాస్త్రి**

షుమారు యెనిమిది దశాబ్దాలుగా, యావదాంధ్రసారస్వత సీమను, గాంగనిర్ఘర సదృగ్ధారలతో పరవళ్ళు త్రొక్కించిన ఏకైక మహిళామణి, ప్రాతఃస్మరణీయ డాక్టరు ఊటుకూరి లక్ష్మీకాన్తమ విదుషీమణి !

బహుముఖీనం, అతివిస్తృతం, వైవిధ్యం, గల ఆమె సారస్వత వ్యవసాయాన్ని యిదమిత్థం అని నిర్ణయించడం అంత సులభం కాదు. కందపద్యములు, గేయాలు, వ్యాసాలు, విమర్శలు, ఉపోద్ఘాతాలు, కథా కథానికా సంపుటీ సంకలనాలు, చారిత్రక పరిశోధనలు, సూక్తి సుధలు, వచన కవితలు, ఖండకావ్యాలు, భక్తి ప్రభోధకాలు, భువన విజయరూపక పాత్రధారణలు, ఇత్యాది రచనాంశాలెన్నో చేపట్టిన ఘనత ఆమెది! అందుకు ఉచిత రీతిలో అనేక విధాలైన సన్మానాలను, బిరుదాలను గ్రహించిన సుకృతాత్మురాలు కూడా!

సహస్రాధిక సంఖ్యగల సభలలో, ధీర గంభీర కంఠంతో ఆమెగావించిన ప్రసంగాలు సభాస్తారుల ప్రశంసాసహస్రములకు ఆలవాలమయ్యాయి. ఈ వక్తృత్వ శక్తి, ఆమెలో ఏర్పడటానికి, ఆమె శైశవం నుండి పరిపక్వ దశనందుకునే పరిణామంలో, దేశంలోని ఉద్యమస్ఫూర్తి ఆమెపై గాఢమైన ప్రభావం చూపడం సహజమైంది. స్వామి వివేకానంద, సర్ సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనీబిసెంటు, సరోజినీనాయుడు వంటి మహావక్తలు ప్రభవించి, దేశీయుల్ని కర్తవ్యోన్ముఖుల్నిగా, దేశాభిముఖుల్నిగా, చేయడానికి వినియోగించిన శక్తివంతమైన ఆయుధం; వారి వక్తృత్వ పాటవం! ఏ సాంస్కృతిక రంగంలో నైనా నూరు గ్రంథాలు రాసి, ముద్రించి, జనులచేత చదివింపచేయడం ద్వారా పొందే ఫలితం కంటే, పది ప్రసంగాలు కొన్ని వందలలోనున్న శ్రోతల సమక్షంలో, చేయడంవల్ల వేయిరెట్ల స్పందన సిద్ధించడం గమనించవచ్చు. ఇది సాహిత్య రంగానికీ వర్తిస్తుంది. అధిక సంఖ్యలో, రాశిలో లేక వాశిలో, రచనలుచేసి, గ్రంథస్థం చేసిన కవులూ, పండితులు కంటే, ఆశుకవితా ప్రదర్శనల ద్వారా, అవధాన ప్రక్రియలద్వారా అత్యధిక ప్రయోజనాలను గాంచిన తిరుపతి వెంకట కవులవంటి వాగ్విలక్షణులను గణించవచ్చు.

లక్ష్మీకాన్తమ్మ గారి సాహిత్య సృష్టి, మహోపన్యాసాల సృష్టిద్వారా ఆవిష్కృతమై, సహృదయుల దృష్టిలో రసపుష్టినీ, సంతుష్టినీ సంతరించుకొన్నది.

వక్తృత్వ కళాశిల్ప రహస్యములనుతెలుసుకొనడం ఒక వంతుకాగా, అందుదక్షత సంపాదించుకొనడం రెండవవంతు! కేవలం భాషపై అధికారము ఉన్నంతమాత్రాన, వక్త వ్యాసాన్ని సముద్దీప్తం చేయడం సులభం కాదు. సద్యోనిర్గతంగా, అనర్గళంగా ఆశువుగా వాక్యాలదొంతర్లు విసరడంతోపాటు, పదాల పోహళింపులో, స్వరాన్ని ఆరోహణ అవరోహణలతో క్రమబద్ధం చేయడం, శబ్దాలను ధృవీకరించడం, హ్రస్వీకరించడం, ఉచ్ఛారణతో

తూగును జొప్పించడం, అర్థ ప్రతిపత్తిని, సాధించడం, భావోన్మీలనం ద్వారా రససాక్షాత్కారానికి ప్రయత్నాలు చేయడం వంటి ఎన్నో - మెళకువలు ఉన్నాయి. పాశ్చాత్య సంస్కృతిలో అత్యున్నతస్థితిని వక్తృత్వ కళ సాధించింది.

ఈకళ ఆమెలో పుష్కలంగా ఉంది. ఏవిషయాన్నయినా, ఆమె వాగ్వైఖరితో సమ్మిళితమైతేనే చాలు! శ్రోతల శరీరాలు జలదరించేటట్లు, సదస్యుల హృదయాలు పులకరించేటట్లు, రసోల్లాసంతో మంత్రముగ్ధులయ్యేట్లు చేయగల నేర్పు లక్ష్మీకాన్తమ్మగారిలో ఉన్నది. అందుకే ఆమె చేసే ప్రతి భాషణం "సాహిత్యం"గా రూపాంతం చెందుతుంది. ఆమె ప్రతి ప్రసంగం, ఒక రసగుళిక!! ఒక కవితా మయఖండిక ! ఒక వాఙ్మయ దీపిక!!

ప్రస్తుతానికి లక్ష్మీకాన్తమ్మ విదుషీమణికి ఎన్నడో చెప్పిన ప్రస్తుతిని తెల్పి "స్వస్తి" అనడం మంచిది.

"మధుర కవితయగుచు, సుధలను జిందించి,
తెలుగుజాతి కెవరు వెలుగు దెచ్చె
ప్రథితినిచ్చునామె, ప్రాజ్ఞయై, సాహితీ
ప్రథమ పీఠ మెక్కు పరమపూజ్య"

"జ్వాలా శాస్త్రి"

- సంస్కృతి నుండి

# ఆధ్యాత్మిక రసధుని

- బి.ఎస్. నారాయణ భట్టు

రాష్ట్ర రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు

ఆమె మేఘగంభీర స్వరంతో వాక్ఝరిని గంగా ప్రవాహంగా ఉత్తేజ తరంగంగా, ఉద్రేకపు వెల్లువగా జనాళి హృదయాలలో ప్రతిధ్వనించే అక్షర లక్షలను క్రుమ్మరించగల్గిన స్ఫూర్తి!, అనురాగ మూర్తి? ఏ రంగంలోనైనా రంగరించుకున్న కళాప్రకీర్తి! బాపట్ల పట్టణంలో సాహిత్య, సాంఘిక, కళా రంగాలకు ఆమె మణిపూస. మానవతావాదం, సంస్కరణ భావం పడుగుపేకల్లా ఆమె నరాలలో అల్లుకుని సమాజ జీవనసౌందర్యానికి తానూ ఆలంబనయై, ఉపన్యాస ప్రకంపనలతో సభావేదికలను ఉర్రూతలూగించి, శ్రోతలను రసాస్వాదనానుభూతులకు లోనుచేసిన మహిళామణి డా॥ లక్ష్మీకాన్తమ్మ డా॥ లక్ష్మీకాన్తమ్మగారు లేని సభ వెల వెల పోతుందంటే అతిశయోక్తి కాదు. ఆదికవి నన్నయ అక్షరాలా ఆంధ్ర మహాభారతానికి శ్రీకారం చుట్టిన గోదావరి తీరాలనుంచి కృష్ణమ్మ తరంగాలలో శబ్దార్థాల చిరుమువ్వల సవ్వడి నుంచి ఆధ్యాత్మిక నాదాలనూ, అంతరంగిక వేదాలనూ రుక్కుల్ని దిక్కుల్లో వ్యాపింపచేయాలని అనంత ప్రయాణాన్ని ఆధ్యాత్మిక ప్రచారానికి సాగించిన ఏకైక మహిళ డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ. రాష్ట్ర విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సభ్యురాలిగా, ఒక దశాబ్దకాలం బాపట్లలో పరిషత్ అధ్యక్షురాలిగా, హిందూ ధర్మాన్నీ, హైందవ జ్యోతుల్ని జాజ్వల్యమానంగా భారతీయ తత్వాలతో వెలిగించడానికి ఆమె అనంత అవిశ్రాంత పథికురాలిగా పురోగమించడం స్పష్టమైన నిదర్శనం. చికాగోలో స్వామి వివేకానందుడు భారతీయ బాణిని ఏ బాణీలో వినిపించాడో వినని వారికి డా॥ లక్ష్మీకాన్తమ్మ ఉద్విగ్నపూరిత హైందవ ధర్మ ఉపన్యాసవిన్యాసాలు, ఆనాడు వివేకానందుడు ఈలాగే చెప్పి వుండవచ్చుననిపిస్తాయి. పాశ్చాత్య దేశాలలో కూడా విశ్వహిందూ ధర్మాన్ని జాగృతం చేసిన ఘనత ఆమెది! సంస్కరణవాదంతో హిందూ మత సంస్కరణనూ, సాంఘికవాదంతో సామాజిక మార్పునూ ఆమె ఉపన్యాసాల్లో స్పష్టపరిచేది. ఆంగ్ల సంస్కృతి ప్రభావానికి వెలవెలపోతున్న భారతీయ సంస్కృతిని పునరుద్దీపన చేయడం అత్యంత ఆవశ్యకం! అని డా॥ లక్ష్మీ కాన్తమ్మగారు ఎన్నో వేదికలనుంచి తన భావాలను అందించారు. ఆమె ప్రబంధాలను మానవతా ప్రమోదాలుగా మార్చాలని, ఆ మార్పు జనాళికి అందించాలని తహతహలాడారు. ఆ ఆధ్యాత్మిక నవోన్మేషకెరటం నిత్యమూ ప్రవహిస్తుంది. అనునిత్యం స్పందిస్తుంది. ఆమెలా ఆదర్శవంతంగా సమాజం ముందుకు వచ్చి పురోగమనానికి పాటుపడే మహిళలను వ్రేళ్లమీద లెక్కించవచ్చు. ఎన్నిటినో అధిగమించింది. తన విజ్ఞాన సంపదతో తల్లి రుణాన్ని తీర్చుకున్నది. ఇకముందు కూడా ఎన్నో కీర్తి ప్రతిష్ఠలను, ఔన్నత్యాన్ని పొందగల శక్తిని పరమేశ్వరుడు ఈమెకు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. సహజంగా మానవ జీవితానికి సార్థకతను చేకూర్చేది పాండిత్యం మాత్రమే. అందులో కూడా కళాత్మకత, సౌధాగ్రముపై భాసించే మణిదీపంలాగ ప్రకాశిస్తుంది. చిరంజీవిని శ్రీమతి సుహాసినిలో ఈ కళాత్మకతాప్రజ్ఞ అసమానం. భగవంతుడు ఈమెకు చిరాయురారోగ్య భోగభాగ్యాలు ప్రసాదించి లోకహితమైన ఎన్నో సాహిత్యకార్యాలు ఈమె చేత తప్పక జరిపించాలని, జరిపించగలదని ఆకాంక్షిస్తూ వయస్సులో పెద్దనయిన నేను ఆశీర్వదిస్తున్నాను.

- సంస్కృతి నుండి

# ఈ తరం మహిళ

- డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి
అధ్యక్షులు: చైతన్య వేదిక, తెనాలి.

తన పాండితీ ప్రకర్ష, సాహితీ సంపదతో దాదాపు ఐదు దశాబ్దాలపాటు విజ్ఞాన వీచికలు ప్రసరించిన విదుషీమణి డాక్టర్ లక్ష్మీకాన్తమ్మ. సిరిసంపదలుగల కుటుంబంలో జన్మించినా, జాతీయోద్యమానికి స్పందించి - స్వాతంత్ర్య సమర సమావేశాలలో పాల్గొన్నారు. సామాన్య ప్రజానీకంలో మద్యపాన అలవాటును మాన్పేందుకు ఎంతో కృషిచేశారు. ఈ సంగతి ఆమె ఇలా చెప్పారు.

ఆ రోజుల్లో జరిగిన సంఘటనలలో 'మద్యపాన పికెటింగ్' నేను మరువలేనిది, ఊరూరా తిరిగి కల్లు తాగేవారిని మాటలతో మార్చాలని చూసేవాళ్లం. కానీ ముందు వాళ్లు వినేవారుకారు. ఆవేశంకొద్దీ వాళ్ల దగ్గరున్న ముంతలను లాక్కునేవాళ్లం. వాళ్లుకూడా ఆడపిల్లనయిన నన్ను ఏమీ చేయలేక ఆ ముంతలను నా నెత్తిన పగులగొట్టేవారు ఏది ఏమయినప్పటికీ ఆ రోజుల్లో ప్రజలు చెప్పిన మాట వినేవారు. పైగా మాట ఇస్తే నిలబెట్టుకునే ఆత్మవిశ్వాసం ఉండేది. ఈనాడు ప్రజల్లో ఏమాత్రం మోరల్ వాల్యూస్ వుండడంలేదు' అదీ డాక్టర్ లక్ష్మీకాన్తమ్మగారి ప్రత్యేకత.

- సంస్కృతి నుండి

# అనర్గళం-అద్వితీయం లక్ష్మీకాన్తమ్మగారి ఉపన్యాసం

- డా॥ వెన్నా వల్లభరావు

సమాజాన్ని ప్రభావితం చెయ్యటానికి గ్రంథరచన కంటే మంచి ప్రభావపూరితమైన ఉపన్యాసాలు బాగా దోహదపడతాయన్నది నిరూపితమైన సత్యం. గొప్పవక్తలైన నాయకులు ఎంతోమంది తమ ఉపన్యాసాలద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసిన సంఘటనలు కోకొల్లలు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో మన జాతీయ, ప్రాంతీయ నాయకులు తమ ఉపన్యాసాలద్వారానే దేశవాసుల్లో స్వాతంత్ర్యకాంక్షను, దేశభక్తిభావాన్ని పాదుకొల్పారు. స్వామివివేకానంద ఉపన్యాసాలు సాంస్కృతిక చైతన్యానికి ఎంతో ఉపకరించాయి. గాంధీ, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, సరోజినీనాయుడు వంటి మహావక్తలు దేశీయుల్ని కర్తవ్యోన్ముఖులుగా చెయ్యటానికి వినియోగించిన శక్తివంతమైన ఆయుధం వారి ప్రసంగపాటవం. ఏ రంగంలోనైనా వంద గ్రంథాలు రచించి, ప్రజలచేత చదివింపజేయటం ద్వారా పొందే ఫలితం కంటే శ్రోతల సమక్షంలో నిలిచి ధీరగంభీర కంఠంతో గావించిన పది ప్రసంగాలు వేలమందిలో స్పందనను, స్ఫూర్తిని, ఉత్సాహాన్ని కలిగిస్తాయి. వచోనైపుణ్యం గలవారిని ప్రజలు ఎంతో ఆరాధిస్తారు. తెలుగునాట తన ప్రసంగ పాటవంతో అపరవాగ్దేవిగా వెలుగొందిన ఉపన్యాసకేసరి శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ.

స్త్రీని నాలుగుగోడలకు పరిమితంచేసి, వారికి చదువుకునే అవకాశం కల్పించని రోజుల్లో తాను విద్యావంతురాలు కావటమే కాకుండా విద్వత్కవయిత్రిగా, స్వాతంత్ర్య సమరయోధురాలిగా, మహిళాభ్యుదయవాదిగా నారీలోకానికి ఆదర్శంగా నిలిచిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ. సంగీత సాహిత్యాల్లో ప్రసిద్ధురాలైన ఆమె ఉపన్యాసపాటవం అనన్యసామాన్యం. ఏ విషయం పైనైనా అప్పటికప్పుడు అనర్గళంగా ప్రసంగించగలగటం ఆమె విషయపరిజ్ఞానానికి, వక్తృత్వపటిమకు నిదర్శనం. లక్ష్మీకాన్తమ్మగారు మూడువందలకుపైగా గంభీరమైన ఉపన్యాసాలుచేసి ఎనలేని ఖ్యాతి సంపాదించారు. ఆమెచేసిన ఉపన్యాసాల్లో కొన్ని సాహిత్యపరమైనవి, కొన్ని ఆధ్యాత్మికమైనవి, మరికొన్ని మహిళాభ్యుదయానికి సంబంధించినవి. చేపట్టిన అంశాన్నిబట్టి ఆమె కూర్చే పదాల పోహళింపు, స్వరారోహణ-అవరోహణ, ఆశువచోధార శ్రోతల్ని కట్టిపడేసేవి. గంగాప్రవాహంతో సమానమైన వాక్కు ఆమెకొకవరం.

అద్వితీయమైన ఆమె ఉపన్యాసధోరణి గురించి విన్నవారు లక్ష్మీకాన్తమ్మగారిని తమ ఊళ్ళకు ఆహ్వానించి అక్కడి ప్రజల సమక్షంలో ప్రసంగించవలసిందిగా కోరుతుండేవారు. ఒక ఊరిలో ఉపన్యాసానికని బయలుదేరిన ఆమెను పక్క ఊళ్ళవారు బ్రతిమిలాడి తమ ఊరికివచ్చి ఉపన్యసించమని తీసుకువెళ్ళేవారు. విద్యార్థిసంఘాలు, అధ్యాపకులు ఆమెను తమ కళాశాల విద్యార్థులనుద్దేశించి ప్రసంగించటానికి రావలసిందిగా ఆహ్వానం పలికేవారు. దానితో ఆమెకు అనేకమందిని చైతన్యపరిచే అవకాశం లభించేది. 'ఆదర్శవివాహం', 'గృహస్థాశ్రమధర్మం',

‘ఆంధ్రాభ్యుదయం-మహిళలు’, ‘ఆంధ్రోద్యమం’, ‘ఆంధ్రసాహిత్యం’, ‘రామాయణంలో సీతపాత్ర-ప్రయోజనం’, ‘భగవద్గీత-భక్తియోగం’ మొదలైనవి లక్ష్మీకాన్తమ్మగారు అద్భుతంగా ప్రసంగించిన అంశాల్లో కొన్ని.

వైవిధ్యభరితమైన సాహిత్య సృజనగావించిన ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి ప్రతిభ మహోపన్యాసాలద్వారా ఆవిష్కృతమై వేలాదిమంది శ్రోతల ప్రశంసల్ని అందుకుని అనేక గౌరవాల్ని అందుకునేట్టు చేసింది. బాల్యంలోను, చదువుకునే సమయంలోను దేశంలో వ్యాపించిన ఉద్యమస్ఫూర్తి, మేటి నాయకుల ఉత్తేజకరమైన ఉపన్యాసాలు ఆమెపై గాఢమైన ప్రభావం చూపాయి. తనకు సహజంగా సంప్రాప్తించిన వక్తృత్వకళకు క్రమక్రమంగా మరింత సానపట్టి ఆ కళలో అత్యున్నతస్థితిని సాధించగలిగారు ఆమె. శ్రోతల ఒళ్ళు జలదరించేటట్లు, వారి హృదయాలు పులకరించేటట్లు, రసోల్లాసంలో వారు మంత్రముగ్ధులయ్యేట్టు ప్రసంగించే నేర్పు లక్ష్మీకాన్తమ్మగారి సొంతం.

అటువంటి అసమాన ధీర గంభీర ప్రసంగ ప్రజ్ఞా ధురీణ డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మను ప్రశంసిస్తూ డా॥ సి.నారాయణరెడ్డి–“రణపౌరుషానికి, రాజ్యపాలన పాటవానికీ కాకతీయరుద్రమాంబ గణుతికెక్కింది. పాండిత్య వీరానికి, ప్రచండ వక్తృత్వ ప్రావీణ్యానికి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ కోటికెక్కింది” అన్నారు. డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు “లక్ష్మీకాన్తమ్మ సాహిత్యరంగంలో, ముఖ్యంగా ఉపన్యాసప్రక్రియలో తనదైనస్థానాన్ని సంపాదించుకున్నారు. కొండంత ఆత్మవిశ్వాసం, గోదావరంత వాక్చాతుర్యం ఆమెకు ఆ స్థానాన్ని సంపాదించిపెట్టాయి” అని కొనియాడారు.

# నేటి తరానికి ఆదర్శంగా నిలిచే
# 'సాహితీరుద్రమ ఊటుకూరి లక్ష్మీ కాన్తమ్మగారి దేశభక్తి'

**- శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి**

బాల్యం పిల్లల భావిజీవితానికి పునాది అనే సూక్తికి సరైన ప్రతీక ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ. ఆమె చిన్నతనంలో చూసిన సాహిత్య, సంగీత వాతావరణం, స్వాతంత్ర్యోద్యమం, బ్రహ్మసమాజప్రభావం ఆమెను ఒక విశిష్టసాహితీమూర్తిగా వ్యక్తిగా రూపుదిద్దాయి.

తండ్రి నాళం కృష్ణారావు గారి సాహితీసామాజిక పరిచయాలు ఆమెను ప్రాచీన సాహిత్య అధ్యయనంలో లోతులను తడిమేలా చేసాయి. ఆంగ్ల విద్యపై విముఖత చూపినా వ్యాకరణం, సాహిత్య విమర్శలలో దిట్టకావడానికి కారణం మటుకు కవిత్రయాన్ని, కాళిదాసుని, దండిని సవివరంగా చదవడం ఆమె వాగ్ధాటికి దోహదం చేసింది. రాణ్మహేంద్రవరం లోని గౌతమీగ్రంథాలయ పరిచయం ఆమెలో పరిశోధకురాలిని తట్టిలేపింది. 'వ్యాసశకుంతల, కాళిదాసు శకుంతల' అనే వ్యాసాన్ని పండితుల మెప్పుపొందేలా విరచించడానికి కారణం పిలకా గణపతిశాస్త్రి, గొర్తి సూర్యనారాయణశాస్త్రి గారి వంటి ఉద్దండుల గురుత్వప్రభావం అనక తప్పదు. ఆంధ్రయువతీ సంస్కృతకళాశాల, ఆనాటి గోదావరీ తీర సాహితీ సభల పరిమళ గంధం ఆమెను సాహితీరుద్రమగా రూపాంతరం చెందించాయి. వీరేశలింగంగారి రచనలపఠనం, బ్రహ్మసమాజసిద్ధాంతాలు ఆమె ఆలోచనలలో తార్కికతకు బాటలు వేసాయి.

లక్ష్మీకాన్తమ్మ గారికి సంగీతాభిరుచి ఏర్పడేందుకు ఆమె బాల్యంలో నేర్చిన వీణావాదన కృషి ముఖ్యకారణం. తర్వాత రోజుల్లో ఆమె లయాత్మక గీత శ్లోకరచన చేయడానికి అది ఎంతో తోడ్పడింది. ఈమని అచ్యుతరామశాస్త్రిగారి వద్ద ప్రారంభించిన వీణపాఠాలు. శ్రీకాకుళానికి చెందిన పొట్నూరి స్వామిబాబుగారి ద్వారా పొడుగు రామమూర్తిగారి వద్ద, పిమ్మట బెహతా రాజారావుగారివద్ద శిక్షణ పొందడం ఆమెకు సరస్వతీమాత కరుణా కటాక్షవీక్షణం సంపూర్ణం కావడానికి సహకరించింది. రాజమహేంద్రలోని మహిళాగానసభ నిర్వహించిన వీణ పోటీపరీక్షలో స్వర్ణపతకం పొందడానికి ఆమెసాధన, కృషి తోడ్పడ్డాయి. ముసిరి సుబ్రహ్మణ్యఅయ్యరుగారి పాటను ఆటపట్టిస్తూ 'ముసిరి, నీపాటకీగలు ముసిరెనయ్యా' అనగా ఆమెతండ్రి మందలించారు. అటుపిమ్మట తన తప్పును తెలుసుకుని వారి ఎవరినీ విమర్శిస్తూ పద్యాలు చెప్పడం మానుకున్నాను అని స్వీయచరిత్రలో చెప్పుకున్నారు.

కాలాంతరంలో శాంతినికేతనం నుండి వచ్చిన మంత్రవాది వెంకటప్పయ్యగారు విసిరిన సవాలుకు దీటుగా ఆయన పాడుతున్న పాటను తన వీణమీద వాయించి వారిచ్చిన బహుమతిని ప్రశంసను పొంది ఉప్పొంగిన

సద్యస్ఫూర్తి, ప్రతిభాగల విదుషీమణిగా పేరెన్నికపొందడానికి ఆమె అకుంఠితదీక్ష, సాధన ఈనాటి బాల, బాలికలకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయి.

ఆమె 'ఆంధ్రకవయిత్రులు' గ్రంథరచనకు గౌతమీ గ్రంథాలయం, వేటపాలెం సారస్వతనికేతనం, తంజావూరు చెన్నపురిలోని గ్రంథాలయాలకు వెళ్ళి కూలంకషంగా విషయసేకరణ కావించడం వలన సమగ్రంగా రచన కావించి పురస్కారం అందుకున్నారు. ఆనాటి మహిళామణులలో సాహిత్య జిజ్ఞాస, పరిశోధనా పటిమ, పట్టుదలకలిగిన గొప్ప రచయిత్రి లక్ష్మీకాన్తమ్మ గారు. రామాయణంలో సీత, భారతంలో కొన్ని అంశాలు గురించి ఆమె అనర్గళంగా రెండు గంటలపాటు ప్రసంగించగలగడానికి కారణం విస్తృత సాహితీ అధ్యయనం.

తండ్రి నాళం కృష్ణారావుగారి చొరవ, భర్త హయగ్రీవ గుప్త గారి సహకారం ఆమెకు చేదోడు, వాదోడుగా నిలవడం వలన స్వరాజ్యపోరాటంలో పాల్గొనగలిగారు. కన్యకా పరమేశ్వరి సుప్రభాతమ్, దేవీస్తవతారావళి, కన్యకమ్మ నివాళివంటి సంస్కృత గ్రంథరచన ఆమెపాండిత్య గరిమకు తార్కాణం. మహిళా విక్రమసూక్తం, నా తెలుగు మాంచాల, లజ్జా కిరీటధారిణి, ఆంధ్రకవయిత్రులు, అఖిలభారత కవయిత్రులు, కాంతిశిఖరాలు మహిళల వీరత్వం, లాలిత్యం, సాహితీప్రతిభను ఎత్తిచూపే రచనలు. హిందీలో ప్రసిద్ధుల దోహాలను 'సదుక్తిమంజరి'గా అనువదించి ఆమెకు గల భాషాధికారాన్ని రుజువుచేసుకుని వినుతికెక్కారు. గాంధీపై తన భక్తిని జాతిపిత, ఒక్క చిన్నదివ్వె, భారతదేశచరిత్ర-కొన్ని గుణపాఠాలు ద్వారా వెలిబుచ్చారు.

గాంధీగారితో ఆమె అనుభవాలు ఆనాడు చాలా మందికి దక్కని భాగ్యం అనుకోవాలి. గోదావరితీరం సత్యాగ్రహోద్యమం ఉద్ధృతంగా జరిగిన ప్రదేశంకావడం వలన తండ్రితో కలసి పికెటింగులకు వెళ్ళడం, ఖాదీవస్త్రాలు అమ్మడం, ఉపన్యాసాలు ఇస్తూ జనులనుత్సాహపరచడం ఆనాటి స్వరాజ్యపోరాటంలో ప్రధాన ఘట్టాలు. సబర్మతీ ఆశ్రమం నుండి, కాంగ్రెసునాయకుల నుండి వచ్చిన ఇంగ్లీషు కరపత్రాలను తండ్రిగారు అనువదించి చెబుతూంటే ఆమె వ్రాసేవారు. రాత్రికి రాత్రి వాటిని అచ్చువేయించి తెల్లవారేసరికి ఆ పత్రాలు కాలేజీలలో, సోడా అంగళ్ళలో, హోటళ్ళలో అందరికి అందే ఏర్పాటుచేసేవారు. ఆ కరపత్రాలను చదివి జనం ఎప్పటికప్పుడు ఉద్యమవార్తలను తెలుసుకునేవారు.

ఊరేగింపులో గాడిచెర్లవారి కుమార్తెతో కలసి 'మాకొద్దీ తెల్లదొరతనము' వంటి ఉద్యమగీతాలు పాడుతూండేవారు. తండ్రి నాళం కృష్ణారావుగారు రాసిన పోలీసు అధికారులపై పాటలు 'సమ్మయ్య! నీబ్రతుకమ్మెయ్య; 'ముస్తఫా, నీకస్తీ ఏమిటిరా?', 'దప్పుల సుబ్బారావూ నీ బ్రతుకప్పుల పాలేరా', మొదలయినవి పాడుతూ పోలీసు జులుం ఎండగట్టే తెగువ ప్రదర్శించగలిగారు.

పోలీసులు 'లాఠీమారో' అన్నప్పటికీ ఎదురునిలిస్తే జనం ఎదురుతిరిగి బాలికలను కాపాడిన ఘట్టం ఆమె స్వీయచరిత్రలో వ్రాసుకున్నారు. ఆ తెగువ, ధీరత్వం ఆమెను చివరంటా వీడలేదు.

బాపూజీ రాజమండ్రి వచ్చినపుడు విదేశీవస్త్రదహనం కావించడానికి ఆమె తల్లి ముందుకు రాగా గాంధీజీ లక్ష్మీకాన్తమ్మ గారిని చేరబిలిచి 'సోనాలావో' అని చెప్పగా ఎగిరిగంతేసి జనంలోకి వెళ్ళి "స్వాతంత్ర్య సమరంతో

పాలుపంచుకోండి. నిధిని సమకూర్చండి", అంటూ అభ్యర్థించి బంగారం సేకరించి ఇవ్వడంతో బాపూజీ ఆమె భుజంతట్టి 'తుమ్హారా భాగ్ క్యాహై?' అని అడిగితే తన ఎడమచేతి బంగారు గాజును తీసి ఇచ్చివేశారు. శ్రీరామునికి సాయంచేసిన ఉడతగా తనని భావించుకుని త్యాగానికి, స్వాతంత్ర్యోద్యమప్రేరణకు ప్రతీకగా నిలిచిపోయిన ఆ చేతిని 'గాంధీగారి చెయ్యి' అని చూపుతూ పెళ్ళయే వరకు గాజులు తొడుగుకోలేదు. అంత గాంధీ భక్తురాలు ఆమె. గాంధీ చెప్పినట్లే ఖాదీ దుస్తులను ధరించుతూ వచ్చారు.

'గాంధీ మహాత్ముని శంఖారావము వీనులసోక ఎండకన్నెరుగని పొలతులు పరదాచించియు, ఇండ్లను విడిచియు, స్వతంత్ర రణమున నుతికియు, సాహసశక్తిని సమరము సల్పియు, బాపూ ప్రస్తుతి బడయుటెరుగమే' అని సత్యాగ్రహ ఖండంలో అంటారు.

దేశ విభజనతో దివికేగిన బాపూగురించి 'భారతాంబగుండెలో బాకులు గ్రుచ్చుచు క్షోభింపజేయుట చూడలేక పరమతసహన ప్రభావంపు ఫలితమౌ హిందు ముస్లిం భేదమిష్టపడక మాతృభూమిని విడనాడి మమత ద్రుంచి దివికినేగితివా ఓయి దివ్యమౌని? మేము పడుకున్న కష్టాలనేమి చెప్పనయ్యయ్యో, మేమనాథల మైతిమయ్య', అన్న దేశభక్తురాలు ఆమె.

ఆమెను కన్న ఆంధ్రదేశం, తెలుగు ప్రజలు ధన్యులు.

## ఓం శ్రీ సత్య సాయి బాబాయై నమః

*యా కుందేందు తుషార హార ధవళా, యా శుభ్ర వస్త్రాన్వితా*
*యా వీణా వరదణ్డ మణ్డితకరా, యాశ్వేత పద్మాసనా।*
*యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిర్దేవై స్సదా పూజితా*
*సామాంపాతు సరస్వతీ, భగవతీ, నిశ్శేష జాడ్యాపహా॥*

*ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదం।*
*లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం॥*

సభాసదులకూ, పెద్దలకూ, పిన్నలకూ, ఎందరో మహానుభావులు అందరకూ నా నమోవాకాలు. ఈనాడు ఇక్కడ అందరమూ ఒక విశిష్ట వ్యక్తి యొక్క ప్రథమ వర్ధంతి సందర్భంలో సమావేశం జరుపుకుంటున్నాము. ఆ విశిష్ట వ్యక్తి మరెవరో కాదు. నా అనుంగు తల్లియే కావడం నాకెంతో గర్వ కారణంగా కూడా ఉన్నది.

ఆనాడు ఒక మహా ఘోర మరణం జరిగింది. భారతమాతను విదేశీ కర్కశుల శృంఖలాల నుంచీ విమోచనం చేయించి తుది శ్వాశ వఱకూ దేశసంక్షేమం కొఱకై పాటుపడి అశువుల బాసిన ఒక మహాత్ముని నిర్యాణం జరిగింది.

అదే విధంగా 1996 డిశంబరు 1వ తేదీన తన అంతిమ శ్వాశ వరకూ ఆంధ్రమాతకూ, మరీ ముఖ్యంగా ఆంధ్రభాషకూ, ఆంధ్ర సరస్వతికీ, ఆంధ్రావనికీ నిస్వార్థమైనటువంటి, నిష్కళంకమైనటువంటి, నిరవధికమైనటువంటి అపారమైన సేవలు చేసిన ఒక మహావ్యక్తి, ఒక ఆంధ్ర సరస్వతి అనండి, లేక విద్వత్కవయిత్రి అనండి, లేక ఆంధ్ర విదుషీ కుమారి అనండీ, లేక తెలుగు మొలకయే అనండీ, బ్రాహ్మీ భూషణులనండీ, లేక సాహితీ రుద్రమ అనండీ, లేక ఒక కళాభారతి అనండి, మరింకా సంగీత సాహిత్య కళా నిధి అనండి, లేకపోతే కళాప్రపూర్ణ అనండి, మరింకా, పండితభారతి అనండి, ధర్మప్రచార భారతి అనండి, లేకపోతే అపరవాగ్దేవి యనండి, ఈ లాంటి బిరుదాలకూ, ప్రశంసలకూ అన్నింటికీ అసమాన ప్రతిభతో సార్థకం చేకూర్చిన ఒక సాహితీకళామతల్లి, ఒక సాహితీ తపస్విని, ఒక సాహితీ కిరణం, ఒక అనూచానమాన, అనూహ్యమాన, అత్యంత హృద్యానందకర్యోపమాలంకార సంకర్త్రిణి (ఉదాహరణకు, మాంచాల వర్ణన), ఉభయభాషాప్రవీణ, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారి నిర్యాణం జరిగింది.

ఆమె మరెవరో కాదు నా తల్లియే. ఆమె మరణ వార్తను విని ఆంధ్రావనిలోని వార్తాపత్రికలన్నీ సంతాపాన్ని వెలిబుచ్చాయి. ఒక మహా కవయిత్రి అస్తమయం చెందిందని వాపోయారు. ఆ సంతాప వ్యాఖ్యలను చదువుతూంటే నాకొక పద్యం గుర్తుకు వస్తున్నది. అది మహా కవి శ్రీ పోతన భాగవతాన్ని ఆంధ్రీకరిస్తున్నప్పుడు ఆయనకు స్వప్నంలో, కాటుక కంటి నీరు చనుకట్టుపైం బడునంతగా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న సరస్వతీ కటాక్షం జరిగిన సందర్భం అది. ఆ సందర్భం వేరు అనుకోండి. అప్పుడు సరస్వతి, పోతనామాత్యుడు తన సాహిత్యాన్ని నిజదారసుతోదర పోషణార్ధమై అమ్ముకుంటాడేమో ననే బెంగతో వెక్కి వెక్కి ఏడ్చింది. మరి ఈ నాటి లక్ష్మికాంతమ్మతో, సరస్వతీమ తల్లికి అలాంటి బెంగకు కారణమేమీలేదు. ఎందువలనంటే, ఆమె ధనార్జన నిమిత్తమై ఎప్పుడూ ఏమీ వ్రాయలేదు. ఎవరి దగ్గరా ఏమీ ఆశించలేదు. మరియు, రాచమర్యాద లేవీకోరుకోలేదు. కానీ సాక్షాత్తు అపర సరస్వతియని బిరుదాంకితురాలైన లక్ష్మీకాంతమ్మ దివంగతురాలైనదని ఆంధ్రావని అంతా భోరు భోరున విలపించారు. ఆంధ్ర సాహిత్యలోకమంతా దిగ్భ్రాంతులైనారు. ఎన్నెన్నో సంతాపోపన్యాసాలు ఎన్నెన్నో పత్రికలలో ఎన్నెన్నో దినాలు వ్రాశారు. ఇంకా లక్ష్మీకాంతమ్మలేని కొరత అలానే భావిస్తున్నామని నిరూపించుకోవడం కొరకే కాబోలు ఈనాడు బాపట్లలో సమావేశమైనారు. గమనించారా మరి, ఆనాటి సరస్వతి విలాపానికీ, ఈనాటి అపర సరస్వతీ నిర్యాణ సందర్భాన జరుగుతున్న అఖిల జనాంతిక విలాపానికి సంబంధం ఉందంటారా లేదా.

ప్రత్యేకంగా ఆంధ్ర సాహితీమణులకు ఎనరాని సేవచేసింది. శతాబ్దాల పర్యంతం స్త్రీలు గూడా కవనం చేస్తారా, అసలు చేయగలరా అనేటటువంటి ఉద్దేశ్యాలతో మరుగునపడిపోయియున్న 500 మంది సుప్రాచీన, అంటే వైదికకాలం నుంచీ, ఆధునిక కాలం వరకూ ఉన్న గద్య, పద్య, కవయిత్రీలలామలను వెలుగులోనికి తీసుకునివచ్చి ఆంధ్ర ప్రజానీకానికి ఎంతో గర్వంతో చాటించి చెప్పింది. ఆ విజయోత్సాహంతో శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారి ప్రోత్సాహంతో భారతావనియంతా తిరిగి అఖిల భారత రచయిత్రీ మణులను భారత దేశానికి పరిచయం చేసింది. హైదరాబాదులో అఖిల భారత రచయిత్రీమణుల సమాఖ్య ఒకటి కూడా విజయవంతంగా నిర్వహించింది.

ఎన్నెన్నో రచనలు చేసింది: ఆలిండియా రేడియోలో, ఆంధ్రావనిలో ఎన్నెన్నో సాహిత్యప్రసంగాలు చేసింది. నాకు అప్పుడప్పుడు ఆమె ప్రసంగాలు వినటానికి సదవకాశం కలిగేది. పవిత్ర గోదావరీ తటస్థ రాజమహేంద్రవరంలో జన్మించినందువలన గాబోలు ఆమె ప్రసంగాలు వింటూంటే ఎలాంటి భావోద్వేగం కలుగుతుందంటే, ఉప్పొంగి పోయింది గోదావరీ, తెప్పున్న ప్రవహించింది గోదావరీ అనీ, మరికూడా, గలగలా గోదారి పొంగి పొరలి పోతుంటేను అనే గేయం గుర్తుకు వస్తుంది అనడంలో అతిశయోక్తి ఏమీలేదనుకుంటాను. ఆ వాక్ప్రవాహానికి ఒక ఒడ్డులేదు. ఒక వ్యవధి లేదు. గంటల తరబడి నిల్చుని ప్రసంగించగలదు. ఎన్నెన్నో కవి సమ్మేళనాలలో పాల్గొన్నది. ఎన్నెన్నో కవితలు వ్రాసింది. కనకాభిషిక్త అయింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు ఆమె ధీశక్తిని గుర్తించి కళాప్రపూర్ణ పట్టప్రదానం చేశారు. ఆ దినం ఆమెకు ఎంతో ఆనందం కలిగింది. తన జీవశ్రమకు ఒక గుర్తింపు, పరిపూర్ణత్వం కలిగిందని తనలో తాను పొంగి పోయింది. నేను ఆ రోజుల్లో ఖరగ్‌పూర్‌లో పనిచేస్తుండేవాడిని. ఆ సుదినాన్న

ఆమెతో ఆ ఆనందం పంచుకోవడానికి ఎంతో గర్వంతో ఉప్పొంగిపోతూ వాల్తేరుకు నేను కూడా వెళ్ళాను. అక్కయ్యా, బావా కూడా వచ్చారు.

ఒక సాహిత్య సేవయే గాదు. ఆమె తన జీవితంలో ఎన్నెన్నో సాంఘిక సంక్షేమకార్య కలాపాలు చేపట్టింది. ముఖ్యంగా స్త్రీ జనాభ్యుదయ, సంక్షేమ కార్యక్రమాలంటే మొదటి నుంచీ ఆమెకు ఎంతో ఇష్టం. అభిలాష, విగతభర్తృకలైనటువంటి స్త్రీల పునర్వివాహ ఉద్యమాలలో ఎంతో ఉత్సాహంతో, ఉద్రేకంతో పాల్గొన్నది. స్త్రీవిద్య కొరకై ఎంతగానో పాటుపడింది. తనకు ఉభయభాషా ప్రవీణ సంబంధ విద్యాప్రదానం చేసిన, రాజమహేంద్రవరంలోని స్త్రీలకళాశాలయైన, వైశ్య సేవా సదనం అభివృద్ధి కొరకై శాయశక్తులా సేవ చేసింది. ఆ రోజుల్లో స్త్రీవిద్యా వ్యాసంగాలకు నాంది కలిగించిన శ్రీమతి స్వర్గీయ బత్తుల కామాక్షమ్మ గారు ఆమెకు ఆదర్శప్రాయిని. స్త్రీజనాభ్యుదయ, సంక్షేమ కార్యక్రమాల విషయాలలో శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ ఆమెకు ఆదర్శప్రాయం. బాపట్ల వాస్తవ్యురాలైన స్వర్గీయ శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు స్త్రీజనోద్ధరణ, స్త్రీ స్వాతంత్ర్యం మొదలైన విషయాలలో అమ్మకు ఆదర్శప్రాయిగా ఉండేవారు.

బాపట్లలో రెండు సంవత్సరాల పాటు నిస్సహాయులైన, నిరాధారులైన స్త్రీ కొరకై సంస్కృత కళాశాల నిర్వహించింది. ఎన్ని ఆటంకాలెదురొచ్చినా ఎంతో పట్టుదలతో, ఆంధ్రప్రభుత్వ సహకారంతో స్త్రీ సంక్షేమ కార్యక్రమం ఒకటి కొన్ని సంవత్సరాల పాటు నిర్వహించింది. దాని వలన ఎంతోమంది స్త్రీలు వృత్తి విద్యలు నేర్చుకుని లాభం పొందగలిగారు. 1976 సంవత్సరంలో సంభవించిన పెను తుఫాను వలన నష్టపోయిన ఎంతో మంది దీన జనాలకు ధన సహాయం, ఆశ్రయం కలిగేలా ఏర్పాట్లుచేసింది. నాకు బాగా గుర్తున్నది, దివా రాత్రాలు విసుగూ, విరామాలు లుకుండా కృషి చేసింది.

బాపట్లలో ప్రప్రథమంగా సంగీత, నృత్య విద్యాభ్యాసాలకు అవకాశం కల్పించింది కూడా లక్ష్మీకాంతమ్మయే. విశ్వ హిందూ పరిషత్తు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నో హిందూ మత ప్రచార సభల్లో ఉపన్యాసాలు ఇచ్చింది. ఆమె జీవితంలో అలాంటి కార్యక్రమాలు వేల సంఖ్యలో ఉంటాయనే నా ఉద్దేశ్యం.

ఇవన్నీ ఈలాగుంటే కుటుంబరీత్యా ఆమె పెంచుకున్న ఆత్మీయతలూ, ఆప్యాయతలూ తలచుకుంటే తెలియని వారు ఆశ్చర్యపోతారు. ఉదాహరణకు తోటికోడళ్ళు మాత్రమేగాక ఆడపడుచులు గూడా ఆమెను సోదరీ భావంతో చూచేవారు. ముఖ్యంగా మా మేనత్తలు స్వర్గీయులు సావిత్రమ్మ, సత్యవతి, శారదాంబలైతే ఆమెను తోబుట్టువుగానే చూచుకున్నారు. తనకన్నా చిన్న తోటికోడళ్ళు శ్రీమతి సౌదామిని, స్వర్గీయ శ్రీమతి అనసూయలు కూడా ఎంతో ప్రేమతో, వాత్సల్యంతో అక్కా అని పిలుస్తుంటే వీరందరూ వేర్వేరు కుటుంబాలనుంచీ వచ్చినవారేనా అని అనిపించేది. అంతకన్నా ముఖ్యమైన విషయం మా చిన్నాయన శ్రీ హృషికేశ గుప్తగారంటే అమ్మకు ఎనలేని అభిమానం, వాత్సల్యం. అది పరస్పరాభిమానం. మా పిల్లలకు కూడా మా నాన్నగారి కంటే మా హృషీ బాబాయిగారంటే ఎంతో చనువు. అది ఇప్పటికీ కూడా సత్యమే.

ఇంకా బాపట్ల పురవాసులైతే ఒక పెద్ద అక్కయ్యగారిగానో, ఒక చిన్న చెల్లెమ్మగానో చూచుకుండేవారు.

వారిలో ముఖ్యులు సర్వశ్రీ బొడ్డుపల్లి పురుషోత్తం గారు, నాళం రామచంద్రరావు గారు, కాల్వ వరదరాజులు గారు, స్థానం పార్థ సారధి గారూ, డాక్టరు సంకా చలపతిరావు గారూ, మానాన్నగారి ముఖ్య స్నేహితులు స్వర్గీయ శ్రీ పిల్లుట్ల హనుమంతరావుగారలు. శ్రీ సంకా చలపతిరావు గారైతే ఎన్నో సంవత్సరాలు అమ్మకు, నాన్నగారికీ మాఅందఱు పిల్లలకూ వైద్య సహాయం కూడా చేశారు.

ఇంకొక ముఖ్యమైన విషయం నేను చెప్పకుండా ఈ ప్రసంగాన్ని ముగించితే నా కత్యంత సన్నిహితుడైన వ్యక్తికి తీరని అన్యాయం చేసినట్లవుతుంది. ఆ వ్యక్తి మరెవరో గాదు. నాకు బావమరిది అయినటువంటి శ్రీ ముత్తా గోపాలకృష్ణ గారు. 1996 సంవత్సరం జూలై నుంచీ సెప్టెంబరు వరకూ అమ్మ అత్యంత సంకట పరిస్థితిలో తీరని అనారోగ్యంతో హైదరాబాదు నగరంలో ఉన్నప్పుడు ఎంతో ఆదరంతో శ్రద్ధతో, అభిమానంతో తీరిక చేసుకుని వెళ్ళి అమ్మను పలకరించి ధైర్యం చెప్తూ నేను దగ్గర లేనికొరత తీర్చారు. మా అక్కయ్య అన్నయ్య, వదిన చెల్లి అందరూ దానివలన ఎంతో ధైర్యం పొందగలిగారు. అలాంటి అపత్సమయంలో అంతకన్నా మరేం కావాలి. ఏం జరిగినా మీకు అండగా నేనున్నాను అంటూ ధైర్యం కలిగించారు. వారికి నేను ఆజన్మాంతం కృతజ్ఞుడిని.

జననీ, జన్మప్రదాయినీ, జ్ఞానదాయనీ, మాతృదేవీ,
యా లక్ష్మీకాంతా, నమస్తస్యై, నమస్తస్యై, నమోః నమః ।

గృహలక్ష్మి స్వర్ణకంకణగ్రహీత - 1953వ సంవత్సరము

## శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి

### ఉపన్యాసము

ఆర్యశ్రీ కేసరి మహాశయా,

సోదరసోదరీమణులారా, అగ్రాసనాధిపా,

నమస్కారములు, ఈనాడు శ్రీ కేసరిగారునాయెడల కనబఱచిన అత్యధిక వాత్సల్యాదరములకు నా మనస్సు ఆనందంతోనూ, కృతజ్ఞతతోనూ నిండిపోయి ఏంమాట్లాడాలన్నా మాటలే రావడమూలేదు. శ్రీ కేసరిగారు చేసినసేవ-ముఖ్యంగా మహిళాజనసేవ అంతగొప్పది. ఈ వేళ నేను ఏకారణంపై ఇక్కడకు ఆహ్వానింపబడి వారిచేసమ్మానం పొందడానికి తగు అర్హతను పొందియున్నానో, ఆ 'ఆంధ్రకవయిత్రీచరిత్ర' అనే గ్రంథరచన ఉన్నదే. అది ముఖ్యంగా ఇట్టినారీ హితచింతనులైన మహానుభావుల లికల్మష సేవానురక్తిమీదే ఆధారపడియున్నది.

మనదేశం అన్నివిధాలా చాలా గొప్పదేశంగా ప్రఖ్యాతిపొందియున్నది. ఇప్పటికీ ఆఖ్యాతి దానికేమీ తఱుగలేదు. ఏదైనా ఒకదేశం తక్కిన దేశాలకు ఆదర్శప్రాయంగా ఉండదగినంత గొప్పదనం పొందిందంటే అది ఆదేశంయొక్క భాషపైనా, మతంపైనా, వాఙ్మయంపైనా, సంస్కృతిపైనా ఆధారపడిఉంటుంది. నాటికీ నేటికి మన పవిత్ర భరతఖండం ప్రశస్తి అవిచ్ఛిన్నంగానే ఉన్నది అంటే ప్రప్రథమంలో భారతఖండ ప్రతిష్ఠాపకులు, ఏతత్సంస్కృతీ నిర్మాతలైన మహాఋషులయొక్క బుద్ధిపాటవము, దేశహిత నిర్మాణరచనా చింతన మండలి అతి దూరాలోచన, దూరదృష్టి- సమ్యగ్భావన కారణం అని చెప్పాలి. ఎప్పటికైనా మహానుభావులకు ఒకటేచింత 'నాబాగుకంటె నాదేశం బాగుకోసం నేను పాటుపడడం నావిధ్యుక్త ధర్మం'; అనేదే. ఇట్టి ఉత్కృష్ట భావనతో మహానుభావులు పాటుపడ్డారు కాబట్టే తరతరాలు, యుగయుగాలూ దొరలిపోయినా ఇంకా దేశప్రఖ్యాతి సుప్రతిష్ఠితంగా ఉన్నది. అట్టిమహానుభావులలో శ్రీ కేసరిగారొకరంటే అతిశయోక్తి ఏమీలేదు.

ఇంకా కేసరిగారి విశేషం ఒకటి ఉన్నది. ఈదేశహిత ప్రణాళికలో కర్తవ్యాన్ని నిర్వహించిన వారిలో స్త్రీపుం వివక్షతలేదు. ముఖ్యంగా దేశసౌభాగ్యాన్నీ సమగ్రంగా శోభామయంగా రూపులు దిద్దడానికి ముఖ్యప్రాణమైన వాఙ్మయాభివృద్ధి విషయంలో సంగీత, సారస్వతాది ఉత్కృష్టాత్మమయమైన కళాభివృద్ధి విషయంలో స్త్రీపుం వివక్షత ఎంతమాత్రమూ పాటింపదగనిదీ, సహింపదగినదీకాదు. సృష్టిలో సర్వశక్తులూ సర్వప్రజ్ఞలూ, సర్వార్హతలూ స్త్రీపుం జాతులకు సర్వసమానంగానే ప్రదత్తం చేయబడి ఉన్నాయి.

అక్కడా అక్కడా చెదురు వాటుగా ఉన్న మహిళా వాఙ్మయాన్ని సేకరించి, సముద్ధరించి గృహలక్ష్మిలో అనూచానంగా ప్రచురింపజేశారు. ఈ విషయాలు ఇదివఱకే నేను గృహలక్ష్మిలో విపులంగా వ్రాసి ఉన్నాను. అట్లావారు చేయబట్టే నాఆంధ్రకవయిత్రులరచన సులువుగా పూర్తిఅయింది; నిజంగా అన్ని పత్రికల కంటే ఈ పత్రికే నాకు పెన్నిధిలాగ ఉపయోగపడింది.

ఇంత వీరశ్రద్ధకు కారణమేమిటా అని ఆలోచిస్తే "ఉదారచరితౌనాంతు వసుధైవ కుటుంబం" అన్న నానుడితప్ప నాకు వేరే కారణం కనబడటంలేదు.

స్త్రీ జాత్యుద్ధరణ దీక్షాకంకణాన్ని తాము ధరించి యింతపని చేస్తూన్న శ్రీ కేసరిగారికి విషయంలో నేనే ఋణపడి ఉన్నాను. నేనేకాదు యావత్తు స్త్రీజాతీ ఋణపడే ఉన్నది. ఇది ఎప్పటికీ వారికి తీర్చబడే ఋణంమట్టుకుకాదు. ఆవిషయం వారికీ తెలుసు! ఐనా ఇంకా వారు స్వయంగాచేసిన సేవ చాలకో అన్నట్లు ఈవిధంగా కంకణాలు కూడాఇచ్చి స్త్రీలను ప్రోత్సహిస్తూ ఉన్నారు.

అంటే స్త్రీజాతి ఉద్ధరణ నా ఒక్కనివల్లా నెఱవేరేదికాదు. మీరు స్వయంగా స్త్రీలైన మీరంతా మీజాతి అభ్యుదయం కోసం పాటుపడ్డానికి కంకణం గ్రహించండి, అని హెచ్చరించడం అన్నమాట.

అథమం కంకణం తీసుకొన్న స్త్రీలైనా అట్లావారి నాదర్శంగా తీసికొని స్వార్థరహితసేవ చెయ్యడానికి పూనుకొంటే వారికి సంతృప్తికలిగినట్లే ఎంచవచ్చును. అంతేకాదు. కొంతకు కొంతగా వారి ఋణాన్ని తీర్చడానికి ప్రయత్నం చేసినట్లుగా కూడా వారు తుష్టిపొందుతారు.

అట్లాచెయ్యడానికి సర్వవిధాలా నాకు ఈ మహనీయుల ఆశీర్వాదం తోడ్పడుతుందని ఆశిస్తూ ఉన్నాను.

ఇంక ఆంధ్రకవయిత్రుల చరిత్రరచనలో నేపడ్డపాట్లు ఇదివఱకే చాలా వేదికలమీదనుండి నేను పలుమార్లు చెప్పి ఉన్నాను. పుస్తకం రాబోతూ ఉన్నది "ముంజేతికంకణానికి అద్దం ఎందుకు?" మీరే నిర్ణయించుకొందురుగాని; దానివిషయం.

ఇంక ఆఖరుమాట శ్రీ కేసరిగారి ఆరోగ్యవిషయం:- వారి ఆరోగ్యం అందఱకూ కలత కలిగిస్తూనే ఉన్నది. అంత అనారోగ్యంలో ఉన్నా స్వయంగావచ్చి వారి అమృతహస్తంతో నాకు కంకణ బహుమానం చెయ్యాలని వారి ఉదారహృదయం అభిలషించిందీ అంటే అది నా భాగ్యం అని చెప్పాలి.దేశసేవారతులైన ఈ మహనీయులకు పరమేశ్వరుడితోఁధిక ఆయురారోగ్యాలు కల్గించాలని భక్తిపూర్వకంగా అంజలి బంధం చేస్తూ ఉన్నాను.

నేటి ఈ శుభసమయంలో నన్ను మిక్కిలీ హెచ్చుగా సంభావిస్తూ ఉన్నసాటి కవయిత్రీకులానికీ ఉపన్యాసకులకూ, ముఖ్యంగా శ్రీ కేసరిగారికి వారి అనుష్టానవర్గానికీ కృతజ్ఞతా వందనాలర్పిస్తూ విరమిస్తాను.

# గృహీత కాశీస్సు

శ్రీ సతి భోగభాగ్యములు - చేకురజేయననంతదృష్టి - నా
ణీసతి గూర్పవాక్ప్రభలు-నిత్యశుభంబులు ఆయువృద్ధి గౌ
రీసతి గూర్పసంతతము - శ్రీ కరలీలల మోదమందుచున్
కేసరి దత్తకంకణము-కేలధరింపును లక్ష్మీకాంతమా.

తళుకు బెళుకొత్తు నీకవి-తాకుమారి-నడల మురిపెంపు బలుకుల-నవ్యశోభ
పేరు ప్రఖ్యాతిగాంచుచు-గారవమున-కావ్యచంద్రికలన్ని ల్పె-కవులుబొగడ.
అవని అద్యత-నాంధ్రన వ్యాంధ్రకైత పసలదేవించి దెలిపిన-బహుళశక్తి
గలదు శ్రీలక్ష్మీకాంతనీ-కలమునందు-సహజపాండిత్యసౌరభ-సరణియనగ,
ఆంధ్రభోజుడవనగ వి-ద్యాప్రసక్తి-మనము వేయేండ్లు కలిమిని-మాన్యచరిత
సరససాహిత్య సన్మాన-సభలగూడి దాన కేసరివౌటమా-ధవునికృపను,
విదుషికవయిత్రివిమల వి-వేకసుగుణ-కవిత, సౌభాగ్యమాలక్ష్మీ-కాంతయనగ
అట్టి సోదరి సరసిన-త్యంతవిధిగ-గౌరవించుట స్త్రీ జన-గౌరవంబు.

గిడుగు లక్ష్మీ కాంతమ్మ, మద్రాసు

* * *

మానిత సత్య వాక్యరత మంజులహాస విశుద్ధమానసా
దానదయార్ద్ర శ్రీ తలసుదక్షిణదివ్య కరాబ్జనిశ్చల
జ్ఞాననిదాన సాధుజన పన్నుత సత్కవిపోష కేసరీం
ద్రానిను వేంకటేశ్వరుడు బ్రోవుత పూర్ణచిరాయురోన్న తిా
యిటులే యే టేటను మీ వీటఁ గామేశ్వరమ్మ విలసన్ముఖయై
హాటక కంకణరవములు దీటుకొనఁ వెలుగనేమదిన్ నుతియింతుఁ.

శ్రీమతి సౌభాగ్యవతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి కాశీపురస్సరంబుగా
కలిమి బలిమికీర్తి గలిగిసౌభాగ్యవై-తెలుగు తల్లి కడుపు చలువదనర
నెలతల తలమానికమా పలుకుల చెలి చేతిచిలుక బలికిన యటులఁ
బలికితివి, దెలుగు కవయిత్రుల జీవితగాథ తెల్లతోరముగాఁగఁ

కోమలి మల్లికాకుసుమ కుట్నలముర్ గల పొట్లమల్లన
కోమలలీల విప్పమది గూర్చెడి హాయినిఁజెప్పశక్యమే

* * *

శ్రీ కాంతాగిరిజా సరస్వతులు, రాశీభూతకారుణ్య రే
ఖాకర్ణాయత నేత్రలై సుకవిలోక ప్రీతిఁగావించు, దీ
క్షాకౌతూహల వృత్తి తోను భయభాషా ధన్యనూట్కారి, ల
క్ష్మీకాంతమ్మకు వాంఛితార్ధ ఫలముల్ చేకూర్చి పాలించుతన్.
భారతమాంధ్రమై పరిమళించి, 'రాజమండ్రి' యే సతికి జన్మస్థలంబు;
"మధురకవి" సమాఖ్యమాననీయుఁడు, కృష్ణ రాయఁడే భామినీరమకుఁదండ్రి,
'శ్రీపాదకృష్ణమూర్తి' కవీంద్రుఁడే తవ్వి కసమానసకల విద్యాగురుండు,
పాతక విభంగ గోదావరీతరంగ శీకరంబులే తేమకుఁ జెలిమికత్తె
లట్టి, వైదుషీమణివి,సర్వాంధ్రమందుఁ దలపనెవరీఁడు లక్ష్మీకాంతమ్మనీకు-
మొనమొన్నంగద తావకీ సరచితంబుర్, మేటి విద్వత్క వీం
ద్రని కాయస్తవనీయ మిప్పటి ప్రభుత్వా మోదమ్మున్ బొంది, కీ
ర్తిని గైసేసె; పురాతనాంధ్రకవయిత్రీ ధన్యగాధా ప్రవా
హనితాంత ప్రముదంబు జెందిరికదా! ఆంధ్ర ప్రజానీకముల్.

నానా కావ్య పదార్ధభావముల విన్నాణంబుగావించి, భా
షానీ రేజ విశాలపత్ర నయనానం సేవనాలోల లు
న్నే? నీ చందముగా ధరిత్రి, గృహలక్ష్మీ స్వర్ణపుంగంకణ
శ్రీ నీకేలనలంకరించెఁగద! లక్ష్మీకాంత విద్వన్మణీ!
కేసరి వంటిదాత పరికింపంగ నీసకలాంధ్ర మందనా
భాసము, ఈ కుటీర సహవాసనికే తన మెందులేదు, నీ
తో సరితూఁగఁగాఁ గలుగు తోయజలోచనలేదటంచు, వి
న్యాస మొనర్చె మాదుకవితాంఘ్రిమణుల్ రవళింప నీ సభన్॥

'కవిచంద్రులు' కోటసోదరకవులు', (అష్టావధానులు)

కూర్పు డా॥ జి.వి. పూర్ణచంద్

* * *

# 1953వ సం॥మున జరిగిన జయంతి ఉత్సవముల సందేశములు

లక్ష్మీకాన్తమ్మగారి ఆధ్వర్యంలో

ప్రియవార్త పులకించె మానస సరోవీచీ సుఖాందోళికా
శయనోల్లాసమరాళశాబకము వత్సాజీ! భవద్భద్ర వా
జ్మయకోశంబు సహస్ర పత్రముఖ మంగల్యంబుగావిచ్చి న
న్నియతో తేనియతో తొణంకునభినందింపంగ నస్మాదృశుత్.

అటు 'ముద్దుకవి' జనకునికి, ఇటు లివదాత నవనీత హృదయుడు పతికిన్,
ఘటియించితి వానందము తటస్థీమగు మిత్రజనము తనియగ విదుషీ,

చదివితివి ఉభయభాషలు, కదిపితివి విపంచికా సుఖస్వరతంత్రుల్
కదిలింపు మాంధ్ర మహిళా-కదంబమును తెనుగుద్వారకకు కవయిత్రీ!

పెట్ట మదరాసు గాజులు కట్ట మదిర చీరెల మమకారము బలిసెన్
పుట్టి పెరింగిన ఆంధ్రుల నట్టింటి సొగసులు మఱచినారు పురంధ్రుల్.

వాయింపుము నీవీ శియ-నాయెండి తపించు తెనుగు వాడలు తడియన్.
గాయని! సమాజ దీపచ్ఛాయలు ముడిగిన నడంగు సౌభాగ్యములున్

లిఖియింపుము నీవీణియ-నాయెండి తపించు తెనుగు వాడలు తడియన్,
ర్ముఖులై, నరు లత్యాశా నిఖాతమున జారిపడి మునిగి పోకుండన్.

చిత్రించుత నీ లేఖినిమైత్రీ ప్రియపాత్రముల, నమంగళ కుటిల
క్షేత్రమలీమసస్యల విత్రంబై మెఱయేతన్ పవిత్రాసి గతిన్ ;


రా. సుబ్బారావు

## మానేపల్లి లక్ష్మీకుమారి




ఆర్థిక సహకారానికి

కృతజ్ఞతలు




ఆర్థిక సహకారానికి


కృతజ్ఞతలు




గృహలక్ష్మి స్వర్ణకంకణం శ్రీకేసరిగారినుండి



కళాప్రపూర్ణ అవార్డు అందుకుంటూ
అర్జున్‌సింగ్‌గారితో




ఆంధ్రరచయిత్రుల మహాసభలు భానుమతిరామకృష్ణ, దేశిరాజు భారతిదేవి, నాయని కృష్ణకుమారి



కనకాభిషేకం
అనంతపురం 1988



లక్ష్మీకాన్తమ్మగారిని సన్మానిస్తూ
కోకా విమలకుమారి




సాహిత్య అకాడమిలో విశిష్ట సభ్యత్వం
జలగం వెంగళరావుగారి నుండి అందుకుంటూ




సరస్వతి సామ్రాజ్యంలో
సరస్వతి పాత్రధారిణి



ఆంధ్రవిశ్వకళా పరిషత్తు వారిచే
"కళాప్రపూర్ణ" గౌరవ పురస్కారం సందర్భంగా




ప్రపంచ మహాసభలు 1975 మండలి వెంకట కృష్ణారావుగారు



ఆంధ్రకవయిత్రులు పరిశోధన గ్రంథం
తెలుగుభాషాసమితి పోటీలో
గెలుపొందిన సందర్భం

నాళం కృష్ణారావు
విజ్ఞానపీఠం ఆవిష్కరణం (16.1.1988)





అఖిలభారత రచయిత్రుల మహాసభలో
డా॥ లక్ష్మీకాన్తమ్మ, డా॥ భానుమతి, లీలావతీ
మున్షీ, శ్రీమతి కాసు రాఘవమ్మ,
డా॥ కృష్ణకుమారి




డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ గారితో కోకా విమల కుమారి



డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ
శ్రీ హయగ్రీవ గుప్త దంపతులు